www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 23 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ చైత్ర శుద్ధ షష్ఠి
27 మార్చి - 02 ఏప్రిల్ 2023
వెల : ₹15/-



## ఆదర్శమూర్తి జానకీపతి

అందరికీ
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు...




## అన్ని వర్గాల క్షేమమే భారతీయ భావన

పానిపట్ ప్రకటన

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక


LANDMARK
HOSPITALS
Exellence. Ethical. Economical
NABH
ACCREDITED
WWW.LANDMARKHOSPITALS.NET
Happy
SRI RAMA
NAVAMI
OUR KEY DOCTORS
Dr. M Anil Kumar
UROLOGY
Dr. Vasanth Kumar
VASCULAR SURGERY
Dr. G Bhavya
GYNAECOLOGY
Dr. G Dhanunjaya Rao
NEUROSURGERY
Dr. Rajesh Kumar Songa
NEUROPHYSICIAN
Dr. Sudhir Reddy
ORTHOPEDICS
Dr. Sudharshan Reddy
ORTHOPEDICS
Dr. Sri Charan Malepati
ORTHOPAEDICS
Dr.Pradeep Kumar.R
PEDIATRICIAN
Dr. Lakshmi Kanth
GENERAL MEDICINE
Dr.J.V.Subba Reddy
DERMATOLOGY
Dr. Arif Ahmed Farooqui
GENERAL MEDICINE
Dr. T.P.Rajeev Reddy
GENERAL SURGEON
Dr. P.Srinivas
PULMONOLOGIST
WE ARE EMPANELLED WITH ALL INSURANCES
TELANGANA GOVT REIUMBERSEMENT FACILITY AVAILABLE.
ANDHRA PRADESH EHS CASHLESS FACILITY AVAILABLE.
OUR SPECIALITIES
Orthopaedics
Joint Replacement Surgery
Neuro Surgery
Urology & Nephrology
Gastroenterology
Plastic Surgery & Burns
Maxillofacial Surgery
General Medicine
General Surgery
Vascular Surgery
Obstetrics & Gynaecology
Infertility
Cardiology
ENT
Pulmonology
Paediatrics
Physiotherapy
Dermatology
Diabetology
Radiology
Dialysis
Near JNTU Metro Station, Hydernagar Main Road, opp. Vasantha Nagar Arch, Kukatpally, Hyderabad, Telangana




ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..

చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో

ఇపుడు జాగృతి వారపత్రిక

మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.

**రండి.. జాతీయభావాల వేదిక**

**జాగృతి చందాదారులుగా చేరుదాం! చేర్పిద్దాం!!**

## పాఠకుల విన్నపం మేరకు

## జాగృతి చందా పెంపు ముందు ప్రకటించినట్లు

## 2023 ఏప్రిల్ 1 నుండి కాకుండా 2023 జూన్ 1 నుండి అమలులోకి వస్తుంది. కనుక ఏప్రిల్, మే మాసాలలో జాగృతి చందా కట్టేవారికి పాత రేట్లే (1 సం. రూ. 650/-, 5 సం.ల రూ. 3000/-) వర్తిస్తాయి.

ఇట్లు:

కుర్రా దుర్గారెడ్డి,

అసోసియేట్ ఎడిటర్

**జూన్ 1 నుండి..**

| ఒక సంవత్సర చందా | విడి ప్రతి | ఐదు సంవత్సరాల చందా |
|---|---|---|
| **రూ.850/-** | **రూ.20/-** | **రూ.4000/-** |

**జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి. లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.**

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

Jagriti Bank A/c details :
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyd- 27. Ph : 9959997013. email : jagritiweeklysub@gmail.com

నాడు గాండ్రించింది. ఈ మార్చి 18న కంగుతింది. ఖలిస్తాన్ వాద తాజా స్వరూపమిదే. సరిహద్దు రాష్ట్రంలో ఆ ఒక్కరోజు పరిణామాలు ఇదే రుజువు చేశాయి. రాజకీయ సంకల్పం ఉండి, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలసి అడుగు వేస్తే ఇలాంటి వేర్పాటువాద, విద్రోహశక్తుల పని పట్టడం కష్టమేమీ కాదని చక్కగా రుజువు చేసిన ఘట్టమిది. నిన్న మొన్నటి వరకు దుబాయ్‌లో కారు డ్రైవర్. హఠాత్తుగా భింద్రెన్‌వాలె 2.0గా ప్రత్యక్షం కావాలని అనుకున్నాడు. అతడే అమృత్‌పాల్ సింగ్. వంద వాహనాలలో పంజాబ్ పోలీసులు, కేంద్ర బలగాలు 25 కిలోమీటర్లు వెంటాడినా అమృత్‌పాల్ తప్పించుకోగలిగాడు. కానీ రాష్ట్రమంతటా జల్లెడ పట్టి, పొలాల వెంట తరిమి తరిమి ఇంతవరకు 78 మంది అతడి అనుచరులను అరెస్టు చేశారు. అమృత్‌పాల్‌కు చెందిన రెండుకార్లు, ఆయుధాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. వారిస్ పంజాబ్ దె ఆర్థిక వ్యవహారాలు చూసే దల్జీత్ సింగ్ కాల్సిని గురుగావ్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఖాల్సా వాహిర్ పేరుతో అమృత్‌పాల్ జరపదలచిన ప్రదర్శనకు ఒకరోజు ముందే ఈ భారీ పోలీసు చర్య జరిగింది.

అమృత్‌పాల్ ఖలిస్తాన్ సానుభూతిపరుడు. వారిస్ పంజాబ్ దె సంస్థ అధిపతి. దీప్ సిద్ధు అనే సినీ నటుడు స్థాపించిన సంస్థ ఇది. సిద్ధు హఠాన్మరణంతో దానిని ఉద్ధరించడానికి అమృత్‌పాల్ దిగుమతయ్యాడు. నెలరోజుల క్రితం అమృత్‌సర్ జిల్లాలోని అజనాల పోలీస్ స్టేషన్ మీద ఇతడూ, ఇతడి గణాలు చేసిన దాడి దేశాన్ని విస్తుపోయేటట్టు చేసింది. కిడ్నాప్ కేసులో అరెస్ట్ చేసిన అమృత్‌పాల్ సహచరుడు లవ్‌ప్రీత్ సింగ్ తూఫాన్‌ను విడిపించేందుకే అదంతా. ఈ కాస్త విజయమిచ్చిన విరగబాటుతోనే ఆపరేషన్ బ్లూస్టార్ తరువాత ఇందిరకు పట్టిన గతే మోదీకీ, అమిత్‌షాకీ అనుగ్రహిస్తానని కూడా ప్రగల్భించాడితడు. మార్చి 2న పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలసి పరిస్థితి వివరించడంతోనే కదలిక మొదలైపోయింది. అక్కడ జి 20 సదస్సు జరగుతున్నందున ఈ కాస్త ఆలస్యం జరిగిందని తెలుస్తున్నది. అది ముగిసిన మరునాడే

శాలివాహన 1945 శ్రీ శోభకృత్ చైత్ర శుద్ధ షష్ఠి

**లోపలి పేజీలలో...**



ముఖపత్ర కథనం

**అన్ని వర్గాల క్షేమమే భారతీయ భావన**

6లో



ధారావాహిక నవల

**వరాహమిహిర**

- పాలంకి సత్య

20లో



మహిళ

**ఏనుగమ్మ ఏనుగు! ఆస్కార్ తెచ్చిందేనుగు...**

34లో

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : సిహెచ్. కుమార్

# జాగృతి

## సంపాదకీయం

అమృత్‌పాల్‌ను వెంటాడే పని మొదలైంది. సమస్యను మొగ్గలోనే తుంచివేయడం అనే నానుడికి వాస్తవరూపమే కేంద్రం చొరవ. కానీ తన కుమారుడిని అరెస్టు చేసి, పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతున్నారని అమృత్‌పాల్ తండ్రి తర్సేమ్‌సింగ్ ఆరోపించడం చాలా ప్రశ్నలకు తావిస్తుంది. అతడు ఒక గురుద్వారాలో దూరాడనీ, నేపాల్ మీదుగా కెనడా ఉడాయించే విధం గురించి చర్చించాడని కూడా వార్తలు వచ్చాయి.

అమృత్‌పాల్ నిస్సందేహంగా పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ చేతిలో

# పంజాబ్ పరిణామాలు

పావు. కానీ కరడుగట్టిన ఖలిస్తాన్ మద్దతుదారు, సంగ్రూర్ ఎంపీ సిమ్రన్‌జిత్ సింగ్‌మాన్ కూడా ఇతడిని సమర్థించలేదు. అజనాల పోలీస్ స్టేషన్ మీద దాడిలో ఇతడి మీద పోలీసులు చేయి వేయకపోవడానికి కారణం గురు గ్రంథసాహెబ్‌తో వెళ్లడమే. ఈ దుశ్చర్య సిక్కులను బాధించింది. ఇంగ్లండ్‌లో ఉంటున్న ఖలిస్తాన్‌వాది, దళ్ ఖల్సా వ్యవస్థాపకుడు జస్వంత్ సింగ్ ఠేకేదార్ కూడా అమృత్‌పాల్‌ను వెనకేసుకురాలేదు. పైగా ఈయన నాలుగు వాస్తవాలే చెప్పాడు. ఖలిస్తాన్ అంశం మీద ప్రజాభిప్రాయ సేకరణ జరగాలంటూ కొన్ని పాశ్చాత్య దేశాలలో జరుగుతున్న రగడ కేవలం ఐఎస్ఐ కుట్ర తప్ప భారతీయ సిక్కులకు దానితో సంబంధమే లేదని జస్వంత్ మార్చి 17న ఏఎన్ఐ వార్తా సంస్థకు చెప్పడం విశేషం. ఖలిస్తాన్‌కు అసలైన శత్రువు పాకిస్తానే అంటారాయన. అక్కడి ప్రభుత్వం చేతిలో కొందరు సిక్కులు పావులుగా మారిపోయారన్న ఆయన ఆరోపణ లోతైనది. ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని పంజాబీలో, భారతీయులో కోరడంలేదు. కెనడా, అమెరికా, బ్రిటిష్ జాతీయులు అది కోరితే దానికి విలువేమిటని ప్రశ్నించారు. అజనాలాలో అమృత్‌పాల్ దుందుడుకు వ్యవహారం గురించి అడిగితే అసలు అతడికి సిక్కుల చరిత్ర తెలియదని జస్వంత్ తేల్చారు. ఇతడు సాధించేదేమీ ఉండదనీ చెప్పారు. భారత్‌తో ఇప్పుడు యుద్ధానికి దిగే అవసరం లేదని పాకిస్తాన్ అనుకుంటున్నది. కానీ తన చేతిలో పావులుగా మారిన సిక్కులను మేపి పబ్బం గడుపుకోవాలని మాత్రం కోరుకుంటున్నదని తెగేసి చెప్పారాయన. అమృత్‌పాల్ పంజాబీ యువతకు చేస్తున్న బోధ కూడా ఇదే– పంజాబ్‌ను సంక్షోభంలోకి నెట్టడం. సిక్కు రాజ్యమంటూ ఏర్పడితే అది లాహోర్, నంకానా సాహిబ్‌ల వరకు వెళుతుంది కాబట్టి పాకిస్తాన్ అంతవరకు రానివ్వదని కూడా జస్వంత్ గుట్టు విప్పారు. ఇప్పుడు తలెత్తిన పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం ఆమ్ ఆద్మీ పార్టీకి లేనే లేదని తేల్చారాయన. బ్రిటన్‌లో ఖలిస్తాన్ ఉద్యమం దాదాపు అంతమైనట్టే, భారత ప్రభుత్వం సిక్కుల న్యాయబద్ధమైన కోరికలు నెరవేర్చాలని కోరారాయన. దీనికి తప్పులేదు. కాబట్టి ఖలిస్తాన్ ఇవాళ ఒక బూచి మాత్రమేనని తేలిపోయింది.

దేశ విభజన సమయంలో పాక్ అనుకూల మతోన్మాదులు సాగించిన అకృత్యాలు, ఊచకోతలను సిక్కులే విస్మరించడం చరిత్ర తలదించుకునే అంశం. ఖలిస్తాన్‌వాదుల పోకడలకి గతం తల దించుకుంటోంది. కాంగ్రెస్, ఆప్ దుష్ట రాజకీయాలు, పొరుగుదేశం విసిరిన మత్తు వల, అకాలీదళ్ అవకాశవాదం వీర పంజాబ్‌ను నిర్వీర్యం చేశాయి. కానీ కాంగ్రెస్ తన పాత విధ్వంసక పాత్రనే మళ్లీ పోషించే పనిలో ఉంది. అమృత్‌పాల్ మీద ఉగ్రవాద ఆరోపణలు చేయవద్దని ఆ పార్టీ ఎమ్మెల్యే సుఖ్‌పాల్ ఖైరా నిస్సిగ్గుగా ప్రకటించాడు. ఖలిస్తాన్ వాదానికి ప్రజల మద్దతు లేదని తేలిపోయిన తరువాత, ప్రస్తుతం బిగించిన పట్టును కేంద్రం అలాగే కొనసాగించడం అవసరం. ఇందుకు ఆప్ సహకరించాలి. ఢిల్లీ అల్లర్లతో మూటగట్టుకున్న పాపానికి ఇలాగైనా పరిహారం చేసుకోవాలి. ★

27 మార్చి 2023, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్


38లో

కథ

**ప్రభువు**

– సింహప్రసాద్

ధరహాసం





| | | |
|---|---|---|
| ప్రశ్నాపత్రాల లీకేజీ–బాధ్యులెవరు? బాధితులెవరు? (తెలంగాణ) | - | 14 |
| వైసీపీకి 'పట్టభద్రుల' షాక్ (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| మూడో దఫాలోనైనా బుద్ధి మారేనా? (అంతర్జాతీయం) | - | 24 |
| యుగయుగాల ఆదర్శమూర్తి జానకీపతి (ప్రత్యేక వ్యాసం) | - | 26 |
| వీరవనిత రోపుయిలియాని (ఆజాదీ కా అమృత్ మహోత్సవ్) | - | 30 |
| ఊపిరి కన్నా ఉద్యమం మిన్న (స్వాతంత్ర్య అమృతోత్సవాలు) | - | 32 |
| ప్రతిపక్షాల ఐక్యత అయ్యే పనేనా? (జాతీయం) | - | 36 |
| మదిని కుదిపే 'రంగమార్తాండ' (సినిమా) | - | 42 |




# అన్ని వర్గాల క్షేమమే భారతీయ భావన

## 'స్వ' ఆధారిత పునరుజ్జీవనోద్యమానికి ఆర్‌ఎస్‌ఎస్ పానిపట్ సభల పిలుపు

పానిపట్ పేరు ప్రస్తావించగానే భారతదేశ చరిత్రలో కీలకమైన మూడు యుద్ధాలు గుర్తుకు వస్తాయి. 1526, 1556, 1761లలో జరిగిన ఆ యుద్ధాల ఫలితాలన్నీ భారతదేశంలో విదేశీ పాలన సుస్థిరం చేసినవే. మొదటి యుద్ధంలో గెలిచినవాడు బాబర్. రెండో యుద్ధంలో గెలిచినవాడు అక్బర్. మూడో యుద్ధంలో గెలిచినవాడు అహమ్మద్ షా అబ్దాలీ దురానీ. చివరి యుద్ధంలో ఓడినవారు మరాఠీలు. శివాజీ మహరాజ్ వారసులు. ఏ విధంగా చూసినా ఆ యుద్ధాలు భారతీయత మీద అప్పటికే ముసురుకుని ఉన్న చీకట్లను మరింత చిక్కబడేటట్టు చేసినవే. కానీ స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాల తరువాత హిందువులు సాధించిన సానుకూల విజయం గురించి అక్కడే ఆర్‌ఎస్‌ఎస్ ప్రకటించింది. మనసుల మీద సాధించిన గొప్ప గెలుపు అది. మార్చి 12-14, మూడు రోజుల పాటు పానిపట్టు జిల్లా, పట్టికల్యాణలో జరిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభ స్వతంత్ర భారతదేశంలో హిందూ విజయ పరంపర గురించి సవినయంగా ప్రకటించింది.



'దేశం, జాతి రెండు వేర్వేరు అంశాలు. దేశాన్ని రాజ్యాంగం ఏర్పరుస్తుంది. అది ప్రభుత్వాధికారం. జాతి అంటే సాంస్కృతిక అంశం. ఇప్పుడు కాదు, ఎప్పటి నుంచో భారత్ హిందూ దేశమే. కాబట్టి భారత్‌ను కొత్తగా హిందూదేశం చేయవలసిన అవసరం లేదు' రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్ కార్యవాహ్ దత్తాత్రేయ హొసబలె చెప్పిన మాటలివి. హిందూ అనే పదం సాంస్కృతిక పరమైనదని మేం గడచిన నూరేళ్లుగా చెబుతూనే ఉన్నామని కూడా సర్ కార్యవాహ్ గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రతినిధి సభల (ఏబీపీఎస్) ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్ కార్యవాహ్ మరొకసారి ఈ స్పష్టత ఇచ్చారు. ఇంకెన్నిసార్లు, ఎవరు ప్రశ్నించినా ఆర్ఎస్ఎస్ నుంచి ఇదే సమాధానం వస్తుందని ఆయన నిర్ద్వంద్వంగా చెప్పినట్టయింది. మైనారిటీలను రెచ్చగొట్టేందుకు ఆర్ఎస్ఎస్ స్వీకరించిన హిందూ ఐక్యత నినాదాన్ని ఇంకా ఉపయోగించుకోవాలన్న మీ ఎత్తులకు స్వస్తి

తీర్మానం

# 'స్వ' (స్వయం, స్వావలంబన) ఆధారంగా రాష్ట్ర పునరుజ్జీవనం కోసం సంకల్పిద్దాం!

**సేవా సాధన, గ్రామ వికాస్ కేంద్రం, పట్టికల్యాణ-పానిపట్ (హరియాణా)**

**చైత్ర కృష్ణ 5 - 7 యుగాబ్ద 5179 (12-14 మార్చి, 2023)**

ప్రపంచ శ్రేయస్సు అనే ఉదాత్త లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు భారత్ చేపట్టిన 'స్వ' సుదీర్ఘ ప్రయాణం మనందరికీ ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని అఖిల భారతీయ ప్రతినిధి సభ (ఏబీపీఎస్) అభిప్రాయపడింది. విదేశీ దండ యాత్రలు, దురాక్రమణదారులతో మన జాతి జరిపిన పోరాటాల కాలంలో, భారత సామాజిక జీవితం చెదిరిపోయింది. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, మత వ్యవస్థలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. ఈ సమయంలో పూజ్య సాధువులు, మహోన్నత వ్యక్తుల నిర్వహణలో యావత్తు సమాజం అవిశ్రాంత పోరాటం సాగిస్తూ తన 'స్వ'ను కాపాడుకుంది. ఈ పోరాటానికి ప్రేరణ స్వధర్మం, స్వదేశీ, స్వరాజ్యం అనే 'స్వ-త్రయం'. ఇందులో సంపూర్ణ సమాజం భాగస్వామ్య మయింది. స్వాతంత్ర్య అమృత మహోత్సవాల శుభ సందర్భంగా, ఆ పోరాటంలో పాల్గొన్న ప్రజా నాయకులను, సమరయోధులను, దార్శనికులకు దేశం మొత్తం కృతజ్ఞతాపూర్వకంగా నివాళి ఘటిస్తోంది.

స్వాతంత్ర్యానంతరం అనేక రంగాల్లో విశేషమైన విజయాలు సాధించాం. నేడు, భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదుగుతోంది. భారతీయ శాశ్వత విలువలపై ఆధారపడిన పునరుజ్జీవనాన్ని ప్రపంచం నేడు అంగీకరిస్తోంది. 'వసుధైవ కుటుంబకం' అనే భావనతో కూడిన జీవన విధానం మీద ఆధారపడి ప్రపంచ శాంతి, సార్వత్రిక సౌభ్రాత్రం, మానవ శ్రేయస్సును నిర్ధారించే పాత్రను పోషించే దిశగా భారత్ దూసుకుపోతోంది.




చక్కటి వ్యవస్థీకృత, ఉజ్జ్వలమైన, సుసంపన్నమైన దేశాన్ని నిర్మించే ప్రక్రియలో, సమాజంలోని అన్ని వర్గాల ప్రాథమిక అవసరాలను తీర్చడం, సమగ్ర అభివృద్ధికి అవకాశాలను, భారతీయ భావన ఆధారంగా కొత్త నమూనాలను నిర్మించడం వంటి సవాళ్లను మనం అధిగమించాల్సిన అవసరం ఉందని ఏబీపీఎస్ అభిప్రాయపడింది. ఆధునిక సాంకేతికతను తెలివిగా ఉపయోగించుకుంటూ పర్యావరణ అనుకూల అభివృద్ధి ద్వారా దేశ పునర్నిర్మాణం కోసం, కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం, సౌభ్రాత్రం భావన ఆధారంగా సామరస్య సమాజాన్ని సృష్టించడం, స్వదేశీ స్ఫూర్తితో దేశీయంగా వివిధ పరిశ్రమలను స్థాపించి, అభివృద్ధి చేయడం వంటి లక్ష్యాల సాధనకు మనం ప్రత్యేక కృషి చేయాలి. మొత్తం సమాజం, ముఖ్యంగా యువత ఈ విషయంలో సమష్టిగా కృషి చేయవలసి ఉంటుంది.

అనేక దేశాలు భారత్ పట్ల గౌరవాన్ని, సద్భావనను కలిగి ఉండగా, ప్రపంచంలోని కొన్ని శక్తులు మాత్రం 'స్వ' ఆధారంగా భారతీయ పునరుజ్జీవనాన్ని అంగీకరించడం లేదనే వాస్తవాన్ని నొక్కి చెప్పాలని ఏబీపీఎస్ కోరుకుంటోంది. దేశంలోనూ, బయటా హిందుత్వ ఆలోచనను వ్యతిరేకించే ఈ శక్తులు స్వార్థ ప్రయోజనాలను, విభజనను ప్రేరేపించడం ద్వారా సమాజంలో పరస్పర అపనమ్మకం, వ్యవస్థాగత పరాయీకరణ, అరాచకత్వం సృష్టించేందుకు కొత్త కుట్రలు పన్నుతున్నాయి. వీటన్నింటి పట్ల అప్రమత్తంగా ఉంటూనే వారి వ్యూహాలను చిత్తు చేయాలి.

భారత్ ప్రపంచ నాయకత్వ స్థానాన్ని పొందేందుకు సమష్టిగా కృషి చేసే అవకాశాన్ని ఈ 'అమృత కాలం' మనకు కల్పిస్తోంది. భారతీయ ఆలోచనా విధానం వెలుగులో విద్యా, ఆర్థిక, సామాజిక, ప్రజాస్వామిక, న్యాయ సంస్థలు సహా సామాజిక జీవితంలోని అన్ని రంగాలలో సమకాలీన వ్యవస్థలను అభివృద్ధి చేసే ఈ ప్రయత్నంలో యావత్ సమాజమూ విజ్ఞతతో, తన సంపూర్ణ శక్తితో పాల్గొనాలని ఏబీపీఎస్ పిలుపునిస్తోంది. తద్వారా సార్వత్రిక శ్రేయస్సు కోసం కట్టుబడి ఉన్న బలమైన, సంపన్న దేశంగా ప్రపంచ వేదికపై భారత్ తన సముచిత స్థానాన్ని పొందుతుంది. ★

తెలంగాణలో

# సంఘం వేగంగా విస్తరిస్తోంది!

‘కరోనా సృష్టించిన విపత్కర పరిస్థితుల్ని తట్టుకొని దేశవ్యాప్తంగా, తెలంగాణ లోనూ సంఘకార్యం వేగంగా విస్తరిస్తోంది. 2024 నాటికి లక్ష గ్రామాలకు చేరుకోవాలన్న లక్ష్యాన్ని తప్పక పూర్తిచేయగలమనే విశ్వాసం కార్యకర్తలందరిలో కనిపిస్తోంది. శాఖల విస్తరణతోపాటు సామాజిక కార్యక్రమాలనూ విస్తరించాలన్నదే మా లక్ష్యం’ అని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్ అన్నారు. ఇటీవల హర్యానాలో మూడురోజుల పాటు జరిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభల విశేషాలను, తెలంగాణలో సంఘ విస్తరణ గురించి మార్చి 16న హైదరాబాద్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యాలయంలో విలేకరులకు వివరించారు.

తెలంగాణలో మొత్తం 1616 ఉపమండలాలలో 1138 చోట్ల శాఖలు ఉన్నాయని, గత సంవత్సరంతో పోలిస్తే శాఖల సంఖ్య 8 శాతం పెరిగిందని ఆయన వెల్లడించారు. అలాగే నగరాలలో 1447 బస్తీలకు 1075 చోట్ల శాఖ కార్యక్రమాలు జరుగుతున్నాయని, గతంతో పోలిస్తే 9 శాతం వృద్ధి సాధించామని తెలిపారు. శాఖల ద్వారా జరిగే సేవాకార్యక్రమాలు కూడా ఇటీవల విస్తరించామని కాచం రమేశ్ తెలిపారు. 856 స్థలాలో వివిధ సేవాకార్యక్రమాలు జరుగుతున్నాయని, గత ఏడాది కంటే 208 చోట్ల సేవా కార్యక్రమాలు పెరిగాయన్నారు. 60 శాతం శాఖలు గ్రామం లేదా బస్తీకి ఉపయోగపడే ఏదో ఒక కార్యక్రమాన్ని (ఉపక్రమం) నిర్వహిస్తున్నాయి. మొత్తం 1017 సేవా బస్తీలలో (మురికివాడలు) 337 స్థలాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఇవి రెట్టింపయ్యాయని పేర్కొన్నారు.

అంతేకాదు, నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవ సమితి అధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 17, 2022న 491 మండల కేంద్రాల్లో




త్రివర్ణపతాక ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో 31 వేలకు పైగా ప్రజానీకం పాల్గొన్నారు. అలాగే 61 జిల్లాల్లో యువసమ్మేళనాలు జరిగాయని, ఇందులో లక్షన్నరకు పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. 2023, జనవరి 1–15 వరకు జరిగిన ప్రచార కార్యక్రమంలో 7 వేల గ్రామాలలో ఇంటింటికి వెళ్లి 15 లక్షల కుటుంబాలకు తెలంగాణ విముక్తి పోరాట చరిత్రను తెలిపే కరపత్రంతో, 16 లక్షల స్టిక్కర్లు అందజేశామని కాచం రమేశ్ పేర్కొన్నారు. మరో రెండేళ్లలో సంఘ శతాబ్ది నేపథ్యంలో లక్ష గ్రామాలకు సంఘకార్యాన్ని విస్తరించాలన్న లక్ష్యాన్ని సులభంగా చేరగలమనే విశ్వాసం కార్యకర్తలందరిలో కనిపిస్తున్నదని రమేశ్ అన్నారు.

సమాజాభివృద్ధికి కూడా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించి అక్కడి అవసరాలను గుర్తించి, అందుకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాలిథిన్ రహిత జీవనాన్ని ప్రోత్సహించడం, జలవనరులను వృద్ధి చేయడం, వృక్షాల సంఖ్య పెంచడం వంటి కార్యక్రమాలను ప్రజల సహకారాలతో నిర్వహిస్తామని అన్నారు. అలాగే ప్రజలలో సమరసత, సద్భావన పెంపొందించడం కోసం కృషిచేస్తామని తెలిపారు. అనంతరం విలేకరుల ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. ఈ సమావేశంలో క్షేత్ర ప్రచార ప్రముఖ్ ఆయుష్ నడింపల్లి పాల్గొన్నారు. ★

---

ఉపయోగించుకోవాలన్న మీ ఎత్తులకు స్వస్తి చెప్పడం మంచిదన్న హెచ్చరిక అందులో ఉంది. 98 ఏళ్ల నుంచి ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్రం గురించి స్పష్టమైన అవగాహన కలిగి ఉంది. అది ఒకరిని ద్వేషించేది కాదు. ఆర్‌ఎస్‌ఎస్ ఎలాంటి భావన కలిగి ఉన్నదో, భారత అత్యున్నత న్యాయస్థానం కూడా అదే భావనను తన తీర్పు ద్వారా వ్యక్తం చేసిన సంగతి విస్మరించలేనిది. హిందూ అన్నది మతాన్ని సూచించే పదం కాదు, అది ఒకే జీవన విధానాన్ని తరాతరాలుగా ఆచరిస్తున్న జాతికి ఉన్న గుర్తింపు మాత్రమేనని సుప్రీంకోర్టు వెల్లడించింది. అయినా వీలు దొరికిన ప్రతిసారి ఒక వర్గం మీడియా, ఉదారవాద ముసుగులోని భారత వ్యతిరేకులు, మేధావులుగా చెలామణి అవుతున్న ఉగ్రవాద సమర్ధకులు, అర్బన్ నక్సల్స్ ఈ అంశాన్ని లేవనెత్తుతూనే ఉంటారు. కాగా, ఏబీపీఎస్ సభలు హరియాణాలోని పానిపట్టు జిల్లా, పట్టికల్యాణ (సమల్క)లో జరిగాయి. దేశం నలుమూలల నుంచి దాదాపు 1400 ప్రతినిధులు హాజరయ్యారు.

ఏబీపీఎస్ అంటే ఆర్‌ఎస్‌ఎస్‌లో అత్యున్నత విధాన రూపకల్పన వేదిక. ఏటా మార్చి మొదటి వారం జరిగే సమావేశాలలో భవిష్యత్ ప్రణాళిక పటిష్టంగా రూపొందుతూ ఉంటుంది. గడచిన ఏడాది కాలంలో సాధించిన దానిని సమీక్షించుకుంటారు. ఇలాంటి పాత ప్రశ్నలకు తగినట్టుగా సమాధానాలు ఇవ్వడం అందులో భాగం మాత్రమే. ఇవి క్రమం తప్పకుండా జరిగే సభలే. దేశం ఎదుర్కొంటున్న అనేక అంశాల గురించి ఇక్కడ చర్చిస్తారు. హిందూ సాంస్కృతిక పరిరక్షణ, సేవా కార్యక్రమాల చర్చలే ఇందులో ప్రధానంగా ఉంటాయి. హిందువుల ఐక్యత, జాతీయత ఆధారంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రయాణాన్ని నిర్ణయిస్తారు. ఆ మేరకే తీర్మానాలు రూపొందిస్తారు. భారత్‌కు విశ్వగురు స్థానం దక్కాలన్నదే ఆర్‌ఎస్‌ఎస్ స్వప్నం. 98 ఏళ్లుగా ఆ ఆశయంతోనే మనుగడ సాగిస్తున్నది. ఆ భవ్య స్వప్న సాకారం కోసం స్వయంసేవకులు సర్వం ఒడ్డి పోరాడతారు. సర్వశక్తులు వెచ్చించి కష్టిస్తారు. ‘పరమ్ వైభవం’ అన్న సంఘ ప్రార్థనలోని మాట వారిని నడిపిస్తుంది. ఇక ఇటీవలి కాలంలో సంఘం ప్రతినిధుల నోటి నుంచి వచ్చే విధాన నిర్ణయం గురించిన ప్రకటన కోసం భారతదేశంతో పాటు, ప్రపంచంలోని హిందూ సమాజం కూడా ఎదురు చూసే వాతావరణం

ఆంధ్రప్రదేశ్‌లో

# అందరికి చేరువ కావడమే లక్ష్యం



'సర్వ వ్యాప్తి, సర్వస్పర్శ' నినాదంతో– రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ శతాబ్ది (2525) ఉత్సవాలకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. శాఖలను విస్తరింపజేయడంతో పాటు శాఖలలో కొత్తవారి సంఖ్య పెంపుపైనా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ రెండేళ్లలో వివిధ కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలు, అన్నివర్గాల వారి చెంతకు చేరాలనే యోచనతో ముందడుగు వేస్తోంది. హరియాణాలో మూడు రోజులపాటు నిర్వహించిన అఖిల భారత ప్రతినిధి సభ ప్రధాన తీర్మానం, ప్రస్తావనకు వచ్చిన అంశాలు– కార్యాచరణల గురించి విజయవాడలోని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రధాన కార్యాలయం హైందవిలో ప్రాంత సహ సంఘ చాలక్ సుంకవల్లి రామకృష్ణ, ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు, సహ ప్రాంత ప్రచార ప్రముఖ్ సీహెచ్.వాసు మీడియాకు తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో 2022–23 లెక్కల ప్రకారం 1,496 శాఖలున్నాయి. సాప్తాహిక్ మిలన్, సంఘ మండల్లను కలిపితే మొత్తం 2277 వరకు ఉన్నాయి. దేశం మొత్తం మీద 2023–24 సంవత్సరంలో లక్ష గ్రామాలకు శాఖలు విస్తరింపజేయాలని సంకల్పించిన నేపథ్యంలో రాష్ట్రంలోనూ రెండు వేల వరకు శాఖలను విస్తరింపజేయడంతోపాటు ప్రతి పంచాయతీ పరిధిలోనూ శాఖా కార్యకలాపాలు తప్పనిసరిగా ఉండాలని అఖిల భారత ప్రతినిధి సభ సమావేశాల్లో రాష్ట్ర ప్రతినిధులకు లక్ష్యంగా నిర్దేశించారు. కొత్తగా సంఘానికి వచ్చే యువకులకు ఏడు రోజుల శిక్షణ తరగతులను నిర్వహిస్తారు. గత ఏడాది రాష్ట్రంలో ఏడు రోజుల శిక్షణను 3,549 మంది యువకులు పూర్తి చేశారు. వచ్చే సంవత్సరం ఆరు వేల మంది యువకులకు విజయవాడ, విశాఖపట్నం కేంద్రాలుగా శిక్షణ ఇవ్వాలనేది ఓ ప్రణాళిక. ఆర్ఎస్ఎస్‌లో కొత్త చేరికలకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా గత నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా ఏడు లక్షల 25 వేల మంది నమోదైతే– రాష్ట్రంలో ఈ సంఖ్య 13,250 చేరారు.

బలహీనవర్గాల విద్యార్థులకు వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవా బస్తీలలో 750 ఉచిత ట్యూషన్ కేంద్రాలను సంఘ్ నడుపుతోంది. ఈ సంఖ్యను వచ్చే సంవత్సరం 1,500కు పెంచాలని నిర్ణయించింది. సమగ్ర గ్రామీణ వికాసం కోసం గ్రామాలలో ప్రతి జిల్లాలో ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాలను ఎంపిక చేయనుంది. సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను అధిగమించడం కోసం సామాజిక వర్గాల వారీగా పెద్దలతో సద్భావన సమావేశాలు నిర్వహించనుంది. మే నెలలో ఎంపిక చేసిన సంఘ కార్యకర్తలకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనుంది. ★

**అఖిల భారతీయ స్థాయిలో శాఖ నివేదిక**

| | 2022 సం. | 2023 సం. |
|---|---|---|
| స్థలాలు | 37,903 | 42,613 |
| శాఖలు | 60,117 | 68,651 |
| సాప్తాహిక్ మిలన్‌లు | 20,826 | 26,877 |
| సంఘమండలి | 7,980 | 10,412 |
| సేవా కార్యక్రమాలు | 61,882 | 72,604 |

| | ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ |
|---|---|---|
| స్థలాలు | 955 | 1641 |
| శాఖలు | 1498 | 2497 |
| సాప్తాహిక్ మిలన్ | 634 | 359 |
| సంఘమండలి | 147 | 545 |
| సేవా స్థలాలు | 615 | 838 |
| సేవా కార్యక్రమాలు | 881 | 1485 |

ఏర్పడింది. బహుశా డిజ్ మ్యాంటిలింగ్ గ్లోబల్ హిందుత్వ కుట్రదారుల దుష్ప్రచారం ఫలితం అంతిమంగా ఇలాంటి రూపాన్ని తీసుకుని ఉండవచ్చు. సంఘం పట్ల డిజ్‌మ్యాంటిలింగ్ గ్లోబల్ హిందుత్వ పేరుతో జరిగిన ప్రచారానికీ, వాస్తవంగా భారతదేశంలో సంస్థకు ఉన్న పేరు ప్రతిష్టలకూ పొంతన లేని సంగతి క్రమంగా ప్రపంచ ప్రజానీకానికి తెలిసింది.

కశ్మీర్‌లో 370 అధికరణ రద్దుకు ఆర్ఎస్ఎస్ మద్దతు ఇచ్చింది. ఆ అధికరణం రద్దు వల్ల కశ్మీర్ లోయలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్న వాస్తవం వెల్లడవుతూనే ఉంది. అయోధ్యలో రామ మందిర నిర్మాణం సంఘ్ ఆశయం. ఇప్పుడు ఆ స్వప్నం సాకారమైంది. వచ్చే జనవరిలోనే ఆ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరగబోతున్నది. తలాక్ రద్దు కూడా ప్రపంచం ఒక అభ్యుదయ చర్యగానే స్వీకరించింది. ఇవన్నీ పరోక్షంగా, ప్రత్యక్షంగా సంఘ్‌తో బంధం ఉన్న వ్యక్తులు సాధించిన ఫలితాలే. అందుకే సంఘ్ అత్యున్నత విధాన నిర్ణయ వేదిక చర్చలు మరింత ప్రత్యేకతను సంతరించుకున్నట్టు కనిపిస్తున్నది. ఈశాన్య భారత్‌లో హిందుత్వ ప్రభంజనం వీచేటట్టు చేయడానికి జరిగిన కృషి కూడా ఆర్ఎస్ఎస్ పట్ల ఇంతవరకు కొందరిలో ఉన్న దురభిప్రాయాలను వారు మార్చుకునేటట్టు చేసింది. అక్కడి ఏడు రాష్ట్రాలకుగాను ఆరు చోట్ల బీజేపీ లేదా బీజేపీ భాగస్వామిగా ఉన్న పార్టీలే అధికారంలోకి వచ్చాయి. దేశ ఐక్యతకు సంఘ్ విఘాతం కలిగిస్తున్నదంటూ కుహనా మేధావులు, కమ్యూనిస్టులు, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న కుతర్కాన్ని ఈశాన్య భారత ఎన్నికల ఫలితాలు పటాపంచలు చేశాయి. మనం భారత్‌లో అంతర్భాగం కాదని అక్కడి చాలా ఉగ్రవాద సంస్థలు చేసిన ప్రచారాన్ని సంఘ్ తన సేవా కార్యక్రమాల ద్వారా తిప్పికొట్టగలిగింది. క్రైస్తవ మిషనరీల ఉక్కు పిడికిలిలో చిక్కుకుపోయిన భారతీయ గిరిజనులను దాని నుంచి తప్పించడానికి ఆర్ఎస్ఎస్ ఎన్నో త్యాగాలు చేయవలసి వచ్చింది. వేర్పాటువాదాన్ని గట్టిగా వినిపించిన ఆ కొండలు ఇప్పుడు భారతమాతకు జైకొట్టడం వెనుక సంఘ్ దీక్షాదక్షతలు ఉన్నాయి. ఆ విధంగా ఒక వ్యూహాత్మక ప్రాంత జనాభాను మేల్కొలిపి భారత జన జీవన స్రవంతిలో కలిసేటట్టు సంఘ్ సానుకూల దృక్పథంతో

# VIJAYANAGAR COLLEGE OF COMMERCE

(Affiliated to Osmania University) (College Code:1234) (Estd: 1973)

Sponsored by Vijayanagar Vidya Samithi

Vijayanagar Colony, Hyderabad – 57. Tel: 040-23340129/040-23342927

## COURSES OFFERED

B. Com General

B. Com Computer Applications

Admissions through Degree Online Services Telangana [DOST]

Our College Id for DOST is 11234

50 YEARS OF EXCELLENCE 1973 - 2023

All the students are advised to get their mobile phone linked with AADHAAR. They are also advised to apply for Caste Certificate and Income Certificate

- Scholarship and Bus Pass as per TS Government Rules
- Best Qualified Faculty
- Well Equipped Computer Lab & Library
- Nominal Fee
- A Very Long Run NCC and NSS Wings
- Encouragement for Sports and Games

# VIJAYANAGAR JUNIOR COLLEGE

(Govt. Aided) (Recognized by B.I.E., Government of Telangana) (Estd: 1984)

Sponsored by Vijayanagar Vidya Samithi

Vijayanagar Colony, Hyderabad – 57

Tel: 040-23342927/040 -23340129 and 040-35864861

## COURSES OFFERED

## Intermediate - MPC, MEC and CEC

Scholarship and Bus Pass as per TS Government Rules

Close Supervision and Nominal Fee

Best Qualified Faculty and Well Equipped Library

**Prof. G. GOPAL REDDY**
President
Vijayanagar Vidya Samithi

**Sri M. RAJAMAHENDER REDDY**
Secretary
Vijayanagar Vidya Samithi

**VNCC & VNJC - THE RIGHT CHOICE FOR A BRIGHT CAREER**

# ఆ ముగ్గురు మహనీయులను స్మరించుకుందాం!

హరియాణాలో జరిగిన అఖిల భారత ప్రతినిధి సభ చేసిన తీర్మానం గురించి వెల్లడించిన సమయంలోనే సర్ కార్యవాహ్ దత్తాత్రేయ హొసబలె మరొక ముఖ్య ప్రకటన కూడా చేశారు. వచ్చే సంవత్సరం ఆర్య సమాజ స్థాపకుడు, మహోన్నత సంస్కర్త స్వామి దయానందుల 200వ జయంతి. మరాఠా వీరుడు, హిందు ధర్మ పరిరక్షకుడు ఛత్రపతి శివాజీ పట్టాభిషేక ఉత్సవం 350వ వార్షికోత్సవం కూడా. ఇక జైన మత వ్యవస్థాపకుడు మహావీరుడు నిర్యాణం చెంది 2550 సంవత్సరాలు పూర్తయింది. ఈ మూడు సందర్భాలు 2024లోనే వచ్చాయి. ఈ సందర్భంగా జరిగే కార్యక్రమాల నిర్వాహణకు స్వయంసేవకులు శక్తి వంచనే లేకుండా పాటు పడగలరని హొసబలె హొసబలె చెప్పారు.







బానిస మనస్తత్వం నుంచి బయటపడి ఆత్మగౌరవంతో, ఆత్మస్థయిర్యంతో మెలగడం ఎంత అవసరమో చెప్పిన మహోన్నత భారతీయుడు ఛత్రపతి శివాజీ (1630-1680). జ్యేష్ట శుద్ధ త్రయోదశి నాడు ఆయన పట్టాభిషేకం జరిగింది. దానితో హైందవీ స్వరాజ్య స్థాపన జరిగింది. ఈ గొప్ప సందర్భాన్నే హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటున్నాం. మహారాష్ట్రలోనే కాకుండా, దేశమంతటా కూడా ఈ సందర్భంలో కార్యక్రమాలు జరగబోతున్నాయి. స్వయంసేవకులతోపాటు, అన్ని వర్గాల ప్రజలు వాటిలో భాగం పంచుకోవాలని ప్రతినిధి సభ విజ్ఞప్తి చేసింది. శివాజీ సమర్ధపాలనకీ, యుద్ధనీతికి ప్రతీకగా నిలిచారు. నిష్పాక్షికమైన పాలనలో, మహిళలను గౌరవించడంలో ఆయనది చరిత్రాత్మక దృష్టి. సనాతన ధర్మ పరిరక్షణ, సంస్కృతిని గౌరవించడం ఆయన జీవితంలో ప్రత్యేకంగా కనిపించే లక్షణాలు. అష్టప్రధానుల నియామకం, స్థానిక భాషలో పాలనా వ్యవహారాలు, శివ శక పంచాంగం ఆచరణ, సంస్కృత అక్షరాలతో తయారు చేసిన రాజముద్రికను ఉపయోగించడం శివాజీ కాలంలో కనిపిస్తాయి. స్వరాజ్యం, ధర్మస్థాపన రెండు కళ్లుగా ఆయన భావించారు. ఇప్పుడు స్వ ఆధారిత చింతన పునాదిగా భారతదేశం నిర్మితమవుతున్నది. ఆ విధంగా ఆయన జీవితం, ఆశయం, పాలన ఇవాల్టి తరానికి స్మరణీయమైనదే అవుతుంది.

స్వామి దయానంద సరస్వతి(1824-1883) భారత సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమంలో ధ్రువతార. హిందూ ధర్మాన్ని మూఢ నమ్మకాల బారి నుంచి విముక్తం చేయడమే లక్ష్యంగా ఆయనే ఏప్రిల్ 7, 1875లో ఆర్యసమాజ్ స్థాపించారు. హిందువులు ఆత్మాభిమానంతో బతకాలని చెప్పి, అనేక పోరాటాలకు సిద్ధం చేసిన సంస్థ ఇది. కృణ్వంతో విశ్వమార్యం అన్నదే (ఈ ప్రపంచాన్ని సమున్నతం చేయడం) వారి నినాదం.

మహావీరుడు క్రీస్తుశకం లేదా సామాన్య శకం 6వ శతాబ్దానికి చెందినవారు. 23వ తీర్థంకరుడు (ప్రధాన బోధకుడు) పార్శ్వనాథుని వారసుడు మహావీరుడు. అంటే 24వ తీర్థంకరుడు. మహావీరుడి తల్లి త్రిషల, తండ్రి సిద్ధార్థ పార్శ్వనాథుని భక్తులు. తల్లిదండ్రుల వారసత్వంలో నడుస్తూ మహావీరుడు 30వ ఏట సర్వం త్యజించి జైన మత వ్యాప్తి ఆరంభించారు. మూడు దశబ్దాలు అందుకు పాటు పడ్డారు. అహింస, సత్యం, అస్తేయ (దొంగతనం నుంచి దూరంగా ఉండడం), బ్రహ్మచర్యం వంటి సూత్రాలను ఆయన బోధించారు. ★

చేయగలిగింది. ఆర్ఎస్ఎస్/బీజేపీ దేశాన్ని మతం పేరుతో విభజిస్తున్నాయన్న విపక్షాల మాట ఎంత దారుణమైన అబద్ధమో ఈశాన్య భారతం చెప్పడం గొప్ప వైచిత్రి. ఇప్పుడు ప్రజలు గమనిస్తున్న ఒక వాస్తవం- కాంగ్రెస్ మద్దతు ఉన్న ముస్లిం మత గురువు ముస్లింలకో దేశం కావాలని పదే పదే కోరడం. ముస్లింలకో దేశం అన్న నినాదాన్ని కాంగ్రెస్ ఇప్పుడు కూడా ప్రతిఘటించడం లేదు. హిందూ జీవన విధానం లేదా ధర్మం భౌగోళికంగా సామ్రాజ్యాలను గెలుచుకోవాలని ఏనాడూ భావించలేదు. ఇప్పుడు జరిగిందీ అదే- మనసులు గెలుచుకోవడం. గుణాత్మకమైన మార్పులు, దేశ గతిని మార్చే సానుకూల పరిణామాలకు వెనుక ఆర్ఎస్ఎస్ ఉన్నది. అందుకే ఇప్పుడు ఆర్ఎస్ఎస్ చెప్పే మాట కోసం ప్రపంచం ఎదురు చూస్తున్నది.

'ప్రపంచ శ్రేయస్సు అనే ఉదాత్త లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు భారత్ చేపట్టిన 'స్వ' సుదీర్ఘ ప్రయాణం మనందరికీ ఎల్లప్పుడూ స్ఫూర్తి దాయకమని అఖిల భారతీయ ప్రతినిధి సభ తన తీర్మానంలో అభిప్రాయపడింది.' ఇక్కడ 'స్వ' అంటే స్వయం, స్వావలంబన. మన స్వాతంత్ర్య పోరాటంలో ఈ భావన పార్శ్వం కూడా. దీని ఆధారంగానే దేశ పునరుజ్జీవనం కోసం స్వయంసేవకులు సంకల్పించాలని ఈ తీర్మానం కోరింది. ఇదే ముఖ్య తీర్మానం కూడా. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచిపోయినా ఇప్పటికీ భారతజాతి అనేక విధాలుగా యాతనలు పడడానికి కారణం విదేశీ పాలనకు సంబంధించిన అవశేషాలు. సామాజిక, సాంస్కృతిక ఒడుదుడుకులు, దారిద్ర్యం ఆ అవశేషాల ఫలితమే. స్వాతంత్ర్య పోరాటంలో ఎక్కడో ఒక దశలో 'స్వ' అన్న భావన లుప్తమై పోవడంతో ఇదంతా జరిగిందని ఎందరో ఈనాడు భావిస్తున్నారు. అందుకే 'స్వ' అన్న భావనకు ఇప్పుడైనా ప్రాణప్రతిష్ట చేసేందుకు ఆర్ఎస్ఎస్ సంకల్పించిందని అంతా అర్థం చేసుకోవాలి. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో ప్రధాన భాగస్వామిగా భావిస్తున్న పార్టీ, ఆ ప్రముఖులు ఇవాళ విదేశాలలో భారత్ గురించి అవమానకరమైన రీతిలో వ్యాఖ్యలు చేయడం చూస్తుంటే 'స్వ' అన్న భావనకు దూరం కావడమే ననిపిస్తుంది. దేశ ప్రయోజనాన్ని, సార్వభౌమాధికార ఔన్నత్యాన్ని అధికార రాజకీయాలు శాసించే దుస్థితి దేశంలో భారత్ మాతృభూమి అన్న సమున్నత

# అవాంతరాలను అధిగమిస్తూ...



సామాజిక మార్పు కోసం సంఘ్ ఐదు అంశాలతో కూడిన కార్యక్రమాన్ని సిద్ధం చేసుకుంది. సామాజిక సమరసత, కుటుంబ విలువలు, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ, పౌర బాధ్యతలతో మార్పు కోసం సంఘ్ ముందుకు వస్తున్నది. సామాజిక సమరసతను రక్షించుకుంటూ, వివక్షకు వ్యతిరేకంగా పోరాడడమే వీటన్నిటి ఉద్దేశం. అంటరానితనం అనేది ఏ విధంగా చూసినా ఘోర అవమానమేనని, ఆ దురాచారాన్ని నిర్మూలించడానికి ఆర్ఎస్ఎస్ కట్టుబడి ఉందని కూడా సర్ కార్యవాహ్ విలేకరుల సమావేశంలో నిర్ద్వంద్వంగానే చెప్పారు. జనాభా పెరుగుదలలో అసమౌతల్యం గురించి నాడు గాంధీజీ, నిన్న మొన్న టీఎన్ శేషన్ వంటి వారు హెచ్చరించిన సంగతిని హొసబలె గుర్తు చేశారు. ఈ అంశం పట్ల సుప్రీం కోర్టు కూడా కొన్ని వ్యాఖ్యలు చేసిన సంగతి కూడా అందరికీ గుర్తుండే ఉంటుంది. స్వలింగ సంపర్కుల మధ్య వివాహాలకు అనుమతి గురించి హొసబలె కేంద్రం వైఖరిని సమర్థిస్తున్న తీరులోనే, సరైన దృక్పథంతోనే మాట్లాడారు. వివాహం అనేది స్త్రీ పురుషుల మధ్య మాత్రమే జరగాలని ఆయన ఆర్ఎస్ఎస్ అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. వివాహాలు అనేవి కేవలం శారీరక సౌఖ్యాలకే కాకుండా, సామాజిక ప్రయోజనాల కోసం కూడా జరుగుతాయని చెప్పారు హొసబలె. ఆర్థిక వ్యవస్థగా భారత్ శరవేగంగా దూసుకుపోతున్నది. వ్యూహాత్మక, దౌత్య పరిధులలో మన దేశ ప్రాధాన్యం కూడా ఎంతో పెరిగింది. ఈ దశలో సమాజంలోని అన్ని వర్గాలు ఏకత్రాటి మీదకు వచ్చి సమగ్ర అభివృద్ధి కోసం జరుగుతున్న కృషిలో భాగస్వాములు కావాలని కూడా ఆయన కోరారు. కానీ కొన్ని శక్తులు ఇటు భారత్‌లోను, అటు ఇతర దేశాలలోను ఉండి ఈ ప్రగతిని నిరోధించాలని చూస్తున్న వారి గురించి కూడా ఆయన ప్రస్తావించారు. కానీ ఐకమత్యంతో, స్వ భావనతో అలాంటి శక్తులను ఎదుర్కొనవచ్చునని అన్నారు.

ఎన్ని అవాంతరాలు, అపవాదులు వచ్చినా ఆర్ఎస్ఎస్ పెరుగుతూనే ఉంది. ఇందుకు సాక్ష్యంగా దేశంలో సంఘ శాఖల సంఖ్య 62,000 నుంచి 68,000 పెరిగింది. ఈ సంఖ్యనే లక్షకు పెంచాలని సంఘం సంకల్పించింది. ఇప్పుడు కుటుంబం మొత్తం ప్రతి మూడు నెలలకు ఒకసారైనా శాఖలలో కలవాలన్న ప్రయత్నం కూడా ప్రారంభిస్తున్నారు.

పానిపట్‌లోని సేవా సాధన, గ్రామవికాస కేంద్రం ఆవరణలో మూడు రోజుల పాటు జరిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభ సమావేశాలకు మాననీయ సర్ కార్యవాహ దత్తాత్రేయ హొసబలె అధ్యక్షత వహించారని, పరమ పూజనీయ సర్ సంఘచాలక్ మోహన్‌జీ భాగవత్ మార్గదర్శనం చేశారు. ఈ సమావేశాల్లో సమర్పించిన నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా 42,613 స్థలాల్లో 68, 651 శాఖలు నడుస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే 4,700 స్థలాల్లో అదనంగా 8,534 శాఖలు ప్రారంభమయ్యాయి. వారం, నెలకు ఒకసారి జరిగే శాఖలతో కలుపుకుంటే 75 వేల గ్రామాల్లో శాఖలు జరుగుతున్నాయన్నారు. ★

చింతన లోపించడం వల్లనే విదేశాలకు వెళ్లి కూడా కొందరు రాజకీయ నాయకులు బాధ్యత విస్మరించి దేశాన్ని అవమానిస్తున్నారు. ఒక విలేకరి ఈ అంశాన్ని కూడా లేవనెత్తారు. ఇటీవల కాంగ్రెస్ నాయకుడు రాహుల్ కేంబ్రిడ్జ్‌లో భారత ప్రజాస్వామ్యం గురించి చులకనగా మాట్లాడిన సంగతే ఆ విలేకరి ఎత్తారు. అలాంటి వారు బాధ్యతాయుతంగా మాట్లాడవలసి ఉంటుందని ఆర్ఎస్ఎస్ సర్‌కార్యవాహ్ సున్నితంగానే చురక వేశారు. నిజమే, భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని రాహుల్ చెప్పడం విడ్డూరమే మరి. మన ప్రజాస్వామ్యానికి గ్రహణం పట్టిన సందర్భం కాంగ్రెస్ అధికారంలో ఉండగానే జరిగింది. అత్యవసర పరిస్థితిని విధించిన పార్టీ కాంగ్రెస్. అందుకే, 'అత్యవసర పరిస్థితి కాలంలో మేమంతా కారాగారాలకు వెళ్లిన వాళ్లమేనని ఆయన సందర్భోచితంగా సమాధానం చెప్పారు. కాబట్టి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడానికి రాహుల్‌కు ఉన్న నైతికత ఎంత? ఇలాంటి వాళ్లు ఎంతమంది వచ్చినా ఆర్ఎస్ఎస్ తన పని తాను చేసుకు వెళుతూనే ఉంఉందని హెుసబాలె చాలా చక్కగా చెప్పారు. ఇంతకీ అత్యవసర పరిస్థితి వంటి తీవ్ర నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ఇంతవరకు దేశ ప్రజలకు క్షమాపణలు కూడా చెప్పలేదు. అలాంటి పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ ఇప్పుడు వ్యాఖ్యలు చేయడం ఏమిటి? రాహుల్ అనే ఏముంది, ఆయన తాతల కాలం నుంచి ఆర్ఎస్ఎస్ మీద వాగ్బాణాలు కురుస్తూనే ఉన్నాయని సర్ కార్యవాహ గుర్తు చేశారు. హొసబలె ఈ విధంగా నెహ్రూ, ఇందిర, రాజీవ్‌గాంధీల హయాంలలో జరిగిన ఆర్ఎస్ఎస్ వ్యతిరేక ప్రచారం గురించి, వారు సృష్టించిన అడ్డంకుల గురించి జాతికి గుర్తు చేయగలిగారు. జనాభా అదుపు కంటే, జనాభాలో సమతౌల్యం గురించి ఎక్కువ ఆలోచించాలని సర్ కార్యవాహ కీలకమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశాలలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ కూడా హాజరయ్యారు.

స్వాతంత్ర్య పోరాటకాలంలో పరాయి పాలన నుండి విముక్తి కోసం త్యాగాలు అవసరమయ్యాయి. చేశారు కూడా. ప్రస్తుతం పైన పేర్కొన్న లక్ష్యాల సాధన కోసం మనం వలసవాద మనస్తత్వం నుండి బయటపడి, పౌర విధులకు కట్టుబడి సామాజిక జీవనాన్ని సాగించాలి. ఈ దృష్టి కోణంలో, స్వాతంత్ర్య దినోత్సవం నాడు గౌరవనీయులైన ప్రధానమంత్రి ఇచ్చిన 'పంచప్రాణ్' (ఐదు పరిష్కారాలు) పిలుపు అతి ముఖ్యమైనది.

సామాజిక సమరసత, కుటుంబ విలువలు, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ (భారతీయ), పౌర బాధ్యతల పట్ల మెలకువ వంటి అంశాలే నేపథ్యంగా సంఘ్ వ్యవస్థలో మార్పును తీసుకువచ్చే ప్రయత్నం

## నివాళి




*అఖిల భారత ప్రతినిధి సభ ఇటీవల మరణించిన ప్రముఖులందరికీ ఘనంగా నివాళులు అర్పించింది. డాక్టర్ వేద్ ప్రతాప్‌వైదిక్, ప్రముఖ చలనచిత్ర దర్శకుడు కె. విశ్వనాథ్, ప్రఖ్యాత నటి, మాజీ ఎంపి జమున, నటుడు, మాజీ ఎంపి కృష్ణ, గోసేవా ప్రముఖ్ దిలీప్ సహానీలకు సభ నివాళి ఘటించింది.*

చేస్తుందని హొసబలె చెప్పారు. సేవ, కుటుంబంలో విద్య వంటివి మహిళల ప్రాతినిధ్యం లేకుండా సాధ్యమయ్యేవి కాదని ఆయన చెప్పారు. వీటన్నిటికీ కీలకమే 'స్వ' భావన. పట్టికల్యాణంలో జరిగిన తీర్మానాలన్నీ ఈ సిద్ధాంతం పునాదిగానే జరిగాయి. ఆజాదీ కా అమృతోత్సవాలు, ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది సందర్భంలో (2025) ఈ తీర్మానం ఒక చోదకశక్తిగా ఉంటుందని సర్ కార్యవాహ్ వివరించారు. భారత్ ప్రపంచంలోనే సమున్నత స్థానంవైపు సాగుతున్న ఈ సమయంలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించడానికి వాటిని తొలగించడానికి స్వయంసేవకులు, మిగిలిన సమాజం సంఘటితంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనేక విధాలుగా వక్రీకరణలకు గురైన మన చరిత్రను సరిదిద్దుకోవాలని ఆయన అన్నారు. అప్పుడు మన గతాన్ని చూసి ఈ తరం సగర్వంగా నిలబడుతుందని చెప్పారు. 2025లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది సందర్భమే ప్రత్యేకంగా చేపట్టే కార్యక్రమాల గురించి ఏబీపీఎస్ ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. సంఘ విస్తరణ, సేవా కార్యక్రమాలను మరింత పటిష్టంగా అందించడం గురించే సభ చర్చించింది. స్వయంసేవకులు తమ తమ గ్రామాలలోని సమస్యలను స్వయంగా పరిశీలించి వాటిని పరిష్కరించడానికి స్థానికులతో కలసి పాటు పడాలని సమావేశం సూచించింది.

తామే హిందువులకు ప్రతినిధులమని, తామే సమున్నత దేశసేవ చేస్తున్నామని ఆర్‌ఎస్‌ఎస్ ఏనాడూ చెప్పుకోలేదు. కానీ ఇవాళ్టి వాతావరణం, గడచిన 98 ఏళ్లలో ఆర్‌ఎస్‌ఎస్ సాధించిన విజయాలు చూసి సంఘం చేసే సమున్నత కార్యక్రమాలలో భారతీయ సమాజమంతా భాగస్వామి అయితే దేశం మరింత పురోగమిస్తుంది. దీనిని ప్రతిపక్షాలు కూడా గుర్తించాలి. దేశంలోని హిందువుల హక్కుల విస్మరించి, మైనారిటీలను బుజ్జగించడం ద్వారా అధికారంలోకి రావాలని ఇంకా ఇంకా కలలు కనే రాజకీయ పక్షాలు ఇకనైనా వాస్తవాలు గమనించాలి. హిందువులు మేల్కొంటున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నిర్మాణాత్మక దృక్పథం కలిగిన సంస్థ నాయకత్వంలో వారు ఏకమవుతున్నారు. ఇది భారతదేశ చరిత్రలోనే సరికొత్త అధ్యాయం. ఈ గొప్ప చారిత్రాత్మక పరిణామానికీ, అత్యవసరమైన కార్యక్రమానికీ ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర బిందువుగా ఉన్నది. అందుకే ఇవాళ ఆర్‌ఎస్‌ఎస్‌కు ఇంత ప్రాధాన్యం. పానిపట్టులో ఒకప్పుడు విదేశీ దురాక్రమణ దారులు నెగ్గారు. ఇప్పుడు విదేశీవాదాలు, విదేశీ బుద్ధులు ఓడిపోతున్నా యన్న సంగతి అక్కడే జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధుల సభ రుజువు చేసింది.

★

# 'చిరు' పరిష్కారంతో అందరికీ ఆహారం

ఆహారభద్రత గురించి ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ప్రపంచ దేశాలు రెండు సవాళ్లను ఎదుర్కొంటున్న సంగతిని గుర్తించాలని చెప్పారు భారత ప్రధాని నరేంద్ర మోదీ. దక్షిణార్ధ గోళంలో పేదలకు తిండి లేదు. ఉత్తరార్ధ గోళంలో తప్పుడు ఆహారపు అలవాట్లు. దీనికి చక్కని పరిష్కారమే చిరధాన్యాలని ఆయన చెప్పారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల (శ్రీఅన్న) అంతర్జాతీయ సదస్సును మార్చి 18న ప్రధాని ప్రారంభించారు. దేశంలో ఇకపై ప్రజా పంపిణీ కార్యక్రమంలో చిరుధాన్యాలను కూడా చేరుస్తామని, పాఠశాలలలో పిల్లలకు ఇస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో కూడా వాటికి స్థానం కల్పిస్తామని ఈ సదస్సుకు హాజరైన విదేశీ ప్రతినిధులకు ప్రధాని తెలియచేశారు. గ్రామాలకూ, పేదరైతులరూ ఎంతో దగ్గరగా ఉండే చిరుధాన్యాలతో ఇకపై సాగుదారులకు మంచి లబ్ధిని చేకూరుస్తాయని ఆశిస్తున్న సంగతిని కూడా ఆయన తెలియచేశారు.



**సేంద్రీయ వ్యవసాయం చేసే పాపమ్మాళ్ సదస్సులో మోదీని శాలువతో సత్కరించారు. ఆయన పాదాభివందనం చేశారు. పద్మశ్రీ గ్రహీత పాపమ్మాళ్ వయసు 107 ఏళ్లు.**

హైదరాబాద్‌లోని చిరుధాన్యాల పరిశోధక కేంద్రాన్ని సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌గా ప్రకటించారు. ఈ సదస్సుకు గుర్తుగా ఒక పోస్టల్ స్టాంపును, రూ. 75 నాణేన్ని కూడా ప్రధాని విడుదల చేశారు. చిరుధాన్యాల సాగు, మార్కెటింగ్, వినియోగం, వినియోగంలో వినూత్న పద్ధతులు వంటి అంశాల గురించి ఈ సదస్సులో చర్చిస్తారు. ఈ సదస్సును నిర్వహిస్తున్నందుకు ఇథియోపియా అధ్యక్షురాలు భారత్‌కు శుభసందేశాలు కూడా పంపించారు. ఇథియోపియా ఆఫ్రికాలో చిరుధాన్యాలు పండించే దేశంలో ముఖ్యమైనది. గుయానా అధ్యక్షుడు కూడా తన మద్దతు ప్రకటించారు.

సదస్సుకు హాజరైన 107 ఏళ్ల మహిళ మోదీని సత్కరించారు. ఆయన పాదాభివందనం చేశారు.




# ప్రశ్నాపత్రాల లీకేజీ

# బాధ్యులెవరు? బాధితు

**నిరుద్యోగులు ఉద్యోగ పరీక్షల కోసం రాత్రింబవళ్లూ నిద్ర లేకుండా సన్నద్ధం అవుతారు. లక్షల మంది పోటాపోటీగా పరీక్షలు రాస్తారు. జీవిత లక్ష్యం మాత్రమే అప్పుడు వాళ్ల మదిలో మెదులుతూ ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగం సంపాదిస్తే చాలు.. జీవిత పరమార్థం అదే అనుకుంటారు. ఇంట్లో వాళ్లందరి ప్రశంసలు అందుకుంటారు. అలాంటివాళ్లకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రశ్నాపత్రాల లీకేజీ శరాఘాతంగా మారింది. ఏకంగా పరీక్షలే రద్దయ్యాయి. వాటికోసం మళ్లీ కుస్తీ పట్టాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని రీషెడ్యూల్ అయ్యే అవకాశాలున్నాయి. మళ్లీ నెలల తరబడి ప్రిపరేషన్ బాట పట్టాల్సిన అవసరం వస్తోంది. ఇందుకు భారీగా ఖర్చు చేయాల్సిన అనివార్య పరిస్థితులు ఉన్నాయి. మరి.. దీనికి బాధ్యులెవరు? ఈ లీకేజీ భూతాన్ని సమూలంగా నిర్మూలించ గలమా? ఈ ప్రశ్నకు జవాబు చెప్పేవాళ్లు కరువయ్యారు. భరోసా ఇచ్చేవాళ్లు కనిపించడం లేదు. పైగా ఈ అంశం రాజకీయ రగడగా మారడం అందరినీ బాధిస్తోంది.**

పకడ్బందీగా నిర్వహించాల్సిన పరీక్షల్ని టీఎస్‌పీఎస్సీ ఇంత తేలిగ్గా తీసుకోవడం, పేపర్లను లీక్ కాకుండా భద్రతా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం వంటి అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అత్యంత గోప్యంగా ఉండే సమాచారాన్ని టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులు ఎవరైనా తెరిచేందుకు ప్రయత్నిస్తే ఉన్నతో ద్యోగులను కూడా అలర్ట్ చేసే సిస్టం లేకపోవడం టెక్నాలజీని ఉపయోగించడంలో టీఎస్‌పీఎస్సీ వెనుకబాటుతనానికి పరాకాష్టగా నిలిచింది. ఒకరి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ మరొకరు తేలిగ్గా తెలుసు కోవడం అంటే.. ఈ అంశాన్ని టీఎస్‌పీఎస్సీ పెద్దలు ఎంత సులువుగా తీసుకున్నారో అర్థమవుతోంది.

లక్షల మంది విద్యార్థులు, యువత, నిరుద్యోగుల భవిష్యత్తుకు సంబంధించిన అంశం కావడంతో అందరూ ఈ వ్యవహారంలో అసలేం జరుగుతుందో అని ఆసక్తిగా, ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. పరీక్షలకు సన్నద్ధం అవుతున్న వాళ్లలో కూడా సందిగ్ధం నెలకొంది. ఏయే పరీక్షల షెడ్యూల్ మార్చేస్తారో అన్న ఆందోళన అభ్యర్థులను వెంటాడుతోంది. నెలల తరబడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న లక్షల మంది అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. పగలూ రాత్రి తేడా లేకుండా రోజుల తరబడి ఒక తపస్సు లాగా పుస్తకాలకు అతుక్కుపోయి తమ చదువులకు అర్థంచెప్పే పోటీ పరీక్షలు రాసిన ఎంతో మంది యువతను సైతం పేపర్ లీక్ ఘటన నిరాశకు గురిచేస్తోంది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండే అధికారులకు తమ అధీనంలో పనిచేస్తున్న వారి మీద సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి తప్పులు జరుగుతాయని విమర్శలు వస్తున్నాయి.

టీఎస్‌పీఎస్సీ ఏర్పాటైన తర్వాత ఈ ఎనిమిదేండ్లలో 155 నోటిఫికేషన్ల ద్వారా 37 వేల ఉద్యోగాలు భర్తీ చేశారు. కానీ, ఈ ఒక్క ఏడాదే వరుసగా 26 నోటిఫికేషన్లు జారీచేసి, 25 వేల ఉద్యోగాల భర్తీకి టీఎస్‌పీఎస్సీ చర్యలు చేపట్టింది. ఇందులో గ్రూప్ 1, 2, 3, 4 వంటి ఉద్యోగాలకు సంబంధించిన పోస్టులు కూడా ఉన్నాయి. ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులకు సంబంధించిన పోస్టులు కూడా ఎక్కువగానే ఉన్నాయి. దీంతో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం తీవ్రంగా పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పోటీ ప్రపంచాన్ని సొమ్ము చేసుకోవాలని భావించిన కొందరు అక్రమ మార్గాలను ఎంచుకోవడం నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది. నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని, టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ విభాగం నుంచి పలు ఉద్యోగాలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను దొంగిలించి, లక్షల రూపాయలకు ఆ పేపర్లను అమ్ముకోవడం.. నిరుద్యోగుల జీవితాలను అంధకారంలోకి నెట్టేసింది.

ఇక రాష్ట్రంలో ఉద్యోగాలను భర్తీచేసే తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లోనే ఉద్యోగుల కొరత వెంటాడుతోంది. టీఎస్‌పీఎస్సీలో సరిపడా సిబ్బంది లేకపోవడం కూడా పేపర్ లీకేజీకి ఒక కారణంగా చెబుతున్నారు. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీలో 83 మంది మాత్రమే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. మిగతా ఉద్యోగులంతా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే. రెగ్యులర్ ఉద్యోగులకు ఉన్నంత శ్రద్ధ, బాధ్యత ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉండదనే వాదన వినిపిస్తోంది.

**ఎలా లీకైంది?**

టీఎస్‌పీఎస్సీ నుంచి పేపర్ ఎలా లీకైంది? అన్న విషయంలో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేయటం మొదలుపెట్టారు. కమిషన్‌లో ప్రశ్నాపత్రం నేరుగా లీక్ అయ్యే అవకాశాలు లేకపోవడంతో కార్యాలయంలో అత్యంత రహస్యంగా నిర్వహించే కాన్ఫిడెన్షియల్ సెక్షన్ కంప్యూటర్లలోని ప్రశ్నల సాఫ్ట్ కాపీ సమాచారాన్ని దొంగలించిట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఒక అమ్మాయి తరచూ టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ పీఏ ప్రవీణ్ కుమార్ దగ్గరకు వస్తున్నట్లు గమనించారు. ప్రవీణ్‌ను విచారించినపుడు అసలు విషయం బయటపడింది. క్వశ్చన్ పేపర్‌ను తానే లీక్ చేసినట్లు అంగీకరించాడు. ప్రవీణ్ టీఎస్‌పీఎస్సీలో ఉద్యోగి. అంతకు మించి.. సెక్రెటరీకి



# లెవరు?

సుజాత గోపగోని, 6302164068

పీఏగా ఉన్నాడు. ఓ మహిళ కోసం ఎందాకైనా వెళ్దామనుకున్న ప్రవీణ్.. అక్కడ పనిచేసే రాజశేఖర్ అనే ఉద్యోగికి భారీగా డబ్బు ఆశ చూపాడు. అనంతరం అతడి కంప్యూటర్ నుంచి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పేరుతో లాగిన్ అయ్యాడు. అతడికి ఐడీ, పాస్‌వర్డ్ ముందే తెలిసి ఉండడంతో మొత్తం వ్యవహారం క్షణాల్లోనే కానిచ్చేశాడు. అయితే ప్రశ్నాపత్రం డౌన్‌లోడ్ అయితే అందరికీ తెలిసి పోతుంది. కాబట్టి అలా కాకుండా.. ఫొటోలు తీసుకున్నాడు. వాటిని యువతికి వాట్సాప్ చేశాడు.

ఇప్పటికే ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్న రేణుక, ఆమె భర్త, ప్రభుత్వ ఉద్యోగి అయిన లడ్యావత్ డాక్యా, ప్రవీణ్ వేసిన ప్లాన్ ప్రకారం టీఎస్‌పీఎస్సీలో నెట్‌వర్క్ ఎక్స్‌పర్ట్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ సహాయంతో పేపర్లను లీక్ చేశారు. లీక్ చేసిన పేపర్లను రూ. పది లక్షలకు రేణుకకు అమ్మి నెట్‌వర్క్ ఎక్స్‌పర్ట్ రాజశేఖర్, ప్రవీణ్ చెరో 5 లక్షలు తీసుకున్నట్టు గుర్తించారు. ఏఈ ఎగ్జామ్‌కి రెండు రోజుల ముందు రేణుక, ఆమె భర్త లాడ్యావత్ డాక్యా, రేణుక పెద్దనాన్న కొడుకు కానిస్టేబుల్ శ్రీనివాస్, ఆయన స్నేహితుడు కేతావత్ నీలేశ్, అతడి తమ్ముడు రాజేంద్ర నాయక్, గోపాల్ నాయక్, రేణుక తమ్ముడు రాజశేఖర్ అందరూ కలిసి రేణుక ఇంట్లో కలిసినట్లు పోలీసుల విచారణలో తేలింది. లీక్ చేసిన పేపర్‌ను చదువుకొని నీలేష్, గోపాల్, రాజశేఖర్ ఈ కేసులో ఉన్న మరో ఇద్దరు ఎగ్జామ్ రాశారని నిర్ధారణ అయ్యింది. అయితే, ఇక్కడే అసలు కథ బయట పడింది. తన తమ్ముడి కోసం అని ప్రవీణ్ దగ్గర నుంచి పేపర్ తీసుకున్న రేణుక.. డబ్బు వ్యామోహంతో ఏఈ ఎగ్జామ్‌కి ప్రిపేర్ అవుతున్న నీలేశ్, అతని స్నేహితుల నుంచి ఒక్కొక్కరు 10 లక్షలు ఇవ్వాలనీ డీల్ కుదుర్చుకుంది. అయితే, మొదట అందరం 5 లక్షల చొప్పున ఇస్తామని, పరీక్ష రాశాక మిగతా డబ్బులు ఇస్తామని రేణుకతో నీలేష్ చెప్పాడు. దీనికి రేణుక ఒప్పుకోకపోవడం, ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో నీలేష్ స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మహబూబ్ నగర్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ పోలీసులు సీన్లోకి ఎంటర్ అయ్యారు. పేపర్ లీక్ ఘటనకు సంబంధించి టీఎస్‌పీఎస్సీ అధికారులను సంప్రదించి విచారణ మొదలుపెట్టిన సీసీఎస్ పోలీసులు ప్రవీణ్, రేణుక, రాజశేఖర్‌రెడ్డి సహా మొత్తం 9 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఈ కేసును సిట్‌కు అప్పగించింది. పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులకు నాంపల్లి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. వీరిలో ఎనిమిది మంది నిందితులను చర్లపల్లి జైలుకి తరలించారు. నిందితురాలుగా ఉన్న రేణుకను చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించారు.

**విచారణ వేగవంతం**

ఇటు.. టీఎస్‌పీఎస్సీ క్వశ్చన్ పేపర్ లీక్ కేసులో సిట్ విచారణ సుదీర్ఘంగా కొనసాగుతోంది. నిందితుల నుంచి పలు కీలక విషయాలు రాబడుతోంది. ఈ ప్రయత్నంలో భాగంగానే నిందితుల ఆర్థిక లావాదేవీలపైనా సిట్ బృందం ఆరా తీస్తోంది. రాజశేఖర్, ప్రవీణ్, రేణుక ముగ్గురు నిందితుల వాట్సప్ చాట్‌ని రిట్రీవ్ చేశారు. రాజశేఖర్ చాలామందికి పేపర్లను ఇచ్చినట్లుగా సిట్ గుర్తించింది. మరోవైపు రాజశేఖర్, ప్రవీణ్‌ల వ్యక్తిగత కంప్యూటర్ల నుంచి డాటాను అధికారులు రిట్రీవ్ చేశారు. రెండు కంప్యూటర్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. 2017 నుంచి ప్రవీణ్ మొబైల్ ఫోన్ డేటాను పోలీసులు రికవరీ చేస్తున్నారు. 2017 నుంచి టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఎన్ని ఉద్యోగాలకు పరీక్షలు జరిగాయి? ఎన్నిసార్లు జరిగాయి? ఆ సమయంలో కూడా ప్రవీణ్ ఏవైనా అక్రమాలకు పాల్పడ్డాడా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు సిట్ అధికారులు.

**రాజకీయంగా పెనుదుమారం**

మరోవైపు.. ఈ అంశం రాజకీయంగానూ రగడ రేపుతోంది. పేపర్ లీక్‌పై ఆరోపణలు చేసే రాజకీయ నాయకులకు సిట్ నోటీసులు జారీ చేసింది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ ఘటన కేసులో ఇద్దరే నిందితులుగా ఉన్నారని మంత్రి కేటీఆర్ చెబుతున్నారు. కానీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాత్రం పేపర్ లీక్ వ్యవహారం మంత్రి కేటీఆర్ ఆఫీసు నుంచే సాగిందని, మంత్రికి తెలియకుండా ఇదంతా జరుగుతుందా? అని ప్రశ్నించారు. ఇందులో కేటీఆర్ పాత్ర కూడా ఉందన్నారు. లీకేజీ కేసులో ఏ–2గా ఉన్న రాజశేఖర్, కేటీఆర్ పీఏ తిరుపతి ఇద్దరూ స్నేహితులని, రాజశేఖర్‌కు ఉద్యోగం ఇప్పించింది మంత్రి పీఏనే అని, ఆయన సూచనలతోనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి ప్రమోషన్ ఇచ్చి టీఎస్‌పీఎస్సీకి బదిలీ చేశారని రేవంత్ ఆరోపించారు. అంతేకాదు.. మంత్రి పీఏ సొంతూరు జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల మండలమని, రాజశేఖర్‌ది కూడా ఇదే మండలమని, గ్రూప్ 1 పరీక్షలో ఈ మండలానికి చెందిన 100 మందికి పైగా అభ్యర్థులకు 103కు పైగా మార్కులు వచ్చాయని ఆరోపణలు గుప్పించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో వీటిపై వివరాలు, ఆధారాలు ఇవ్వాలని సిట్ కోరింది. ఇక, పేపర్ లీకేజీ వ్యవహారం బయటపడ్డప్పటినుంచీ హైదరాబాద్ సహా రాష్ట్రమంతటా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగులు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు వరుస ఆందోళనలతో హోరెత్తిస్తున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



ప్రవీణ్



రాజశేఖర్



పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయి భంగపడిన వైసీపీ తన తప్పులను దిద్దుకోవాల్సింది పోయి ఓడిపోయిన అక్రోశంతో ఈ విభాగం (పట్టభద్రుల) ఓటర్లు తమ ఓటర్లే కాదని తూలనాడుతోంది. గెలిస్తే వారిని అక్కున చేర్చుకు నేదా? ఈ విభాగం ఓటర్లు తమ అభిమానులు కానప్పుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం ఎందుకు? వైసీపీ మాటలను బట్టి ప్రతిపక్షాలకు ఓటేసిన వారితో పాటు ఆ పార్టీకి ఓటేసిన 2,36,972 మంది గ్రాడ్యుయేట్లకు తీవ్ర అవమానం జరిగినట్లయింది.

# వైసీపీకి 'పట్టభద్రుల' షాక్

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని వైసీపీ అగౌరవపరచింది. చదువుకున్న వారు, వివిధ వృత్తుల్లో ఉన్నవారు, ఆలోచనాపరులు తమ ఓటర్లు కాదని; చదువులేనివారు, నోటుకు అమ్ముడు పోయేవారు, దొంగ ఓట్లు వేసేవారు తమ ఓటర్లుగా ఆ పార్టీ భావిస్తోందా? అంటే నాలుగేళ్లుగా స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికల సందర్భంగా జరుగుతున్న సంఘటనలను బట్టి తెలుసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఇప్పుడు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీ ఫైనల్స్‌గా పేర్కొన్న వైసీపీ ప్రభుత్వం ఈ ఎన్నికల ఫలితాలను బట్టి తీవ్రమైన ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్నట్లు గుర్తించడం లేదు.

**రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు**

అర్థబలం, అంగ బలాలతో ఏ ఎన్నికల్లోనైనా... గెలవగలమనే అహంకారం వైసీపీ తలకెక్కింది. ఎమ్మెల్సీ ఎన్నికలు ఇటీవలే పూర్తయ్యాయి. పూర్తి మెజారిటీ ఉండటంతో వైసీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీలలో కొన్ని ఏకగ్రీవంగాను, మరికొన్ని ఎన్నికల్లో గెలిచింది. కాని ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎన్నికల్లో మాత్రం కంగు తింది. ఉపాధ్యాయుల ఎమెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం ఓటర్లను పలు ప్రలోభాలకు గురిచేసినట్లు, అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణ లొచ్చాయి. అలాగే ఓటర్లపై వత్తిడి తెచ్చింది. వందల ఓట్ల తేడాతో గెలిచినా నైతికతను కోల్పోయింది. మరోవైపు పట్టభద్రుల ఎన్నికల్లో గెలుపు కోసం చేయని పనంటూ లేదు. ఆరు, ఏడు తరగతులు చదువుకున్న వారికి బోగస్ డిగ్రీ సర్టిఫికెట్లు ఇచ్చి వారికి ఓటు హక్కు లభించేలా చేశారు. వైసీపీ అభ్యర్థులంతా ఆర్థికంగా బలవంతులు. దానికి తోడు అంగబలం కూడా ఉంది. ఇక్కడ కూడా ప్రలోభాలు మామూలే. దొంగ ఓటర్లను నమోదు చేయించడం నుంచి పోలింగ్ రోజు ఓట్లు వేయించడం వరకు జరిగిన ప్రహసనం అందరూ చూసిందే. నాలుగేళ్లుగా ప్రభుత్వం వల్ల హింసపడుతున్న ఓటర్లు బీజేపీ చేసిన పోరాటాలతో చైతన్యవంతులయ్యారు. ఈ ప్రభుత్వాన్ని ఎప్పుడు గద్దె దించుదామా?అని ఎదురుచూస్తున్నారు. అవకాశం రానేవచ్చింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తామేమిటి చూపి, కసి తీర్చుకున్నారు. 2024 ఎన్నికల్లో ఇదే ఫలితాల ఇవ్వనున్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మౌలికవసతులు, ఉపాధి కల్పన, పరిశ్రమల ఏర్పాటు వంటి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే కార్యక్రమాలు చేపట్టకుండా పరిపాలనా వికేంద్రీకరణ మూడు రాజధానులు వంటి అస్తవ్యస్త నిర్ణయాలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తే ఫలితం ఇలాగే ఉంటుందని చూపించారు.

**వైసీపీకి చుక్కలు చూపించిన పట్టభద్రులు**

పట్టభద్రుల ఎన్నికలు వైసీపీ ప్రభుత్వానికి చుక్కలు చూపించాయి. శ్రీకాకు ళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలను కలిపి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గంగాను, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలను కలిపి తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంగాను, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు కలిపి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంగా ఉన్నాయి. ఈ మూడింటికి ఎన్నికలు జరగ్గా, అధికార పార్టీ ఈ మూడింటిలో ఓడిపోయింది. ఈ ఎన్నికల్లో ఓటర్లు పట్టభద్రులే కావొచ్చు. కానీ వారంతా సమాజంలోని ఒక వర్గానికి మాత్రమే ప్రతినిధులు కాదు. వారిలో వివిధ కులాలు, మతాలు, సామాజిక, ఆర్థిక నేపథ్యాలకు చెందిన వారు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ వృత్తులు, వ్యాపారాలు చేసుకుంటున్నవారు, నిరుద్యోగులు, పీజీ కోర్సులు చేస్తున్న విద్యార్థులు కూడా ఉన్నారు. పైగా 108 శాసనసభ నియోజక వర్గాల పరిధిలోని 7.16,664 మంది ఓటర్లు ఈ పోలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఇందులో చెల్లిన ఓట్లు 6,63,782 కాగా తెలుగు దేశం పార్టీకి 2,78,630 (43.63 శాతం) ఓట్లు, వైసీపీకి 2,36,972 (35.70శాతం ఓట్లు వచ్చాయి. దీన్ని భారీ నమూనా (శాంప్లింగ్)తో నిర్వహించిన విస్తృత సర్వేలా భావిస్తున్నారు.



**వల్లూరు జయప్రకాష్ నారాయణ**

2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఈ ఎన్నికలను సెమీఫైనల్‌గా భావించాలని వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సెమీఫైనల్‌లో వచ్చిన ఫలితాలు ప్రతికూలంగా ఉండటంతో ప్రజలు ఆ పార్టీ పట్ల ఎంత ఆగ్రహంతో ఉన్నారో వ్యక్తం అవుతోంది. అదే సమయంలో 2024 ఎన్నికల్లో ఆ పార్టీకి ఘోర పరాజయం తప్పదనే సంకేతాలు ఇచ్చింది.

**విధ్వంసక పాలన**

ఆంధ్రప్రదేశ్‌లో నాలుగేళ్లుగా పాలన అనేది లేదు. జరిగిందంతా విధ్వంసమే. ఎన్నికల ముందు అధికారం కోసం వెనుకా ముందు చూడకుండా హామీ లిచ్చేశారు. అధికారం వచ్చాక ఒక్కహామీని నెరవేర్చ లేదు. వచ్చే ఎన్నికల్లో ఎలా గెలవాలి? అనే ఆలోచనే తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. సంక్షేమం పేరుతో ఓట్ల కొనుగోలు ప్రక్రియకు శ్రీకారం చుట్టి నవరత్నాలనే నగదు పంపిణీ పథకాలను అమలు చేస్తున్నారు. ఆదాయం కూడా కరగిపోయి ప్రజలపై పన్నులు భారాలు వేశారు. విద్యుత్ ఛార్జీలు అయిదారుసార్లు పెంచారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపుచేయయలేక పోతున్నారు. కేంద్రప్రభుత్వం ఆర్థిక సహకారంతో నిర్మించిన ఇళ్లకు బిల్లులు చెల్లించక పోవడాన్ని మూర్ఖత్వంగా లబ్ధిదారులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి తమ బేజులోంచి తీసి నిర్మించిన ఇళ్లుగా భావిస్తున్నారనే అభిప్రాయం వెలిబుచ్చుతున్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేస్తానన్న హామీ బుట్టదాఖలైంది. పీజీ విద్యార్థులకు గతంలో అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిలిపి వేశారు. డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సరిగా అమలుచేయడం లేదు. కొత్త పాలసీ పేరుతో ఇసుక సరఫరా నిలిపివేసి కృత్రిమ కొరతను సృష్టించారు. మద్య నిషేధం విధిస్తామన్న హామీని తుంగలోకి కుక్కి ప్రభుత్వమే నాసిరకం మద్యం విక్రయిస్తోంది. రాజధాని అమరావతిని అభివృద్ధి చేయకుండా వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానుల రాగం అందుకున్నారు. గత నాలుగేళ్లుగా జరిగిన స్థానిక సంస్థలు, పంచాయతీల ఎన్నికల్లో అధికారపార్టీ చేసిన దౌర్జన్యం పౌరసమాజాన్ని విస్తుపోయేలా చేసింది.

**ప్రాంతీయ విద్వేషాలకు తెర**

వైసీపీ ప్రభుత్వం ఓట్ల రాజకీయం కోసం కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతోంది. క్రైస్తవులు, ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తోంది. హిందూ ధర్మానికి అవమానం, మత మార్పిడులు, హిందువులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోలేదు. ప్రభుత్వ హిందూ వ్యతిరేకతపై బీజేపీ తీవ్రంగా పోరాడింది. పలు ఉద్యమాలు చేసింది. కోస్తా ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను అడ్డుకునేలా విశాఖ ప్రాంతంపై అకస్మాత్తుగా ప్రేమను చూపిస్తోంది. అమరావతిని కాకుండా మూడు రాజధానులు చేస్తామని చెప్పి శాసనసభలో తీర్మానం చేసింది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో వున్న 34 ఎమ్మెల్యే సీట్లు పొందేందుకు విశాఖ రాజధాని ఎత్తుగడను తీసుకువచ్చింది. రాజధాని రైతులు చేసిన పాద యాత్రలను అడ్డుకుని దాడులుచేసింది. స్థానికులచే విశాఖ గర్జన నిర్వహించి అమరావతి రైతులను దూషించింది. ఉత్తరాంధ్రకు చెందిన ధర్మాన ప్రసాదరావు వంటి బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న మంత్రులు, ప్రజాప్రతినిధులే ప్రాంతీయ విద్వేషాల్ని రెచ్చ గొట్టేందుకు పలు ప్రయత్నాలు చేశారు. విశాఖను పరిపాలనా రాజధాని చేస్తామని ఒకసారి.. విశాఖే అసలు రాజధాని అని మరోసారి వైసీపీ నాయకులు ఊదర గొట్టారు. త్వరలోనే తానూ విశాఖకు మకాం మారుస్తానని ముఖ్యమంత్రి జగన్ పదే పదే చెబుతున్నారు. ఐటీ సంస్థలు వెళ్లిపోవడం, రుషికొండపై కళ్ల ముందే కనిపిస్తున్న విధ్వంసం, వైసీపీ నాయకుల భూ దోపిడీలు, అక్రమాలు, అరాచకాల పట్ల ఉత్తరాంధ్రవాసులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ ఎన్నికల ఫలితాల్లో అది పక్కాగా ప్రతిఫలించింది. అలాగే రాయలసీమకు చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. వైసీపీ ఆరాచక పాలన, రౌడీయిజం, వనరుల దోపిడి, ప్రతిపక్షాలను అణచివేసే చర్యలతో సీమ వాసులు మండిపడుతున్నారు. కనీసం ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా పూర్తిచేయకపోవడం, కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయక పోవడం, ఉన్నవి తరిమేయడం, న్యాయరాజధాని పేరుతో ఆడిన నాటకం వంటివి రాయలసీమ జిల్లాల ప్రజల్లోనూ తీవ్ర అసంతృప్తిని కలిగించాయి.

**అరాచకంపై తిరుగుబాటు**

ముఖ్యమంత్రి ఇటీవల తరచుగా 2024 ఎన్నికలు పేదలకూ, పెత్తందారు లకూ మధ్య పోటీ అంటూ ప్రజల్లో వర్గ వైషమ్యాల్ని రెచ్చగొట్టాలని చూస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును, ముఖ్యమంత్రి నమ్మకానికి, వైసీపీ నాయకుల అతి విశ్వాసానికి పెద్ద ఎదురుదెబ్బగా పేర్కొనవచ్చు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పలా మార్చేయడం, ఆర్థిక వ్యవస్థను అతలా కుతలం చేయడం, ఉపాధి అవకాశాలు లేకపోవడం, చదువుకున్నవారంతా ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు తరలిపోవాల్సిన పరిస్థితులు తలెత్తడం వంటి పరిణామాలు, ప్రభుత్వ వైఫల్యాలపై రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా విద్యావంతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. శాంతిభద్రతల నిర్వహణలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యం అడుగడుగునా కనిపిస్తోంది.

**ఆంధ్రప్రదేశ్‌లో నాలుగేళ్లుగా పాలన అనేది లేదు. జరిగిందంతా విధ్వంసమే. ఎన్నికల ముందు అధికారం కోసం వెనుకా ముందు చూడకుండా హామీ లిచ్చేశారు. అధికారం వచ్చాక ఒక్కహామీని నెరవేర్చ లేదు. వచ్చే ఎన్నికల్లో ఎలా గెలవాలి? అనే ఆలోచనే తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. సంక్షేమం పేరుతో ఓట్ల కొనుగోలు ప్రక్రియకు శ్రీకారం చుట్టి నవరత్నాలనే నగదు పంపిణీ పథకాలను అమలు చేస్తున్నారు. ఆదాయం కూడా కరగిపోయి ప్రజలపై పన్నులు భారాలు వేశారు. విద్యుత్ ఛార్జీలు అయిదారుసార్లు పెంచారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపుచేయయలేక పోతున్నారు.**

అరాచక శక్తులు పేట్రేగుతున్నాయి. దీనికి తోడు ప్రభుత్వమే అక్రమ కేసులు, అరెస్టులతో ప్రజల్ని భీతావహుల్ని చేస్తోంది. ప్రభుత్వాన్ని విమర్శించిన వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోంది. ప్రతిపక్ష నాయకులపై కేసులు, అక్రమ అరెస్టులు సరేసరి. వాలంటీర్ల నిఘా, పెత్తనం వంటివి ప్రజల్ని తీవ్ర అసహనానికి గురిచేశాయి. అందుకే ఈ ఫలితాలు. ఇక నాలుగేళ్లుగా అధికార పార్టీ నాయకులు చెప్పినట్టల్లా ఆడుతూ, దాదాపు ఆ పార్టీ కార్యకర్తల్లా పనిచేస్తున్న కొందరు పోలీసులు, అధికారులకు ఈ ఫలితాలు కనువిప్పు కావాలి. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, విధి నిర్వహణలో నిష్పాక్షికంగా వ్యవహరించకపోతే రేపు పరిస్థితులు మారినప్పుడు ఇబ్బందులు తప్పవని ఈ ఫలితాలు వారికి హెచ్చరికలు జారీచేసినట్లే.

**వ్యాసకర్త: ఛైర్మన్, సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ.**

# పరోక్షమైనా కీలకపాత్ర 'దుందుభి'



రామాయణంలో మనకు కనిపించే మరో పాత్ర దుందుభి. నిజానికి ఇతడికి ప్రత్యక్ష సంబంధం లేకపోయినా, ఇతని పాత్ర పరోక్షంగా చాలా కీలకమైనదే అని చెప్పవచ్చు. భారీ కాయుడైన దుందుభి అస్థిపంజరం తెల్లకొండలా ఉంటుంది. రామ సుగ్రీవులకు మైత్రి కుదిరే సమయంలో సుగ్రీవుణ్ణి అతడి అన్న వాలి బారినుంచి కాపాడతానని వాగ్దానం చేసిన రాముడితో...చూడటానికి సుకుమారంగా కనిపిస్తున్న రాముడి బలాబలాలను తెలుసుకునేందుకు దుందుభి శరీరాన్ని కదిలించమని కోరాడు సుగ్రీవుడు. పర్వతంలా కనిపిస్తున్న దుందుభి కంకాళం వద్దకెళ్లిన రాముడు తన ఎడమకాలి బొటనవేలితో అవతలికి విసిరి కొడతాడు. ఇప్పుడు మనం దుందుభి గురించి తెలుసుకుందాం.

దుందుభి అనే రాక్షసుడు బలగర్వంతో ఒకరోజు సముద్రుడి దగ్గరికి వెళ్లి తనతో యుద్ధానికి ఆహ్వానించాడు. "నీతో నాకు యుద్ధం ఏమిటి? నీ బలం ఎక్కడ? నా బలం ఎక్కడ? నేను నీతో యుద్ధం చెయ్యలేను" అని సముద్రుడు బదులిచ్చాడు. దానికి దుందుభి 'నువ్వు నాతో యుద్ధం చెయ్యలేనంటె నేను నిన్ను వదలను, నాతో యుద్ధం చెయ్యగలిగిన వాడిని నాకు చూపించు' అన్నాడు. సముద్రుడు అతడిని వదిలించుకునే ఉద్దేశంతో "ఉత్తర భారతదేశంలో హిమవంతుడని ఒక పెద్ద పర్వతం ఉంది, అది మంచు పర్వతం. ఆయన కూతురు పార్వతీ దేవి. ఆమెను పరమశివుడికి ఇచ్చి వివాహం చేశారు. ఆయన మీద గొప్ప గొప్ప అరణ్యాలు, గుహలు ఉన్నాయి. నువ్వు ఆ హిమవంతుడితో యుద్ధం చెయ్యి" అని చెబుతాడు.

దుందుభి హిమవంత పర్వతం దగ్గరికి చేరి ఆ పర్వత శిఖరాలను పీకేసి ముక్కలు చేస్తున్నాడు. దుందుభి చేస్తున్న అల్లరికి హిమవంతుడు పరుగు పరుగున రాగా, తనతో యుద్ధం చేయాలని దుందుభి పిలిచాడు. "నాకు ఎవరితోనూ యుద్ధం చెయ్యాలని లేదు, యుద్ధం చేయను" అని హిమవంతుడు అన్నాడు. అప్పుడా దుందుభి 'నువ్వు కూడా ఇలాగంటే ఎలా? సముద్రుడు కూడా నీలాగే చెప్పాడు. పోనీ నాతో యుద్ధం చేసేవాడి పేరు చెప్పు' అన్నాడు. అప్పుడు హిమవంతుడు 'నీ ఒంటి తీట తీర్చగలిగినవాడు ఒకడున్నాడు' అనుకుని, ' కిష్కింద రాజ్యాన్ని ఏలే వాలి ఉన్నాడు. మంచి బలవంతుడు' అని చెప్పడంతో దుందుభి సంతోషంగా అక్కడికి వెళ్లి అక్కడి చెట్లని విరిచి, కిష్కింద ద్వారాన్ని పగులగొట్టి పెద్ద అల్లరి చేశాడు. భార్యలతో కామకేళిలో ఉన్న వాలి ఈ అల్లరికి బయటకి వచ్చాడు.

దుందుభి వాలిని చూసి "నువ్వు ఈ రాత్రి నీ భార్యలతో హాయిగా భోగం అనుభవించు, నీకు స్నేహితులైన వారిని పిలిచి వారికి

ఆధ్యాత్మికం

# ఆరోగ్యాన్నిచ్చే రారాజు 'భృంగరాజ్'

❋ 'మొక్క'బడి ❋

పూర్వకాలం నుంచి భారతీయులకు అందాన్ని ఆరోగ్యాన్ని, ఆయువును అందించిన దివ్యౌషధం గుంటగలగర. దీనిని ఫాల్స్ డైసీ అని అంటారు.



సంస్కృతంలో భృంగరాజ అని వ్యవహరిస్తారు. గుంటగలగరాకు మొక్క తేమ ఉండే ప్రదేశాలలో ఎక్కువగా కనిపిస్తుంది. పొలాల గట్ల మీద, కాలువల దగ్గర విరివిగా పెరుగుతుంది. దీనిని ఏ విధంగా ఉపయోగించినా ఆరోగ్యానికి మంచిదే. ఈ ఆకును రసం, పొడి, పచ్చడి ....ఇలా ఏ విధంగా తీసుకున్నా బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు.ఎన్నో ఔషధ గుణాలు దాగి ఉన్న గుంటగలగరాకు ప్రయోజనాలు గమనిస్తే..

గుంటగలగరాకు ఆకులను సేకరించి శుభ్రంగా కడిగి మెత్తగా నూరి, పేస్ట్ లా తయారు చేసుకోవాలి. నువ్వుల నూనె లేదా కొబ్బరి నూనెలో ఈ పేస్టు వేసి నూనె పచ్చ రంగులోకి మారే దాకా రెండు లేదా మూడు రోజులు ఎండలో పెట్టాలి. లేదంటే గుంటగలగర పొడి ఆయుర్వేద దుకాణాలలో దొరుకుతుంది. ఈ పొడితో పైన చెప్పిన విధంగా తైలం తయారు చేసినా ప్రయోజనకరమే. ఈ

కానుకలు ఇవ్వు, నీతో సమానమైన వాడికి పట్టాభిషేకం చేసెయ్యి. తాగి ఉన్నవాడిని, రతిలో ఉన్నవాడిని, అప్రమత్తంగా లేనివాడిని, యుద్ధం నుంచి పారిపోతున్న వాడిని, ఆయుధం లేనివాడిని చంపితే పసిపిల్లాడిని చంపిన పాపం వస్తుంది, కనుక నేను నిన్ను వదిలేస్తున్నాను. ఈ రాత్రికి ఇక్కడ నిరీక్షిస్తాను. రేపు పొద్దున్న రా, నిన్ను చంపి అవతల పడేస్తాను" అన్నాడు.

అప్పుడు వాలి 'నువ్వు నా గురించి అంతగా బెంగ పెట్టుకోమాకు. నేను తాగి ఉన్నా కూడా, అది వీరరసం తాగినవాడితో సమానం, రా యుద్ధానికి" అని, అడ్డువచ్చిన భార్యలని పక్కకు తోసేసి దుందుభి మీదకి వెళ్లాడు. ఇంద్రుడు ఇచ్చిన మాలని వాలి తన మెడలో వేసుకుని దుందుభి తల మీద ఒక్కసారిగా మోదడంతో దుందుభి ముక్కు, చెవుల నుండి నెత్తురు కారి కింద పడిపోయాడు. ఆ యుద్ధంలో వాలి దుందుభిని సంహరించి. ఆతని శరీరాన్ని గిరగిర తిప్పుతూ విసిరేయగా, యోజన దూరంలోని మతంగ మహర్షి ఆశ్రమం దగ్గర పడింది. ఆ ప్రభావంతో ఆశ్రమం అంతా నెత్తురుతో తడిసిపోయింది. మతంగ మహర్షి దివ్యదృష్టితో విషయాన్ని గమనించి, 'దుందుభి కళేబరాన్ని ఇటు విసిరినవాడు, ఇక్కడికి వస్తే వాడి తల వెయ్యి వ్రక్కలై మరణిస్తాడు" అని శపించాడు.'వాలి సంబంధికులు ఇక్కడి చెట్లని పాడుచేస్తూ తిరిగితే, తరువాతి తరం వారు మరణిస్తారని శపిస్తాను. నేను శపించే లోపల మీ అంతట మీరు ఇక్కడి నుండి వెళ్లిపొండి" అని అక్కడ సంచరిస్తున్న వారిని హెచ్చరించారు. దాంతో అక్కడ ఉంటున్న వానరాలు ఆ పర్వతాన్ని ఖాళీ చేసి వాలికి మతంగ మహర్షి శాపం గురించి వివరించారు. అందుకే వాలి ఈ పర్వతం వైపు కనీసం చూడను కూడా చూడడు. 'నేను బతకాలంటే ఈ బ్రహ్మాండంలో వాలి రాని ప్రదేశం ఇదే. అందుకని నేను ఇక్కడ ఉంటున్నాను. అదిగో! ఎదురుగుండా కనపడుతుందే పెద్ద తెల్లటి పర్వతంలాంటిది, అదే దుందుభి కాయం. ఆ అస్థిపంజరం ఇప్పుడు పర్వతంలా అయిపోయింది. నీవు దీనిని ఇక్కడినుంచి కదిలించు చూద్దాం... అప్పుడు నేను నీ శక్తి సామర్థ్యాలను నమ్ముతాను" అన్నాడు.

ఆ తర్వాత ఏం జరిగిందో ముందే చెప్పుకున్నాం కదా...ఆ విధంగా రామాయణంలో దుందుభిది పరోక్ష పాత్రే ఒక విధంగా కీలకమైనదే. ఆతని శరీరాన్ని వాలి విసరి ముని శాపానికి గురికావడం, ఫలితంగా అక్కడికి అడుగుపెట్టకపోలేక పోవడంతో సుగ్రీవాదులు తలదాచుకునేందుకు అవకాశం కలిగింది. రామలక్ష్మణులకు ఆయనతో పరిచయం కలిగింది. ఆ తర్వాత రామాయణ కథ నడిచింది.. ★

ఆకు నూనెలో ఐరన్, క్యాల్షియం, మెగ్నీషియం, విటమిన్ డి, విటమిన్ ఎ అధికంగా ఉంటాయి. ఈ సూపర్ ఎఫెక్ట్ ఆయిల్ హెయిర్‌కి టానిక్ లా పని చేస్తుంది. జుట్టు ఊడకుండా ఒత్తుగా పెరిగేలా చేస్తుంది. చుండ్రు సమస్యను తగ్గిస్తుంది. అన్నిరకాల జుట్టు సమస్యలకు చెక్ పెడుతుంది..

ఆరోగ్య ప్రయోజనాలు..!!

గుంటగలగరాకు ఆకుల రసంలో ఐదు మిల్లీ గ్రాముల తేనె కలిపి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సేవిస్తే జలుబు, దగ్గు, గొంతులో గరగర, ఆయాసం తగ్గుతాయి.ఈ ఆకులను మెత్తగా నూరి తలకు పట్టిస్తే జుట్టు రాలే సమస్య నుండి బయటపడవచ్చు. జుట్టు ఒత్తుగా పెరగడానికి దోహదపడుతుంది. ఈ రసాన్ని నూలు బట్టలో వేసి రెండు చుక్కలు ముక్కులో పిండితే తలనొప్పి, మెదడు బలహీనత, తల బరువు నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఈ ఆకులను నమిలితే నోటి చిగుళ్ల నుంచి రక్తం కారడం, నోటిదుర్వాసన, నోటి సమస్యలనుండి కాపాడుతుంది.

గుంటగలగర మొక్కను తెచ్చుకుని పెరట్లో పెంచుకోవడం సులువు. కుండీలలో కూడా పెరుగుతుంది. ★



# తగిన పరీక్ష

ఒక యువకుడు ఓ గురువు గారి దగ్గరకి వచ్చాడు. 'నాకు చిన్న ఉద్యోగం ఇవ్వండి. కాసింత కూడు పెట్టండి. ఏదో దేవుడిని తలచుకుంటూ, మీ సేవ చేసుకుంటూ బతుకుతాను' అని అడిగాడు.

'నీకేం వచ్చోయ్?' ప్రశ్నించారు గురువుగారు.

'ఏమీ రాదండీ. చదువుకోలేదు. ఏ విద్యా నేర్చుకోలేదు. కప్పులు కడగడం, ఇల్లు ఊడ్వడం వంటి పనులు వచ్చు. అంతేనండీ' అన్నాడు యువకుడు.

'ఇంకే పనీ రాదా?'

'అంటే... చదరంగం కొద్దిగా వచ్చు'

అప్పటికప్పుడు చదరంగాన్ని తెప్పించారు గురువుగారు. 'ఆటాడుదాం. ఒకటే పందెం. ఇదిగో ఈ కత్తిని చూశావా? ఓడిన వాడి



ముక్కు తెగ కోయాలి. ఒప్పుకుంటావా?'

యువకుడికి ఉద్యోగం కావాలి. ఇంకో మార్గం లేదు. ఒప్పుకున్నాడు. ఆట మొదలైంది. యువకుడు మొదట్లో కొన్ని తప్పులు చేశాడు. ఆటలో వెనకబడ్డాడు. అతని దృష్టి పొడవాటి కత్తిపై పడింది. చేత్తో ముక్కును తడుముకున్నాడు. ఏకాగ్రతతో పావులు కదిపాడు. తనదే పైచేయి అయింది. ఇంకో రెండు మూడు ఎత్తులతో గురువుగారిని చిత్తుచేసే స్థితికి వచ్చాడు. ఆ సమయంలో అతను మళ్లీ కత్తి వైపు చూశాడు. గురువుగారి ముక్కు వైపు చూశాడు. ఏమనుకున్నాడో ఏమో! కావాలనే ఒక తప్పు ఎత్తుగడ వేశాడు. గురువు గారు ఒక్క ఉదుటున లేచి కత్తితో చదరంగంపై పావులను తోసేశారు. 'ఆట అయిపోయింది. నువ్వు ఆశ్రమంలో ఉద్యోగానికి ఎంపికయ్యావు' అన్నారాయన.

యువకుడికి ఏమీ అర్థం కాలేదు. మంచి పనివాడికైనా, మంచి సాధకుడికైనా రెండు గుణాలుండాలి. మొదటిది 'మహాప్రజ్ఞ'. అంతులేని ఏకాగ్రతతో చేస్తున్న పని మీదే దృష్టిని పెట్టగలగాలి. రెండవది అన్నీ ఉన్నా అతనికి తప్పనిసరిగా 'మహాకరుణ' ఉండాలి. నువ్వు గెలిచే ఆటని నేను ఓడకుండా ఉండేందుకు వదులుకున్నావు. నా ముక్కు తెగే కన్నా నీ ముక్కు తెగడమే మంచిదనుకున్నావు. ఇదే మహాకరుణ. ఈ రెండు గుణాలూ నీకున్నాయి. అందుకే నువ్వు మాతోటే ఉండు' అన్నారు గురువుగారు. ★



# వరాహమిహిర 14



పాలంకి సత్య

"కుమారా! నీ జైత్రయాత్ర సఫలమైనందుకు సంతోషంగా ఉంది" అని చెప్పి గంధర్వసేనుడు అశ్వమేధ యాగం చేయమని సూచించాడు. తండ్రి మాటను అనుసరించి యాగాన్ని చేసిన విక్రమాదిత్యుడు సామంత రాజుల నుంచి స్వీకరించిన కప్పమంతటినీ దానం చేశాడు. ఆపైన ఉజ్జయినీశ్వరుని జైత్రయాత్ర పశ్చిమ దిశగా సాగినది. కశ్మీరం వరకు గల రాజ్యాలన్నిటినీ కైవసం చేసికొని, అగ్నివంశ క్షత్రియులైన పరిహార వంశస్థుల కుమార్తె భోగవతిని వివాహం చేసికొని తిరిగివచ్చి మరొకసారి అశ్వమేధయాగం చేశాడు. విరివిగా దానాలూ చేశాడు.

ఉత్తరాన బదరీనాథ క్షేత్రం నుండి దక్షిణాన సేతుబంధం వరకూ, తూర్పున కపిలవస్తు నగరం నుండి పశ్చిమాన సింధునదీ తీరం వరకూ రాజ్యం విస్తరించింది. విక్రమాదిత్యుడు చక్రవర్తిగా అభిషిక్తుడైనాడు.

* * *

జూలియస్ సీజర్ విజయయాత్ర అప్రతిహతంగా సాగింది. రోమ్, గ్రీస్‌లలో వలె వాటికి ఉత్తరాన గల ప్రాంతాలలో నాగరికత అంతగా అభివృద్ధి చెందలేదు. అక్కడ నివసించే ఆటవిక తెగల నుంచి రోమ్‌కు రక్షణ కల్పించడమే తన లక్ష్యమని సీజర్ బహిరంగంగా ఉద్ఘాటించాడు. కానీ అతని అంతరంగంలోని ఊహలు వేరు. తన రాజ్యాధికారాన్ని సుస్థిరపరచుకోవాలి. రాజ్యాలను కొల్లగొట్టి ఎన్నికలలో విజయం కోసం చేసిన అప్పులను పూర్తిగా తీర్చివేయాలి.

గాలియా సైనికులు పరాక్రమంలో, ఆయుధ ప్రయోగంలో రోమ్ వారికి తీసిపోరు. కానీ గాలియా ఒక రాజ్యం కాదు. అనేకమైన తెగలున్నాయి. వారి మధ్య సయోధ్య లేని కారణంగా సీజర్‌కు విజయం సులభమైంది. వెర్సింజిటోరిక్స్ అనే గాలియా వీరుడు అందరినీ ఒకటిగా చేర్చి సీజర్‌తో యుద్ధం సాగించాడు. సీజర్‌కు శత్రువును జయించడం అసాధ్యమైనది. రోమ్ నుంచి మరింతగా బలగాన్ని తెప్పించి, గాలియా నాయకుల మధ్య స్పర్ధలను కలిగించి, సీజర్ యుద్ధం చేశాడు. తాను గెలిచిన ప్రతి చోటా సామాన్య పౌరులను సైతం చంపివేయడం సీజర్ యుద్ధనీతిలో భాగమే. కొన్ని లక్షల మంది ప్రజల మరణాలను చూసిన వెర్సింజిటోరిక్స్ సీజర్‌కు లొంగిపోయాడు. ప్రజా సంక్షేమమే ముఖ్యమనకుని లొంగిపోయిన వెర్సింజిటోరిక్స్‌ని రోమ్ కారాగారంలో బంధించి, సీజర్ విజయోత్సవాలు జరుపుకున్నాడు.

ఉత్సవాలు పూర్తయిన తరువాత సీజర్ తిరిగి దండయాత్రలు చేసి, జర్మానియా, బ్రిటానియాలను జయించి, రాజ్యాలను కొల్లగొట్టాడు. సైనికులకూ, పౌరులకూ అతడు మిగిల్చినవి రెండే మార్గాలు. మరణం లేదా బానిసత్వం.

నేడు ఐరోపా ఖండంగా పిలుస్తున్న ప్రాంతమంతా జూలియస్ సీజర్ వశమైనది. మరొకసారి ఉత్సవం జరుపుకున్న సీజర్ తన చిరకాల ప్రేయసి సెర్విలియా వద్దకు వెళ్లాడు.

"పాంపీయా ప్రాణ వల్లభునకు స్వాగతం" సెర్విలియా అన్నది.

"ఎప్పుడు వచ్చినా అదే మాట. నా ప్రియాతి ప్రియమైన కాంత ఎవరో ఇప్పటికీ నీకు తెలియదా? ఇదిగో దీనిని చూసిన తర్వాతనైన చెప్పు" అంటూ సీజర్ ఆమె చేతిలో చెయ్యి ఉంచాడు. తన చేతిలో ఉంచిన వస్తువును చూసిన సెర్విలియా మైమరచిపోయింది. చిన్నగుడ్డు పరిమాణంలో ఉన్న నల్లని ముత్యమది.

"బ్రిటానికాకూ, గాలియాకూ మధ్యనున్న సముద్రంలో దొరికినదట. బ్రిటానికాలోని ఒక నాయకుని వద్ద చూచి,ఇది నీ కంఠాన్ని అలంకరిస్తే నీవు మరింత సౌందర్యవతిగా కన్పించగలవని తెచ్చాను".

"ఇచ్చేందుకు ఆ నాయకుడు అంగీకరించినాడా?"

"అతని అంగీకారంతో పని ఏమి?"



సెర్విలియా ముత్యాన్ని తన కంఠసీమలోని హారానికి చేర్చినది.

"నీ తెల్లని మెడ ఈ నల్లని ముత్యం వలన మెరుస్తున్నది సుమా" అంటూ సీజర్ ఆమె కంఠాన్ని చుంబించాడు.

* * *

సర్వాభరణ భూషితురాలై భర్త వద్దకు వచ్చిన ఖనా ''నగలను పట్టమహిషి బహుమతిగా పంపించినారు. అత్తగారు ఆనందంతో నాకు స్వయంగా అలంకరించారు. ఎట్లున్నాను?" అని ప్రశ్నించింది.



వరాహమిహిరుడు "స్త్రీలు రత్నములకు అందమును ఇస్తారు తప్ప రత్నాల వల్ల వారి సౌందర్యం ఇనుమడించదు. రత్నాలు లేకున్నా స్త్రీలు మనోహరిణులే. స్త్రీలు ధరించని రత్నాలకు శోభ లేదు" అని చెప్పి ఆ అర్థం స్ఫురించే శ్లోకం చదివాడు.

రత్నాని విభూషయంతి యోషా
భూష్యంతే వనితా న రత్న కాంత్యా
చేతో వనితా హరంత్య రత్నా
నో రత్నాని వినాంగనాంగ సంగం

ఖనా "మీరు రచించిన బృహత్సంహితలోనిది కదా" అన్నది.

''అవును... ఈ శ్లోకం ముఖం మీద కనిపించకుండా ఉండవలసిన రాజుకు ఉన్న ఏకైక సుఖం మిత్రులే అని అతడు చెప్పబోయాడు. ఏకైక సుఖం ప్రియా సంగమమే అని నేను పూర్తి చేశాను" అన్న వరహమిహిరుడు ఆనాడు రచించిన శ్లోకాన్ని చదివాడు.

**ఆకారం విని గుహతాం రిపు బలం జేతుం సముత్తిష్టతాం / తంత్రం చింతయతాం కృతాకృత శత వ్యాపార శాఖా కులం**

**మంత్రి ప్రోక్త నిషేవితాం క్షితి భుజా మాశంకినాం సర్వతో / దుఃఖాం భోనిధి వర్తినాం సుఖలవః కాంతా సమాలింగనం**

మిహిరుడు ఆనాటి విషయాలను గుర్తు చేసుకుంటూ "నేనీ శ్లోకాన్ని చదవగానే విక్రముడు ఆశ్చర్యచకితుడైనాడు. తనకన్నా వయసులో చిన్నవాడనైన నేను కాంతా పరిష్వంగ సుఖం గురించి మాట్లాడడం ఏమిటనుకున్నాడు. ఆ మాటనే నాతో అన్నాడు. నిజమే... అప్పటికి నీవంటి ఉత్తమ జాతి స్త్రీ రత్నం నాకు లభించునని కానీ, ఆమెతో సమాగమం ఆనంద శిఖరాలను అధిరోహింప చేయగలదని కానీ నాకు తెలియదు కదా!" అన్నాడు.

"కాంతా సమాలింగనమును మించిన సుఖం లేదా?" అని ఖనా అన్నది.

"ఏమున్నది?" అని మిహిరుడన్నాడు.

"పుత్ర గాత్ర పరిష్వంగ సుఖం మాట ఏమి?"

"ఖనా" అని ఆనందాశ్చర్యములు మేళవించిన స్వరముతో మిహిరుడామెను దగ్గరగా తీసుకున్నాడు.

''మహారాణి ఆభరణములను కానుకగా పంపారని చెప్పినా, అత్తగారు ఆనందముతోత స్వయముగా అలంకరించారని చెప్పినా మీరు ఎందుకని ప్రశ్నించలేదు. మీకు రచనా వ్యాసంగము తప్ప మరియొక ఆలోచన లేదు".

"ఎందుకు లేదు? నీ గురించిన ఆలోచనకే ప్రథమ స్థానం" అని వరహ మిహిరుడన్నాడు.

* * *

తల్లిదండ్రుల అనుమతితో వరాహ మిహిరుడు తనకు జన్మించిన కుమారునకు పృథుయశస్సు అని నామకరణం చేశాడు. పౌత్రుని ఆశీర్వదించిన ఆదిత్యదాసు "నీవు నాకు కీర్తిని తెచ్చినట్లే నీ కుమారుడు నీ పేరుని దశ దిశలా వ్యాపింప చేయును గాక" అని అన్నాడు.

"పితృదేవుల కృప. నేను స్వయంగా సాధించిన దేమీ లేదు".

"హోరాశాస్త్రం, సంహితులను పూర్తి చేసినావు. రెండు కావ్యాలను రచించినావు. మొదటగా ప్రారంభించిన సిద్ధాంత గ్రంథం ముగించకుండా యాత్రపై రచనను మొదలుపెట్టినావేమి?"

"మూడు సిద్ధాంతాలను ముగించిన సంగతి జనకులకు అవగతమే. యవన సిద్ధాంతం రాయాలని ఉన్నది. యవన ఖగోళ శాస్త్రం ఇంకా అభ్యసించాలి.

తర్వాతి శ్లోకం ఏనాడో, విక్రముడు రాజైన కొత్తలో రచించినది. ఒకనాడు ఇరువురమూ కలసి కూర్చున్న సమయంలో రాజ్యపాలనలోని కష్టాల గురించి అతడు ప్రస్తావించాడు. శత్రువులపై విజయం ఎలా సాధించాలి, రాజ్యతంత్రం ఎలా నిర్వహించాలి, ఎవరిని ఎంత వరకూ నమ్మాలి వంటివి ఆలోచిస్తూ, ఆలోచనలను

పారసీక రాజ్యంలో నా విద్యాగురువులు అలెక్సాండ్రియా నగరంలో పండితులున్నారని తెలిపారు. చక్రవర్తి అనుమతితో, వారి సహాయంతో ఆ నగరానికి వెళ్లవలెనని నా కోరిక. ప్రస్తుతం విక్రమాదిత్యులు నేపాలం వెళ్లినారట".

"నీ అభీష్టము నెరవేరును గాక".

* * *

ఆనాటి రాత్రి శిశువు నిదురించిన తర్వాత ఖనా "యవనులను మ్లేచ్ఛులనీ, అనార్యులనీ భరత ఖండంలో అందరూ అంటారు కదా. యవన సిద్ధాంతాన్ని ఇక్కడ నివసించేవారు అంగీకరించ గలరా?" అని అడిగింది.

"పారసీక దేశంలో పెరిగిన నీకు యవనుల తోనూ, వారి సంస్కృతీ, సంప్రదాయాలతో పరిచయ మున్నది కదా! వారి శాస్త్ర విజ్ఞానం నీవు కాదన గలవా? యవనులు మ్లేచ్ఛులన్నమాట వాస్తవం. కానీ అనేక శాస్త్రాలలో వారి ప్రగతిని కాదనుట పాడి కాదు. భారతీయ రుషులను గౌరవించినట్లే యవన పండితులను గౌరవించడమూ ధర్మం. ఆ విషయమే నా రచనలలో సూచించగలను. ఆపైన చదువరుల ఇష్టం" అన్న మిహిరుడు తన కుమారుని వైపు దృష్టి సారించి, "నిద్రలోనే నవ్వుతున్నాడు. పుత్రుడు నీ వలెనే అందంగా ఉన్నాడు" అన్నాడు.

"పాండిత్యంలో మీ అంతటివాడగును గాక"

"అదేమి మాట? సౌందర్యం, వివేకం, మంచితనం నీలో త్రివేణి వలె ప్రవహిస్తున్నవి. కుమారుని విద్యాబోధన బాధ్యత నీదే సుమా".

"మీ పని ఏమి?"

"నీ కడగంటి చూపుల వెన్నెలలో శయనించుట" అని మిహిరుడామె ఒడిలో తల పెట్టుకున్నాడు.

* * *

జూలియస్ సీజర్ తన భవనంలో ఏకాంతముగా కూర్చుని ఆలోచిస్తున్నాడు. గాలియాను జయించి, బ్రిటానికా, జెర్మానియా మొదలైన రాజ్యాలను కైవసం చేసుకొని తిరిగి వచ్చాక తనకు ఎదురన్నది లేనే లేదు అని చెప్పే వీలు లేదు కానీ చాలావరకు తగ్గినది. క్రాసస్‌ను సిరియాలోని శత్రుసైన్యం నిర్మూలించింది. ఇక పాంపేను లొంగ తీసుకోవాలి.

సీజర్ ఆలోచనలను భగ్న పరుస్తూ పరిచారిక వచ్చి అతని కుమార్తె జూలియా ప్రసవ సమయంలో మరణించిందనీ, ఆమెకు కలిగిన ఆడశిశువు బలహీనంగా ఉందనీ, బ్రతికే అవకాశం తక్కువ నిపిస్తున్నదనీ విన్నవించింది. వైద్యులని పిలిపించ మని ఆదేశమిచ్చిన సీజర్‌కు కుమార్తె మరణవార్త దుఃఖాన్ని కలిగించలేదు. సరికదా బంధ విముక్తి కలిగిన అనుభూతినిచ్చింది. కుమార్తె కోసం తాను పాంపే ఆగడాలను కొంతవరకూ భరించాడు. లేకుంటే తనను ప్రభుత్వాధికారిగా సేనాధిపత్యంను వదలుకుని, సేనను వారి ఇండ్లకు పంపెయ్యమని



జూలియస్ సీజర్ తన భవనంలో ఏకాంతముగా కూర్చుని ఆలోచిస్తున్నాడు. గాలియాను జయించి, బ్రిటానికా, జెర్మానియా మొదలైన రాజ్యాలను కైవసం చేసుకొని తిరిగి వచ్చాక తనకు ఎదురన్నది లేనే లేదు అని చెప్పే వీలు లేదు కానీ చాలావరకు తగ్గినది. క్రాసస్‌ను సిరియాలోని శత్రుసైన్యం నిర్మూలించింది. ఇక పాంపేను లొంగ తీసుకోవాలి.

ఆదేశిస్తాడా? ఇకపై పాంపేను వదలి పెట్టరాదు.

రోమ్‌లో అంతర్యుద్ధం మొదలైనది. సీజర్, పాంపేల మధ్య జరిగిన పోరాటంలో సీజర్‌దే పై చేయి అయినది. పాంపే తన సైనికులతో సహా పరాజితుడైనాడు. అతనిని వెంబడించి, యుద్ధము లలో జయిస్తూ, చివరకు పాంపే ఈజిప్టులో తల దాచుకునేలా సీజర్ చేయగలిగాడు.

* * *

విక్రమాదిత్యుడు నేపాలం నుంచి తిరిగి వచ్చాక వరాహ మిహిరుడాతనిని దర్శించి తనకు అలెక్సాండ్రియా నగరంలో యవన ఖగోళ శాస్త్రం అభ్యసించవలెనని ఉన్నదనీ, మిత్రుని సహాయం లేనిదే తన ప్రయాణం సాధ్యము కాదనీ అన్నాడు.

"అదేమంత కష్టమైన పని? వర్తక బృందము లనేకములు వెళ్లి వస్తూ ఉంటాయి కదా. నీకై రథమును కానీ, ఒంటెల బండిని కానీ ఏర్పాటు చేయవచ్చును. దానికేమి! కానీ నేటి నుంచి మూడు రాత్రులు కాళిదాసు అనే కవి రచించిన అభిజ్ఞాన శాకుంతలము నాటకం మహాకాళ మందిరంలో ప్రదర్శించనున్నారట. కవీ, నటీనట బృందమూ నన్ను నాటకం చూసేందుకు రమ్మని పలు విధాల ప్రార్థించినారు. నీవు గురుదేవులతో, గురుపత్నితో, అర్ధాంగితో నాటక దర్శనానికి రావలసినది. ఇరువురమూ కలసి చూద్దాం. కాళిదాసు రచనా పటిమ ఎంతటిదో తెలియగలదు".

"అతని మాళవికాగ్నిమిత్ర నాటకం నేను చదివినాను. బాగుగనే ఉన్నది".

"ఈ నాటకం కూడా చూచి అతని శక్తిని నిర్ణయించెదవు గాక".

"మిత్రమా, నిన్ను మించిన పరీక్షకుడనా?" విక్రముడు చిరునవ్వు నవ్వాడు.

* * *

మహాకాళేశ్వరుని దేవాలయ ప్రాంగణంలో శాకుంతల నాటక ప్రదర్శనకు సన్నాహాలు పూర్తయినాయి. చక్రవర్తికీ, ఆయన సన్నిహితులకూ ప్రత్యేకమైన ఆసనాలు అమర్చారు. పట్టమహిషీ, రాణులూ, అంతఃపుర జనమూ కూర్చునేందుకు స్థలం కేటాయించారు. సామాన్య ప్రజలందరూ ముందుగానే వచ్చి ఆసీనులైనారు. చక్రవర్తిని సకల మర్యాదలతో ఎదుర్కొని, నాటక రచయితా, సూత్రధారుడు ఆయన వెంట వెళ్లి, ఆయన కూర్చున్నాక, తెరవెనుకకు వెళ్లారు. విక్రమాదిత్యుడు ఆనతిచ్చాక నాటకమారంభమైనది.

ఛాయాదేవి తాను పౌత్రుని సంరక్షణకు స్వీకరిస్తానని చెప్పి, ఖనాను పంపించింది. పట్టమహిషి వీరలక్ష్మీదేవి ఆజ్ఞతో పరిచారికలకు ఖనాను అంతఃపుర జనమున్న చోటికి తీసికొని వెళ్లారు. మిహిరుడు విక్రముని పక్కన ఆసీనుడైనాడు.

మూడు రాత్రుల నాటక ప్రదర్శన అనంతరం కాళిదాసు విక్రమాదిత్యుని వద్దకు వచ్చి ఆశీఃపూర్వక శ్లోకం చదివి, చక్రవర్తి వంక ఆశాపూర్వక దృక్కులు పరపాడు. "రాబోయే శుక్రవారం మధ్యాహ్న సమయంలో మా ప్రాసాదంలో కలవవలసినది" అని చక్రవర్తి సెలవిచ్చాడు.

* * *

శుక్రవారం మధ్యాహ్న సంధ్యా వందనం, భోజనం పూర్తి చేసికొని కాళిదాసు విక్రమాదిత్యుని మందిరానికి వెళ్లి, భటునికి తన వివరాలు తెలిపాడు. భటుడు లోనికి వెళ్లి, చక్రవర్తి ఆజ్ఞపై కాళిదాసును తీసుకొని వెళ్లాడు. విక్రమాదిత్యుని ప్రక్కనే వరహమిహిరుడు కూర్చుని ఉన్నాడు. కాళిదాసు చక్రవర్తిని స్తుతిస్తూ శ్లోకం చెప్పి, ఆయన ఆనతిపై కూర్చున్నాడు.

"కవివర్యా, మీ రచన మా మనస్సును ఆకట్టుకున్నది. పద్య, గద్య రచనలో మీరు దిట్టలు. కానీ మీ కథా వస్తువు మాకు రుచించలేదు".

కాళిదాను బెరుకుగా చూని, మౌనం వహించాడు.

"దుష్యంత మహారాజు చంద్రవంశస్థుడు. తన గోత్ర నామాలను మరుగుపరచి, ఒక కన్యను వశపరచుకొనవచ్చునా? అసత్య దోషానికి పాల్పడవచ్చునా? విశ్వామిత్ర మహర్షికి జన్మించిన శకుంతల బేల వలె ప్రవర్తించటం మా మనస్సునకు రుచింపలేదు. మహాభారతంలో శకుంతల క్షత్రియ కన్య వలె చరించింది. తన సంతానానికే మహారాజు పట్టం కట్టవలెనన్న నియమాన్ని రాజు అంగీకరించిన వెనుకనే వివాహానికి అంగీకరించింది. సభలో ధైర్యంగా ప్రసంగించినది. మీరు సృష్టించిన భీరువు భరతుని వంటి కుమారునకు జన్మనీయగలదా?

(సశేషం)

# విద్యార్థి లోకాన్ని కదం తొక్కించిన 'కడియం'

నివాళి




ప్రత్యేక తెలంగాణ ఉద్యమకాలంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో లక్ష మందితో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రణభేరి కార్యక్రమాన్ని నడిపించిన డాక్టర్ కడియం రాజు ఇకలేరు. ఆయన మార్చి 20న హఠాన్మరణం చెందారు. ఆయన వయస్సు 45 సంవత్సరాలు. 'ఆత్మహత్యలు వద్దు– బ్రతికుండి తెలంగాణ సాధిద్దాం' అంటూ అలనాటి బీజేపీ నేత సుష్మా స్వరాజ్ గర్జించిన కార్యక్రమంగా ఇది ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ సభకు కడియం రాజు అధ్యక్షత వహించారు. డాక్టర్ రాజు ఏబీవీపీ చేపట్టిన అనేక ఉద్య మాలను ముందుండి నడిపిం చారు. తెలంగాణ సాధన కోసం కోదాడ నుండి హైదరాబాద్ వరకు ఏబీవీపీ జరిపిన మహాపాద యాత్రకు కూడా ఆయనే నేతృత్వం వహించారు. నా రక్తం–నా తెలంగాణ, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె, సాగర హారం, ఉస్మానియా యూనివర్సిటీ లో విద్యా ర్థుల నిరాహార దీక్షలు ఇలా తెలంగాణ సాధనలో అనేక ఉద్యమాలలో క్రియాశీలకంగా పోరాడారు.

ఇవేకాదు, ఉస్మానియా విశ్వవిద్యాలయ భూముల పరిరక్షణ ఉద్యమం లోను డాక్టర్ రాజు ముందున్నారు. ఆక్రమణకు గురైన భూముల గురించి కోర్టులలో కేసులు వేశారు. నిరుద్యోగం, విద్యారంగ సమస్యలు, మెస్ బిల్లులు, విద్యార్థి వేతనాలు, మౌలిక వసతులు, నూతన హాస్టళ్ల నిర్మాణం కోసం జరిగిన అనేక ఉ ద్యమాలకు నాయకత్వం వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమ చరిత్రలో 108 రోజుల జైలు జీవితం గడిపిన వ్యక్తి ఆయన. డాక్టర్ రాజు అంటేనే స్నేహశీలిగా, నిరాడంబర జీవిగా, వినయశీలిగా, సహృదయుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, కార్యదక్షునిగా, దేశభక్తునిగా పేర్గాంచారు. అన్న, బాబాయ్, మామగా ముద్దుగా పిలుచుకునే ఉస్మానియా యూనివర్సిటీ యువ సంచలనం.

డా. కడియం రాజు నల్లగొండ జిల్లా, మిర్యాలగూడ మండలం, కొత్త గూడెంలో నిరుపేద ఎస్సీ కుటుంబంలో జన్మించారు. పాఠశాల విద్య కొండ్రా పోల్ గ్రామంలో, ఇంటర్మీడియట్ నాగార్జున జూనియర్ కళాశాల, మిర్యాలగూడ కేఏన్ఎం డిగ్రీ కళాశాలలో బి.ఏ. డిగ్రీ పూర్తి చేశారు. డా.కడియం రాజు ఇంటర్మీడియట్ నుండి దేశభక్తి, జాతీయ భావాలు కలిగిన విద్యార్థిగా ఏబీవీపీలో క్రియా శీలకంగా పనిచేస్తూ కేఏన్ఎం డిగ్రీ కళాశాల ఏబీవీపీ శాఖ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. పేదరికం తెచ్చిన సమస్యలను అధిగమించి, తన జాతీయ భావాలను నిలబెట్టు కుంటూనే 2002 సంవత్సరంలో ఉన్నత విద్య కోసం ఉస్మానియా యూనివర్సిటీలో చేరారు. ఎంఏ చరిత్ర విభాగంలో ప్రవేశం పొందారు. చరిత్ర విభాగం లొనే ఎంఫిల్, పీహెచ్‌డీ కూడా పూర్తి చేశారు. విశ్వవిద్యాలయంలో ప్రవేశించిన నాటి నుంచి ఏబీవీపీ తరపున సైద్ధాంతిక పోరులో ముందుండి క్రియాశీలకంగా పనిచేశారు. తమ సంస్థ చేపట్టిన ఎన్నో విద్యారంగ సమస్యలపై ముందుండి పోరాడారు. ఎన్నో లాఠీ దెబ్బలు తిన్నారు. పోలీస్ స్టేషన్లు చుట్టూ తిరిగారు.

ఏబీవీపీతో సాగిన సుదీర్ఘ ప్రయాణంలో ఉస్మానియా యూనివర్సిటీ ఇంచార్జ్, నగర కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి, జాతీయ కార్యదర్శి, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఆయన పనిచేశారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల విద్య నియంత్రణ కమిటీ సభ్యులుగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. జాతీయ భావాలను రగిలించి, ఎంతో మంది విద్యార్థులను దేశభక్తులుగా తీర్చిదిద్దిన డా.కడియం రాజు మరణం విద్యార్థిలోకానికి, దేశానికి తీరనిలోటు. వారి ఆత్మకు సద్గతులు ప్రాప్తించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాం. ★

# సేద్యం ఒక జీవన విధానం



**నల్లగొండ:** వ్యవసాయం వ్యాపారం కాదు ఒక జీవన విధానమని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి పట్లోళ్ల పేర్కొన్నారు. మార్చి 12న నల్లగొండ జిల్లా మర్రిగూడ(మాల్) మండల కేంద్రంలో గ్రామ భారతి నిర్మించిన మొదటి అంతస్తు పట్లోళ్ల స్మారక భవనం ప్రారంభోత్సవంలో జస్టిస్ మాధవి దేవి పాల్గొన్నారు. ఇక్కడి 20 ఎకరాల ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయం చేసి స్వయం సమృద్ధి సాధించాలని గ్రామ భారతి ఆవాస విద్యార్థులకు, హార్టికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆమె ఉద్బోధించారు. పట్లోళ్ల రామిరెడ్డి 1996లో నాటిన గ్రామ భారతి అనే బీజం నేడు వృక్షంగా ఎదిగి సమాజాన్ని ప్రభావితం చేయటం స్ఫూర్తిదాయకంగా ఉన్నదని అన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న మహిళలు–ఆసిఫాబాద్ చెందిన గ్రామభారతి పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్యవక్తగా పాల్గొన్న అన్నదానం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రామాలు స్వయంసమృద్ధి సాధించటానికి గ్రామభారతి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ న్యాయమూర్తులు రవీంద్ర కుమార్, ఉల్లం అజయ్ కుమార్, జిల్లా ఎస్పీ అపూర్వరావు గ్రామభారతి గౌరవ అధ్యక్షులు నాబార్డ్ విశ్రాంత అధికారి మోహనయ్య, గ్రామభారతి హార్టి కల్చర్ పాలిటెక్నిక్ చైర్మన్ స్తంభాద్రీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుస కరుణాకర్ గౌడ్, ఉపాధ్యక్షులు మోహన్, కార్యదర్శి సూర్యకళ, ఊట్కూరి లింగం, మదన్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

# కొల్లంపల్లి శిశుమందిర్ వార్షికోత్సవం



**నారాయణపేట** : నారాయణపేట జిల్లా, కొల్లంపల్లి గ్రామంలోని కేశవ శిశుమందిర్ 34వ వార్షికోత్సవము మార్చి 17న జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల అధ్యక్షులు నీలి రాంరెడ్డి అధ్యక్షత వహించగా, ప్రధాన వక్త అప్పాల ప్రసాద్ పాల్గొన్నారు. అతిథులు సాయిరెడ్డి, గ్రామసర్పంచ్, కృష్ణనాయక్, వందిల్‌గుట్ట తాండ సర్పంచ్, సొసైటి అధ్యక్షులు అవుసలి వెంకట్రాములు పాల్గొన్నారు.

ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో నాటి అమెరికా, సోవియట్ యూనియన్ (ప్రస్తుత రష్యా) మధ్య తీవ్ర పోటీ ఉండేది. వివిధ సందర్భాల్లో ఆయా దేశాల అధినేతలు చేసే వ్యాఖ్యలు, విమర్శలు, ప్రకటనలు, వ్యక్తం చేసే ఆందోళనలు, అభిప్రాయాలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపేవి. కాలక్రమంలో 90ల్లో సోవియట్ యూనియన్ పతనంతో అమెరికాకు అడ్డే లేకుండాపోయింది. దీంతో ఈ అగ్రరాజ్యం ఆడింది ఆటగా, పాడింది పాటగా మారింది. ప్రపంచంపై ఈ పెట్టుబడిదారీ దేశం పెత్తనం మొదలైంది. తరువాతి రోజుల్లో వ్లాదిమిర్ పుతిన్ నాయకత్వంలో రష్యా బలపడసాగినప్పటికీ అమెరికా ఆధిపత్యాన్ని పూర్తిగా అడ్డుకునే పరిస్థితి లేకుండాపోయింది. పుతిన్ దేశంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగినప్పటికీ ప్రపంచ వ్యవహారాలపై పూర్తిగా పట్టు సాధించలేకపోయారు.

ఈ నేపథ్యంలో ఆసియా అగ్రరాజ్యం చైనా.. తెరపైకి వచ్చింది. అంతర్జాతీయ వ్యవహారాల్లో అమెరికాను సవాల్ చేసే స్థాయికి బీజింగ్ ఎదిగింది. అనేక వర్ధమాన దేశాలకు ఆర్థిక సాయం, ఇతరత్రా చేయూత అందిస్తూ ప్రపంచ వ్యాప్తంగా తన పట్టును నిరూపించుకునేందుకు తాపత్రయపడుతోంది. అధ్యక్షుడు షి జిన్‌పింగ్ ఆధ్వర్యంలో డ్రాగన్ నానాటికీ శక్తిమంతంగా మారుతోంది. ఇంటా బయటా జిన్‌పింగ్ ఆధిపత్యం సాధించారు. స్వదేశంలో పార్టీ, సైనిక, రాజకీయ వ్యవహారాల్లో తిరుగులేని నేతగా పట్టు సాధించారు. అమెరికా తర్వాత ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా చైనా గుర్తింపు పొందింది. గతంలో ఆసియా దేశమైన జపాన్ రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేది.

ఈ నేపథ్యంలో 69 సంవత్సరాల జిన్‌పింగ్ చైనా అధ్యక్షుడిగా సరికొత్త చరిత్రను లిఖించారు. ఆయన ఈ పదవిని చేపట్టడం ఇది మూడోసారి కావడం విశేషం. మరో అయిదేళ్లపాటు ఆయనకు అత్యున్నత బాధ్యతలు అప్పగిస్తూ దేశ పార్లమెంటు, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ) ఇటీవల తీర్మానించడం విశేషం. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టంగా పేర్కొన వచ్చు. గతేడాది అక్టోబరులో జరిగిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) సమావేశం జిన్‌పింగ్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. దీంతో మావో తర్వాత రెండుసార్లకు మించి పార్టీ పగ్గాలు అందుకున్న నేతగా జిన్‌పింగ్ గుర్తింపు పొందారు. చైనా చరిత్రలో నిస్సందేహంగా ఇదో కీలక పరిణామం. సాధారణంగా సీపీసీ నిర్ణయాలను యథాతథంగా అమలు చేస్తూ రబ్బరు స్టాంపుగా పేరొందిన నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ) జిన్‌పింగ్‌ను మచ్చటగా మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నుకుంది. మొత్తం 2952 మంది సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో రాజ్యాంగంపై ప్రమాణం చేసి జిన్‌పింగ్ మరోసారి బాధ్యతలు చేపట్టారు. జిన్‌పింగ్‌కు సన్నిహితుడైన హన్ ఝెంగ్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తద్వారా పార్టీలో, ప్రభుత్వంలో రెండో అధికార కేంద్రం ఎదగకుండా చూసుకున్నారు. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా శక్తిమంతమైన నాయకుడు ఎవరంటే ముందుగా గుర్తుకు వచ్చేది జిన్‌పింగ్ పేరే. అమెరికా తదితర ప్రజాస్వామ్య దేశాల్లో నాయకుల పదవీకాలం స్వల్పకాలమే. అందువల్ల వారిని తిరుగులేని నాయకులని చెప్పలేం.

# మూడో దఫా



**జీవితకాలం అధికారంలో...**

తాజా ఎన్నిక ద్వారా చైనాకు సంబంధించిన పార్టీ, సైనిక, దేశ అంతర్గత వ్యవహారాల్లో జిన్‌పింగ్ సంపూర్ణ ఆధిపత్యం సాధిస్తారు. ఆయన మాటకు ఎదురుండదు. చేతలకు తిరుగుండదు. ఆయన చెప్పిందే వేదం, శాసనం. అంతర్జాతీయంగానూ ప్రభావం చూపగల స్థాయికి జిన్‌పింగ్ చేరుకుంటారు. 20 లక్షల మందికి పైగా బలగాల చైనా సైన్యానికి అధిపతిగా జిన్‌పింగ్ వ్యవహరిస్తారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ)గా గుర్తింపు పొందిన చైనా సైన్యానికి ప్రపంచంలోనే అతి పెద్ద సైన్యంగా పేరుంది. దానికి జిన్‌పింగ్ దిశా నిర్దేశం చేస్తారు. ఆర్మీకి అధిష్టానంగా భావించే కేంద్ర మిలటరీ కమిషన్ ఛైర్మన్‌గా జిన్‌పింగ్‌నే పార్లమెంటు ఎన్ను కుంటూ తీర్మానించిన సంగతి తెలిసిందే. దీంతో సైనిక అధికారాలన్నీ జిన్‌పింగ్‌కే దఖలు పడతాయి. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా, మిలటరీ కమిషన్ ఛైర్మన్‌గా, దేశాధ్యక్షుడిగా... ఇలా మూడు కీలకమైన అధికార కేంద్రాలకు అధినేతగా జిన్‌పింగ్ తిరుగులేని నేతగా కొనసాగనున్నారు. దీంతో జిన్ పింగ్ జీవితకాలం అధికారంలో కొనసాగుతారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగు తోంది.

**ఆదిలో అవమానాలు...**

జిన్‌పింగ్ ఈ స్థాయికి ఆషామాషీగా చేరలేదు. తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఎన్నో

భారత్ విషయంలోనూ జిన్‌పింగ్ గుర్రుగానే ఉన్నారు. వాస్తవాధీన రేఖ వద్ద సరిహద్దు వివాదాన్ని సమసిపోకుండా నిరంతర రావణకాష్టంలా మలచి ఉద్రిక్తతలు కొనసాగించాలన్నది ఆయన వ్యూహంగా దౌత్యవర్గాలు భావిస్తున్నాయి. క్రమంగా అంతర్జాతీయ శక్తిగా భారత్ ఎదగడం, ప్రపంచ వ్యవహారాల్లో భారత్ ప్రభావం, అమెరికాతో సత్సంబంధాలు కొన సాగించడం చైనా అధినేతకు మింగుడు పడని అంశాలే.

# ...లోనైన బుద్ధి మారేనా?

ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. జయాపజయాలను, ఎత్తుపల్లాలను చూశారు. ఆయన బాల్యం ఏమీ సంతోషంగా సాగలేదు. ఎన్నో చేదు అనుభవాలను, అవమానాలను ఎదుర్కొన్నారు. జిన్‌పింగ్ తండ్రి షి ఝూంగ్ షన్ మావో జెడాంగ్ సర్కారులో ఉప ప్రధానిగా చక్రం తిప్పారు. అయితే ఆయన ఉదార వాద విధానాలు అవలంబిస్తున్నారన్న ఆరోపణలు రావడంతో పదవి కోల్పోయారు. చివరికి జైలు పాలయ్యారు. అప్పటికి జిన్‌పింగ్ వయస్సు 13 ఏళ్లు. తండ్రి పదవి కోల్పోవడం, జైలు పాలవడం అతని మీద తీవ్ర ప్రభావం చూపింది. జీవితంలో రాటుదేలేలా చేసింది. అవమానకర ఘటనలు ఎదుర్కొన్నప్పటికీ కమ్యూనిస్టు పార్టీతోనే తన భవితవ్యం ముడిపడి ఉందన్న సత్యాన్ని గ్రహించారు. అందుకే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీకి దూరం కాలేదు. పార్టీలో ఎదిగేందుకు నిరంతరం ప్రయత్నించారు. ఈ దిశగా అందివచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఎట్టకేలకు 1974లో పార్టీ సభ్యత్వం పొందగలిగారు. అదే సమయంలో చదువునూ నిర్లక్ష్యం చేయలేదు. భావినేతగా ఎదగాలంటే చదువు అవసరమని గ్రహించారు. జానపద గాయని పెంగ్ లియూవాన్‌ను అర్ధాంగిగా చేసుకున్నారు. ఈ దంపతుల ఏకైక గారాల పట్టి షి మింగ్జే. పార్టీ, సైనిక, దేశ రాజకీయాలను కాసేపు పక్కనపెడితే వ్యక్తిగత జీవితంలో జిన్‌పింగ్ ఆమెనే లోకంగా భావిస్తారు.

**2012 నుంచి హవా ప్రారంభం..**

2012 నుంచి జిన్‌పింగ్ రాజకీయ జీవితంలో ఎదుగుదల ప్రారంభమైంది. ఆ ఏడాదే ఆయన తొలిసారి పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. అప్పటినుంచి ఆయనకు తిరుగులేకుండా పోయింది. క్రమంగా అన్ని వ్యవస్థలపై పట్టు సాధించడం ప్రారంభించారు. గత దశాబ్ద కాలంలో కమ్యూనిస్టు పార్టీ అధినేత మావో జెడాంగ్ తరువాత అంతటి శక్తిమంతమైన నేతగా ఎదిగారు. దేశంలో సీనియర్ నాయకులు ఎవరూ రెండుసార్లకు మించి పదవిలో కొనసాగకూడదని మావో జెడాంగ్ తరవాత అధికార పగ్గాలు చేపట్టిన డెంగ్ జియావో పింగ్ నిర్దేశించారు. అయితే ఈ నిబంధనను చైనా పార్లమెంటు మార్చింది. ఈ మేరకు 2018లో రాజ్యాంగంలో సవరణ చేశారు. రెండు పర్యాయాల పదవీకాల పరిమితి నుంచి అధ్యక్షుడికి మినహాయింపు కల్పించారు. అంతేగాక 2021లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా ప్లీనరీ సమావేశంలో దేశానికి జీవితకాల అధినేతగా జిన్‌పింగ్‌ను నియమించేందుకు వీలుగా తీర్మానం చేయడం విశేషం.

దేశ రాజకీయాలపై సంపూర్ణ ఆధిపత్యం సాధించడంతో కీలక పదవుల్లో తన వారిని నియమించేందుకు జిన్‌పింగ్ కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా అధ్యక్షుడి తరవాత అత్యంత కీలకమైన ప్రధాని పదవిలో తన మనిషినే కూర్చోబెట్టడం గమనార్హం. తనకు అత్యంత విశ్వాసపాత్రుడైన లీ చియాంగ్ (63)ను నూతన ప్రధానిగా ఎన్నిక చేయించడంలో జిన్‌పింగ్ తెరవెనక చక్రం తిప్పారు. గత పదేళ్లుగా ప్రధాని పదవిలో ఉన్న లీ కచియాంగ్ (67)స్థానంలో లీ చియాంగ్ ఎన్నికయ్యారు. చియాంగ్ పేరును జిన్‌పింగ్ ప్రతిపాదించగా చైనా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్ పీసీ) ఆమోదం తెలిపింది. మొత్తం 2,952 మంది పార్లమెంటు సభ్యులకుగాను 2936 మంది అనుకూలంగా ఓటేశారు. ముగ్గురు చియాంగ్‌కు వ్యతిరేకంగా ఓటేయగా, 8 మంది ఓటింగుకు దూరంగా ఉన్నారు. 2012లో అధ్యక్ష ఎన్నికలో జిన్‌పింగ్‌పై లీ కచియాంగ్ పోటీచేశారు. నాటి ఎన్నికలో జిన్‌పింగ్ తిరుగులేని విజయం సాధించిన సంగతి తెలిసిందే. తరవాతి రోజుల్లో లీ కచియాంగ్ ప్రధానిగా ఎన్నికయ్యారు. పార్టీపై, సైన్యంపై, ప్రభుత్వంపై జిన్‌పింగ్ సంపూర్ణ ఆధిపత్యం సాధించిన నేపథ్యంలో క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలగాలని లీ కచియాంగ్ నిర్ణయించుకున్నారు. దీంతో ఆయన స్థానంలో పూర్తిగా తన మనిషైన లీ చియాంగ్‌ను ప్రధాని పీఠంపై కూర్చోబెట్టారు జిన్‌పింగ్. తద్వారా పార్టీలో తనకు ఎదురు లేకుండా చేసుకున్నారు.

ఇప్పుడు పార్టీపై, సైన్యంపై, దేశ రాజకీయాలపై పట్టు సాధించడం ద్వారా దేశాన్ని అంతర్జాతీయ శక్తిగా మలచాలని జిన్‌పింగ్ తలపోస్తున్నారు. ముఖ్యంగా అమెరికా ఆధిపత్యాన్ని సవాల్ చేయడానికి పావులు కదుపుతున్నారు. వాషింగ్టన్‌ను సవాల్ చేయడమే కాకుండా దానిని వెనక్కునెట్టేయాలని చూస్తున్నారు. తైవాన్ విషయంలో తమ వైఖరికి వ్యతిరేకంగా అమెరికా ముందుకు వెళితే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించే స్థాయికి ఎదిగారు. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారత్ సారథ్యంలోని 'క్వాడ్' కూటమిపైనా కఠిన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇండో-పసిఫిక్‌లో తనను కట్టడి చేయడానికే ఈ కూటమిని ఏర్పాటు చేశారని భావిస్తున్నారు. బెల్ట్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ) ద్వారా వివిధ దేశాలను అనుసంధానం చేసేందుకు, తద్వారా అంతర్జాతీయంగా పట్టు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భారత్ చేరని విషయం గమనార్హం. రష్యా మద్దతుతో ప్రపంచంపై ఆధిపత్యం సాధించాలన్న వ్యూహంతో ముందుకు సాగుతున్నారు జిన్‌పింగ్.

**భారత్‌పై గుర్రు..**

భారత్ విషయంలోనూ జిన్‌పింగ్ గుర్రుగానే ఉన్నారు. వాస్తవాధీన రేఖ వద్ద సరిహద్దు వివాదాన్ని సమసిపోకుండా నిరంతర రావణకాష్టంలా మలచి ఉద్రిక్తతలు కొనసాగించాలన్నది ఆయన వ్యూహంగా దౌత్యవర్గాలు భావిస్తున్నాయి. క్రమంగా అంతర్జాతీయ శక్తిగా భారత్ ఎదగడం, ప్రపంచ వ్యవహారాల్లో భారత్ ప్రభావం, అమెరికాతో సత్సంబంధాలు కొనసాగించడం చైనా అధినేతకు మింగుడు పడని అంశాలే. దక్షిణాసియాలో భారత్ ఇరుగు పొరుగు దేశాలను ఆర్థిక సాయం పేరుతో చేరదీస్తూ వాటిని తమ గుప్పెట్లో పెట్టుకునేందుకు డ్రాగన్ దేశం నిరంతరం ప్రయత్నిస్తోంది. అంతేకాక ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు మోకాలడ్డుతోంది. మండలిలోని అయిదు శాశ్వత సభ్యత్వ దేశాల్లో భారత్ పట్ల అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా సానుకూలంగా ఉన్నాయి. కానీ చైనా వ్యతిరేకిస్తుండటంతో భారత్ కల నెరవేరడం లేదు. అయిదు శాశ్వత సభ్యత్వ దేశాలు అంగీకరిస్తేనే ఏ దేశానికి అయినా మండలిలో శాశ్వత సభ్యత్వం లభిస్తుంది. ఇలా అంతర్జాతీయ వేదికలపై తన కుత్సిత బుద్ధిని చాటుకుంటోంది. ఇరుగు పొరుగు దేశాలతో సాన్నిహిత్యం కాదని ఏ దేశం అంతర్జాతీయ శక్తిగా ఎదగలేదన్న వాస్తవాన్ని డ్రాగన్ గ్రహిస్తే మంచిది. భారత్ ఆషామాషీ దేశం కాదు. అనేక విషయాల్లో తనకు దీటుగా ఉందన్న నిజాన్ని చైనా విస్మరించరాదు.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

**రామాయణం అంటే పురాణం కాదు...'కట్టె, కొట్టె, తెచ్చె' అని సరదాకి చెప్పుకునే మూడు ముక్కల కథ కాదు. భారతీయతకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మహామధుర కావ్యం. దాని నాయకుడు లోకోత్తరపురుషుడు శ్రీరాముడు. మనిషిగా పుట్టి 'మనీషి'గా ఎదిగే క్రమాన్ని చాటిచెప్పిన పురుషోత్తముడు. ఆదికవి వాల్మీకి ఆయనను 'మర్యాద పురుషోత్తముడు' అని కీర్తించారు. అంటే ఆయన ఏనాడూ మానవ మర్యాదలను అతిక్రమించలేదని భావం. భారతీయ సంస్కృతికి , సనాతన ధర్మానికి, నైతిక విలువలకు, నాయకత్వ లక్షణాలకు దర్పణం పట్టే రామచరితం మహాద్భుత సందేశం. భారతీయుల దృష్టిలో రాముడు జగదానందకారకుడు, ఆదర్శ పాలకుడు, ఆదర్శ సోదరుడు, ఆదర్శపతి, ఆదర్శ పురుషుడు... ఒక్కమాటలో భారతీయతే ఆయనగా అవతరించిందని విజ్ఞులు విశ్లేషిస్తారు, విశ్వసిస్తారు. మహా విద్వాంసుల నుంచి జానపదుల వరకు తమ రచనలలో శ్రీరామ వైభవాన్ని ఆవిష్కరించారు. అంతేకాదు, మూలగ్రంథంలోని అంశాలకు మరింత బలం చేకూరేలా రామలీలలను మనోహరంగా వర్ణించే క్రమంలో కథలో ఇమిడిపోయేలా అనేక సంఘటనలను (అవాల్మీకాలు లేదా ప్రక్షిప్త, నిక్షిప్తాలు) తమ రచనలలో చొప్పించారు. రాముడి గుణగణాలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తే పాలకులు- పాలితుల మధ్య సత్సంబంధ బాంధవ్యాలు అవగతమవుతాయి. ఆదికావ్యం రామాయణం వేద స్వరూపం. వేదపఠనం తప్పనిసరనే కార్యక్రమాలలో రామాయణ పఠనం/పారాయణం చేరింది...**

# యుగయుగా

రామాయణం సార్వకాలిక సత్యం. పాలకులు, పాలితులు అనుసరించవలసిన ఎన్నో విశేషాలు ఇందులో ఉన్నాయి. 'వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే/వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాద్రామాయ ణాత్మనా' (వేదాలలో తెలియదగిన పరమాత్మ దశరథ తనయుడిగా అవతరించగా, వేదం వాల్మీకి ద్వారా రామాయణంగా అవతరించింది)అని ఆర్య వాక్కు. రామభక్తి, రామభజన, రామస్మరణ ముక్తిప్రదా లన్నారు తులసీదాసు. అష్టాక్షరీ, పంచాక్షరీ మంత్రాల సంపుటీకరణ రామనామం. అందుకే, యజుర్వేదం రామశబ్దాన్ని దివ్య తారక మంత్రంగా ప్రస్తుతించింది.

రామాయణం ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు మూలస్తంభం. కుటుంబ తీరుతెన్నులు, పెద్దల పట్ల పిన్నలు చూపవలసిన భక్తి భావాలను చాటిచెప్పిన గ్రంథం. ఉదాహరణకు, రాముడికి తాటక వృత్తాంతాన్ని చెప్పిన విశ్వామిత్రుడు దానిని వధించ వలసిందిగా ఆదేశించారు. అయితే అది రామునికి నచ్చలేదని ఆయన ముఖకవళికలను బట్టి అర్థం చేసుకున్నాడు రాజర్షి. అయినా రాముడు...

**'పితుర్వచన నిర్దేశాత్ పితుర్వచన గౌరవాత్ వచనం కౌశిక స్యేతి కర్తవ్య మవిశంకయా'** (స్త్రీ వధ అకృత్యమైనప్పటికీ పెద్దలు ఆదేశించినప్పుడు అలాంటి వాటిని నిశ్శంకంగా ఆచరించవలసిందే) అని మనం గ్రహించవలసి ఉంది.




**ఆదర్శ రాజనీతిజ్ఞత**

సమాజాన్ని రాజ్యాధికారం తృణీకరించ కూడదు, అదే సమయంలో రాజశక్తిని సమాజశక్తిని ధిక్కరించకూడదు. ఈ రెండు శక్తుల సమన్వయంతోనే ప్రజారంజక పాలన సాధ్యం. దానిని ఆచరించి చూపిన ధర్మమూర్తి. పాలకుల నడత, శక్తి సామర్థ్యాలపైనే ప్రజాశ్రేయస్సు ఆధారపడి ఉంటుంది. ఏలిక విద్యా, విజ్ఞానవంతుడైతే చాలదని, ధర్మపరుడు కూడా కావాలని రామాయణం చెబుతోంది. ఇక్ష్వాకపాలకులు, ముఖ్యంగా రాముడు చక్రవర్తిననే దర్పం ప్రదర్శించలేదు. వేదవేద్యుడైనా 'ఆత్మానాం మానుషం మన్యే' అన్నట్లు మానవమాత్రుడిగానే వ్యవహరించారు. ఆయన ధర్మసంస్థాపనార్థం అవతరించినట్లు వాల్మీకి ఎక్కడా పేర్కొనలేదు. అందుకోసం వచ్చాడని జనం అనుకునేలా ఆవిష్కరించారు.

ప్రతి విషయంలో ప్రజాభిప్రాయాన్ని మన్నించేవాడని, విరివిగా పౌర సమావేశాలు ఏర్పాటు చేసి తన మనసులోని మాట చెబుతూ, తన అభిప్రాయాల పట్ల అభ్యంతరాలు ఉంటే నిర్భయంగా వెల్లడించాలని కోరేవాడని రామాయణం చెబుతోంది. జనాభిప్రాయాన్ని సేకరించడమే కాదు దానిని గౌరవించాలనే సత్ సంప్రదాయాన్ని పాదుకొల్పాడు. పామర వాక్యాన్ని మన్నించి సతీపరిత్యాగానికి సిద్ధపడ్డాడు. పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ పాలనా ప్రయోజ నాలు ప్రజలకే చెందాలని లక్షించారు. 'పాలనా వ్యవహారాలలో సహకరించేందుకు మంత్రులు అధికారులకు బాధ్యతలు అప్పగించి, వారి సలహాలు,సూచనలను స్వీకరించేవాడు. ధర్మసంకట పరిస్థితి ఎదురైనప్పుడు పాలనతో సంబంధం ఉన్నవారందరితో సంప్రదించి సమస్యలను అధిగమించేవాడు. జనం రోగ, మృత్యు భయరహితులుగా దీర్ఘాయుష్కులై జీవించేవారు. ఆకలిదప్పులకు, చోర భయానికి తావేలేదు' అని వాల్మీకి రామాయణం 'రామరాజ్యం'ను కళ్ల ముందు సాక్షాత్కరింప చేస్తుంది.

ఎందరో రాజులు ఎన్నో రాజ్యాలు ఏలినప్పటికీ లోకంలో 'రామరాజ్యం' నానుడే యుగయుగాలుగా స్థిరపడిపోయింది. ఏ యుగానికైనా, ఏ జగానికైనా అదే ఆదర్శంగా నిలుస్తోంది.

పదకొండు వేల సంవత్సరాలు పాలన తరువాత అవతార పరిసమాప్తి సమయాన్ని గ్రహించిన రాముడు, తనయులకు పట్టం కట్టే విషయంలో తండ్రి దశరథుడు మార్గాన్నే అవలంబించాడు. సభను సమావేశపరచి, 'నన్ను అనుమతిస్తే లవకుశులకు రాజ్యం అప్పగించి దేహత్యాగం చేస్తాను' అని పౌరులను అర్థించాడు. వాస్తవానికి 'వారసత్వ' సంప్రదాయంలో అలాంటి లాంఛన ప్రక్రియలు అవసరం లేదు. కానీ ధర్మమూర్తి నడవడి అది. ఆధునిక రాజకీయ,

పాలనా వ్యవస్థలను చూస్తున్న వారికి అవన్నీ కథలుగానూ, వింతగానూ అనిపించవచ్చు.

'జ్ఞానమార్గంలో ఎదురయ్యే విఘ్నాలను అధిగమించ గలగాలి. ఎవరి నుంచి ఏమీ ఆశించవద్దు. ఎవరికీ భయపడవద్దు. ఎవరితోనూ అనవసర శత్రుత్వం వద్దు. మౌనాన్ని పాటిస్తే కలహాలకు ఆస్కారమే ఉండదు. అలాంటి వారికి అంతటా సుఖమే..' అని రామహితోక్తులని తులసీదాసు (రామ్‌చరిత్ మానస్) వర్ణించారు.

**సర్వ సుగుణమూర్తి**

కొందరిలో కొన్ని సుగుణాలే ఉండవచ్చు. కానీ రాముడు సర్వగుణ సమున్నతుడు. ఓరిమి, క్షమ, స్నేహం, సమత, స్థితప్రజ్ఞత, సత్యం, ధర్మం, దయ, వినయం, ఔదార్యం, అభిమానం, సమభావన, సమష్టి కృషి... ఇలా ఎన్నో సుగుణాల కలబోత కౌసల్యా సంజాతుడు. ఈ లక్షణాలకు దర్పణం పట్టే రామాయణం అపురూప వ్యక్తిత్వ గ్రంథం.



# ల ఆదర్శమూర్తి జానకీపతి

**ఓరిమి:** కష్టసుఖాలు, కోపతాపాలు, హానికర పరిస్థితులు. ఇలా అన్ని సందర్భాలలో చిరునవ్వుతో శాంతంగానే ఉన్నాడు. రావణుని చెరలోని సహధర్మ చారిణిని తిరిగి పొందేందుకు ఏళ్ల తరబడి నిరీక్షించాడు. ఒక్కొక్కసారి లక్ష్యం చేరడానికి సమయం పట్టవచ్చని, అందుకు ఓర్పు అవసరమనే సందేశం అందులో దాగుంది.

**క్షమ/స్నేహం:** పగవాడి తమ్ముడు 'శరణు'అనగానే అభయం ఇచ్చాడు. వైరిలో ఉన్నతిని గుర్తించాడు. మైత్రి కోరిన వారిని అక్కున చేర్చుకున్నాడు. శత్రువు నుంచి కూడా నేర్వదగినది ఎంతో ఉంటుందని ఎరిగిన విజ్ఞుడు.

**సమత:** కులగురువు వశిష్ఠ మహర్షి, మహా తపసంపన్నులైన విశ్వామిత్రాది మహర్షుల నుంచి పడవ నడిపే పామరుడు గుహుడు, గిరిజన మహిళ శబరి, జటాయువు పక్షి వరకూ సర్వులు ఆయనకు సమానులే.

**కృతజ్ఞత :** ఇతరుల నుంచి వంద అపకారాలు ఎదురైనా పట్టించుకోని శ్రీరాముడు, ఎవరి వల్ల ఏ చిన్న ఉపకారం పొందినా ఎంతో కృతజ్ఞత చాటేవాడట. లంకలోని సీతామాత జాడ తెలిపిన హనుమతో 'నీవు నాకు గొప్ప మేలు చేశావు. నీ సహాయానికి ఏ విధంగా ప్రత్యుప కారం చేయగలను? అయినా నా సర్వస్వం అనదగిన గాఢాలింగనాన్ని స్వీకరించు' ('ఏష సర్వస్వభూతో మే పరిష్వంగో హనూమత:...) అంటూ హనుమను ఆలింగనం చేసుకున్నాడు. తన ప్రాణం కంటే సీతే ముఖ్యం' అనుకునే సీతావల్లభుడు, ఆ సందర్భంలో 'సీత కంటే ఆమె జాడ గురించి ప్రయత్నించిన సుగ్రీవుడు, అచూకి తెలిపిన హనుమ ముఖ్యులు' అంటాడు. స్నేహ ధర్మానికి, కృతజ్ఞతకు ఆయన ఇచ్చిన విలువ అది.

**సత్యం/ధర్మం:** ఎంతటి కఠిన పరిస్థితులు ఎదురైనా ధర్మం వీడలేదు. తల్లి కైకేయి అత్యాశవల్ల తనకు సంక్రమించిన రాజ్యాధికారాన్ని తిరిగి అప్పగించేందుకు అడవికి వచ్చిన తమ్ముడు భరతుడికి 'తల్లిని దూషించకూడదు. తల్లిదండ్రుల ఆజ్ఞ శిరోధార్యం. వారి ఆజ్ఞానుసారం నేను పద్నాలుగేళ్ల వనవాసం చేయాలి, నీవు రాజ్యపాలన చేయాలి' అని హితవు పలికాడు. తన వనవాసానికి పినతల్లి కారణమని నిందించ లేదు. పితృవాక్య, పితృధర్మ పాలనకు అవకాశంగానే భావించాడు.

**స్థితప్రజ్ఞత:** పట్టాభిషేక ప్రతిపాదనను, వనవాస ఆదేశాన్ని స్థిరచిత్తంతో సమంగా పాటించాడు.

**దయ:** రామచంద్రుడు జీవితంలో ఏ ప్రాణిని అవమానించి ఎరుగడని, ఎవరినీ తూలనాడిన సందర్భం లేదని వాల్మీకి మౌని వర్ణించారు.

**వినయం:** ఆయన దైవాంశసంభూతుడు. బహుబలశాలి రావణుడు సహా అనేక మంది అసురులను పరిమార్చిన శక్తిశాలి. అయినా తానే గొప్పని విర్రవీగలేదు. తాను ఎంత పరాక్రమశాలి అయినా పెద్దచిన్న తేడాలేకుండా సమభావంతో మెలిగాడు. తాను సాక్షాత్తు చక్రవర్తే అయినా చిన్నవారిని కూడా తానే ముందుగా పలకరించే వాడట (పూర్వ భాషీచ రాఘవ). శత్రువులోని ఉన్నతిని మెచ్చే తత్త్వం.

**సమష్టి కృషి:** సమష్టి కృషి, విజయాలకు నిలువెత్తు నిదర్శనం. వారధి నిర్మాణానికి, రావణ సంహారానికి అందరితో చేయిచేయి కలిపి నడిచాడు. సముద్రుడి గర్వం అణచినవాడు, తన శక్తి సామర్థ్యాలతో సేతువును నిర్మించలేడా? అందుకు కపివీరుల నుంచి ఉడుత వరకు సాయం అవసరమా? అని ప్రశ్నించుకుంటే, దాని వెనుక గల 'సమష్టి కృషితో విజయం సాధ్యం' అనే సత్యాన్ని గ్రహించ గలుగుతాం.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

**నవమి విశిష్టత**

అన్ని పండుగలలో శ్రీరామనవమి విలక్షణ మైనది. ఏ దేవీదేవతలకైనా వారివారి అవిర్భావ దినాలలో జన్మ మహోత్సవాలను జరుపుకోవడం సమజం. కాని రాముడు పుట్టిన రోజు (చైత్ర శుక్ల నవమి)న కూడా కల్యాణం నిర్వహించడమే ఆ ప్రత్యేకత. వాల్మీకి మహర్షి తమ శ్రీమద్రామా యణం 18వ సర్గలో రామజనన వర్ణనతో పాటు ఆయన కల్యాణాన్ని ప్రస్తావించారు. పరమాత్మ జన్మతిథి నాడే కల్యాణోత్సవం నిర్వహించాలని బృహస్పతి సంహిత పేర్కొంటోంది.

సీతాన్వేషణ సమయంలో ఆమె ఆచూకి తెలియక హనుమ 'నమోస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యైచ తస్యై జనకాత్మజాయై/నమోస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో నమోస్తు చన్ద్రార్క మరుద్గణేభ్యః' అని ప్రార్థించిన మీదట అమ్మవారి ఆచూకీ తెలిసిందట. కనుక వారిద్దరిని వేర్వేరుగా ఊహించక ఉభయులను

కలిపి అర్చించడం సంప్రదాయంగా వస్తోందని పెద్దలు చెబుతారు. వారు భౌతికంగా వేరైనా ఏక లక్షణమూర్తులు/స్వరూపులు కనుక వారిని విడివిడిగా అర్చించరు. నవమి తిథి రామ జయంతి అయినా కల్యాణం నిర్వహిస్తారు.

**తెలుగనేలపై సీతాపతి**

శ్రీరాముడు అవతరించింది ఉత్తర భారతదేశం లోని అయోధ్యలో అయినా, తెలుగువారు ఆయనను సొంతం చేసుకున్నారు. 'పది కొంపలును లేని పల్లెనైనను రామమందిరముండు ఒరలు గాత' అని పెద్దలు పలికారు. ఆయన జీవితంలోనే ప్రధాన ఘట్టంగా చెప్పుకునే పద్నాలుగేళ్ల వనవాసం సమయం అత్యధికంగా తెలుగునేల (దండకారణ్యం) మీదనే సాగింది.

కల్యాణోత్సవ నిర్వహణలో ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రాంతాల మధ్య స్వల్ప తేడాలను పేర్కొంటున్నారు. రాముడు ఉత్తరాదిన జన్మించాడు కనుక అక్కడి వారు నవమినాడు జన్మదిన వేడుకలకు ప్రాధాన్యం ఇస్తారని, కల్యాణం తరువాత దక్షిణా పథానికి వచ్చినందున ఈ ప్రాంతీయులు జయంతితో పాటు


ఒంటిమిట్ట

కల్యాణోత్సవాన్నీ నిర్వహిస్తున్నారనీ చెబుతారు.

**అదిగో భద్రాద్రి...**

మాధవుడు మానవుడిగా అవతరించి, మానవీయతతో మనుగడ సాగించి భక్తకోటిని అనుగ్రహించేందుకు దక్షిణ అయోధ్యగా మన్ననలు అందుకుంటున్న భద్రగిరిపై అర్చామూర్తిగా ఆవిర్భవించాడని బ్రహ్మాండపురాణం పేర్కొంటోంది. మేరు పర్వత రాజు దంపతుల పుత్రుడు భద్రుడి తపస్సుకు మెచ్చి కొలువుదీరిన రాముడికి దేవర్షి నారదుడు తొలి ఆరాధన చేసినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. 16వ శతాబ్దంలో పోకల దమ్మక్క సీతారాముల విగ్రహాలకు తాటాకు పందిరి వేసి, తాటి పండు నైవేద్యంగా అందించింది. ఆమె ఇచ్చిన సమాచారంపై అప్పటి ఆ ప్రాంత (హసనాబాద్- పాల్వంచ) తహసీల్దార్ కంచర్ల గోపన్న ఆలయాన్ని నిర్మించి రామదాసుగా కీర్తికెక్కారు. భద్రాచలంలో చైత్ర శుద్ధ నవమి నాటి సీతారాముల పరిణయం జగత్కల్యాణంగా భాసిల్లుతోంది. కల్యాణోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తుంది.

**ఒంటిమిట్టలో మొండైన దేవుడు**

ఉమ్మడి కడప జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీకోదండ రాముడు రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా పూజలందుకుంటున్నాడు. రాష్ట్ర విభజన తర్వాత అక్కడ కల్యాణోత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోంది. చైత్ర శుద్ధ నవమి నాడు ఉత్సవాలు మొదలవుతాయి. చతుర్దశి నాడు స్వామి వారికి కల్యాణోత్సం, ఆ మరునాడు రథోత్సవం నిర్వహిస్తారు. పుష్పయాగంతో ఈ ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. జాంబవంతుడు తపస్సు చేసిన తిప్పకు ఎదురుగా ఉన్న 'మిట్ట'పై నుంచి శ్రీరాముడు దర్శనమిచ్చాడని, అదే నేటి కోదండ రామాలయమని, రామచంద్రుడు వనవాస సమయంలో కొంతకాలం ఈ ప్రాంతంలో నివసించారని స్థలపురాణం. 14వ శతాబ్దంలో బుక్కరాయల సోదరుడు కంపరాయలు ఈ ఆలయ నిర్మాణానికి పూనుకొని ఒంటడు, మిట్టడు అనే బోయనాయకులకు ఆ బాధ్యతలు అప్పగించారని చరిత్ర చెబుతోంది. రామ జయంతితో పాటు పోతన జయంతి నిర్వహించడం ఇక్కడ మరో ప్రత్యేకత. ★



# శరవేగంగా..

కొన్ని శతాబ్దాల ధార్మిక, న్యాయ, సాంస్కృతిక పోరాటం తరువాత అయోధ్యలో నవ్యమైన భవ్యమైన రామమందిరం నిర్మించుకునే మహదవకాశం హిందువులకు దక్కింది. అందుకు తగ్గట్టే సరయూ తీరాన ప్రపంచ హిందువుల ఆకాంక్ష మేరకు మహా నిర్మాణం జరుగుతున్నది. వచ్చే జనవరిలోనే భక్తకోటి కోసం సిద్ధం కానున్న ఈ మందిర నిర్మాణం ఏ దశలో ఉన్నదో చెప్పే కొన్ని చిత్రాలను రామజన్మ భూమి తీర్థక్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ విడుదల చేశారు. బాలరాముని ప్రతిష్ట కూడా వచ్చే జనవరిలోనే జరుగుతుందని కూడా ట్రస్ట్ సభ్యులు ఇప్పటికే చెప్పారు. గుడి నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతూ, దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. 2020 ఆగస్ట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. నేల మీద పరచడానికి భరత్‌పూర్ (రాజస్థాన్) దగ్గరి బన్సి ఫహద్‌పూర్ నుంచి 17,000 గ్రానైట్ రాళ్లు అయోధ్య వచ్చాయి. రకరకాల పనుల కోసం రోజూ రాజస్థాన్ నుంచి 80 నుంచి 100 రాళ్లు అయోధ్యకు చేరుస్తున్నారు. ఈ రాయి బరువు ఒక్కొక్కటి 2.50 టన్నులు. నిర్మాణం జరుగుతున్న ప్రదేశం దగ్గర అత్యాధునిక రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 2.7 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్న ఈ ఆలయం పొడవు 160 అడుగులకు చేరవచ్చునని అంచనా. కాబట్టి మూడంతస్తులలో నిర్మించిన హిందూ దేవాలయాలలో ఇదే ఎత్తయిన ఆలయం అవుతుంది. మిగిలిన ప్రాంగణంలో కూడా రకరకాల దేవీదేవతలకు ఆలయాలు నిర్మిస్తారు.



# మాధవ సేవాసమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు





**కరినగర్ :** కరినగర్ – మాధవసేవాసమితి ఆధ్వర్యంలో మార్చి 6న జరిగిన ఒక కార్యక్రమంలో సప్తగిరి ఉన్నత పాఠశాల, శ్రీ విద్యాభారతి ఉన్నత పాఠశాలలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు చిలుకూరి బాలాజీ దేవాలయ అర్చకులు శ్రీ సురేష్ మహారాజ్ పెన్‌సెట్, ప్యాడ్ అందించారు. మార్చి 8న రాంపూర్ సేవాబస్తిలో దంత వైద్య నిపుణుడు డా॥ తొవ్వేటి కార్తీక్ సహాయంతో ఉచిత వైద్య శిబిరం జరిగింది.

పిల్లల దంతాలు ఆరోగ్యంగా ఉన్నప్పటికీ, పెద్దలు సరియైన శ్రద్ధ పాటించని కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు.ముందు జాగ్రత్త కోసం సలహాలు ఇచ్చారు. బస్తీలోని బాలబాలికలతో సహ అందరికీ వైద్యసహాయం అందించారు. పై రెండు కార్యక్రమాలలో మాధవ సేవాసమితి సహ కార్యదర్శి కామారపు ప్రసాద్, విభాగ్ సంఘచాలక్ మల్లొజుల కిషన్‌రావు, విభాగ్ సహ వ్యవస్థా ప్రముఖ్ దావులూరి మురళీధర్ పాల్గొన్నారు. రాంపూర్ సేవాబస్తీ కార్యక్రమంలో మాధవసేవాసమితి కార్యవర్గ సభ్యులు నగునూరి చంద్రశేఖర్, కరినగర్ జిల్లా ప్రచారక్ అమరనేని సందీప్ హాజరయ్యారు. ఇంకా జిల్లా ట్రస్ట్ సభ్యులు సదాశివారెడ్డి, జిల్లా ధర్మ జాగరణ ప్రముఖ్ సూర్యభాను, పాఠశాల ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు. ★

# కరినగర్‌లో పోస్టల్ సిబ్బందికి సన్మానం





కరినగర్ మాధవసేవాసమితి, జాగృతి తెలుగు వారపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో పోస్టల్ సిబ్బంది చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఉగాదిని పురస్కరించుకొని మార్చి 18న కరినగర్‌లోని పోస్టాఫీస్ భవనంలో వారికి సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పోస్ట్‌మాస్టర్ రెహమాన్ మాట్లాడుతూ పోస్టల్ సిబ్బందిని జాగృతి ఆధ్వర్యంలో సన్మానించడం సంతోషదాయకంగా ఉందన్నారు. అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ (మెయిల్స్ విభాగం) పటేల్ కృష్ణారెడ్డి, మాధవ సేవాసమితి అధ్యక్షులు ఎల్లంకి హనుమంతరావు, సహ కార్యదర్శి కామారపు ప్రసాద్, ప్రముఖ నేత్రవైద్యులు చక్రవర్తుల రమణాచార్యులు, ప్రముఖ వ్యాపారవేత్త ఎలగందుల సత్యనారాయణ, దావులూరి మురళీధర్, బాలరాజు, మహేశ్వర్, సదాశివ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు కూడా పాల్గొన్నారు. ★





**గుంటూరు :** మంగళగిరి ఖండ సాంఘిక్ మార్చి 19న జరిగింది. ముఖ్య అతిథిగా సివిల్ సర్జన్ డా. ఓంకార శివరాంబాబు, ప్రధానవక్తగా జిల్లా సంఘచాలక్ నాగార్జున, వోలేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

రోపుయిలియాని.. ఈమె ఎవరో తెలుసా? పోనీ ఈ పేరును ఎప్పుడైనా విన్నారా? లేదు. ఆమె మనకు తెలియదు. ఆమె పేరు మనం ఎప్పుడూ, ఎక్కడా విని ఉండకపోవచ్చు. నిజమే. ఒక్క రోపుయిలి యానినే కాదు, భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో వీరోచిత పాత్రను పోషించిన ఎందరో వీరవనితల చరిత్రకు దురదృష్టవశాత్తు చరిత్ర పుటల్లో స్థానం లభించలేదు. చరిత్ర మరిచిపోయినా, చరిత్రకారులు విస్మరించినా ఆమె మిజోరాం చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిన ఒక వీరవనిత. స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ పాలకులను ఎదిరించి నిలిచిన వీరనారి. భర్త వందలా మరణం తర్వాత, వృద్ధాప్యాన్ని సైతం లెక్క చేయకుండా, ఆయన బాటలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించిన ధైర్యశాలి రోపుయిలియాని.



# వీరవనిత రోపుయిలియాని

ఈశాన్య భారతం అంటే అక్కడి ప్రకృతి అందాలు, సంస్కృతీ సాంప్రదాయ సోయగాలు మాత్రమే మనకు గుర్తుకు వస్తాయి. అవును మరి! ఈశాన్య భారతం ప్రకృతి అందాలకు నిలయం. అందులో మిజోరాం ప్రాంతం మరింత సుందర ప్రదేశం. అంతేకాదు, ఈ ప్రాంతం ఎందరో వీరవనితలకు పుట్టినిల్లు కూడా. స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో త్యాగాలు చేసిన త్యాగధనులను కన్న పవిత్రభూమి ఈశాన్య భారతం. ఎందరో పుణ్యమూర్తుల పాదస్పర్శతో పునీతమైన పుణ్యభూమి ఇది. అయితే, స్వాతంత్ర్యానంతరం చరిత్రకారులు ఈశాన్య భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రను, ముఖ్యంగా మిజోవీరుల వీరోచిత పోరాటాలను, వారు చేసిన అద్వితీయ త్యాగాలను విస్మరించారు. అలా విస్మరించిన వారిలో దక్షిణ మిజో ప్రాంతం డెన్లంగ్ తెగకు చెందిన ముఖ్యనాయకురాలు, ఆ ప్రాంతాన్ని పాలించిన తొలి మహిళా నాయకురాలు రోపుయిలియాని.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ చేపట్టిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు స్వరాజ్య సంగ్రామంలో పాల్గొన్న వీరులు, వీరవనితల గురించి, వారి ధైర్యం, తెగువ, దేశభక్తిని స్మరించుకుంటూ భావితరాలకు తెలియచేసేందుకు సాగించిన స్మృతియాత్రతో రోపుయిలియాని వీరగాథ వెలుగులోకి వచ్చింది.

రోపుయిలియాని ఉత్తర మిజో నాయకుడు లాల్సావుంగా కుమార్తె. ఈమె 1828లో జన్మించారు. దక్షిణ లుషాయ్ పర్వత ప్రాంత నాయకుడైన వందలాను వివాహం చేసుకున్నారు. 19వ శతాబ్దం చివరి నాటికి మిజో ప్రాంతంలో బ్రిటిష్ పాలకుల గుడారాలు వెలిశాయి. స్థావరాలుగా ఎదుగుతూ వచ్చాయి. పరాయి పాలకుల అరాచకాలు మొదలయ్యాయి. ప్రజలు ఆ బాధలు భరిస్తూ వచ్చారు. బ్రిటిష్ వారి టీ తోటల సమీపంలో మిజో ప్రజల ఆవాసాలు ఉన్న నేపథ్యంలో తరచూ బ్రిటిష్ వ్యాపారులు వాణిజ్య ప్రయోజనాల కోసం మిజో ప్రజల్లో విభేధాల అగ్గి రాజేశారు. మిజో ప్రజలు టీ తోటలలో కూలీలుగా పని చేయాలని బ్రిటిష్ పాలకులు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. 1890 నాటికి బ్రిటిష్‌వారు కొన్ని మిజో పాలక సంస్థానాలు, ప్రాంతాల మీద ఆధిపత్యాన్ని పెంచుకోగలిగారు. అయినా, స్వాభిమానం గల మిజో ముఖ్యులు కొందరు, బ్రిటిష్ పాలకుల అధికారాన్ని అంగీకరించలేదు. వారిలో రోపుయిలియాని భర్త వందలా ఒకరు. బ్రిటిష్ ఆధిపత్యాన్ని ఆయన ససేమిరా అంగీకరించలేదు. బ్రిటిష్ పాలకులు ఆయన్ని ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేశారు. అయినా ఆయన పరాయి పాలకుల ప్రలోభాలకు లొంగలేదు సరి కదా, ప్రజాబలంతో

బ్రిటిష్ పాలకులకు కంటి మీద కునుకు లేకుండా చేశారు.

బ్రిటిష్ పాలకుల ఆగడాలు మితిమీరుతున్న దశలో దురదృష్టవశాత్తు వందలా మరణించారు. ఆయన మరణం తర్వాత రోపుయిలియాని పాలనా పగ్గాలు చేపట్టారు. ఆమె సొంత గ్రామమైన రాల్వ్యాంగ్ నుంచి లుషాయ్ ప్రాంత పాలన సాగించారు. ఆమె తండ్రి, భర్తల నుంచి అలవరుచుకున్న రాజనీతితో పరిపాలన సాగించారు. అదే సమయంలో లుషాయ్ ప్రాంతంలో బ్రిటిష్ పాలకుల ప్రభావం పెరుగుతున్న వాస్తవాన్ని ఆమె గుర్తించారు. అలాగే, బ్రిటిష్ పాలకుల పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందనే సత్యాన్ని కూడా ఆమె గ్రహించారు. అప్పటికే బ్రిటిష్ పాలకులు ఆమెను శత్రువుగా ప్రకటించారు. బ్రిటిషర్ల విరోధుల జాబితాలో ఆమె పేరు ప్రముఖంగా చేరింది. మిజోకు చెందిన కొందరు స్థానిక పాలకులు, ప్రముఖులు బ్రిటిష్ పాలకులకు తలొగ్గారు. వారితో చేతులు కలిపారు. అయితే రోపుయిలియాని మాత్రం వారికి కొరకరాని కొయ్యగా తయారయ్యారు. బ్రిటిష్ పాలకుల ఆజ్ఞలను ధిక్కరించారు. అంతేకాదు, ప్రజలకు ధిక్కారాన్ని భోధించారు. 'బ్రిటిష్ పాలకులకు పన్నులు చెల్లించకండి. పరాయి పాలకుల ఆధిపత్యాన్ని అంగీకరించకండి. బ్రిటిష్‌వారి టీ తోటల్లో పని చేయకండి' అంటూ ప్రజలకు దిశానిర్దేశం చేస్తూ వచ్చారు. అంతేకాదు, బ్రిటిష్ వారి అధికారాన్ని ఆమె సవాలు చేశారు. 'మేం, మా ప్రాంత ప్రజలు మీకు పన్నులు చెల్లించడం జరగదు. ఈ ప్రాంత ప్రజలు మీ ఆదేశాలకు తలొగ్గే ప్రశ్నే ఉద్భవించదు. మీరు చెప్పిన పనులు చేయరు. ఎందుకంటే మేమే ఈ భూమికి యజమానులం' అని ఆమె సగర్వంగా ప్రకటించారు. ఒకవిధంగా ఆమె దృఢ సంకల్పానికి బ్రిటిష్ అధికారులు తలొగ్గారు. పన్నులు వసూలు చేయడానికి వెనుకాడారు. బలవంతంగా ప్రజలచేత పని చేయించే సాహసం చేయలేకపోయారు. తమ ప్రజలను, పవిత్ర భూమిని రక్షించడం తన కర్తవ్యమని ఆమె త్రికరణశుద్ధిగా నమ్మారు. అంతేకాదు, ఆయుధాలను, తుపాకులను ప్రభుత్వానికి అప్పగించాలనే బ్రిటిష్ పాలకుల ఆదేశాలను సైతం ధిక్కరించడమే కాదు. మరిన్ని ఆయుధాలను సేకరించాలని తన కుమారుడు సహా, పౌరులందరికీ ఆమె పిలుపునిచ్చారు. ప్రజా పోరాటానికి దిశానిర్దేశం చేశారు. బ్రిటిష్ వారితో చేతులు కలిపిన వారిని ఉద్దేశించి 'మీరందరూ లొంగిపోయినా, ఉత్తర మిజో పాలకుడు లాల్సావుంగా కుమార్తె పరాయి పాలకుల ఎదుట తలొంచదు' అని ధైర్యంగా నిలబడ్డారు. అందుకే తర్వాతి కాలంలో ఆమె సాహసాన్ని ఆదర్శంగా తీసుకుని ఇతర మిజో సంస్థానాలు సైతం బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా తమ గళాన్ని వినిపించాయి.



రోపుయిలియాని సాహస చరిత్ర, ఆమె అందించిన స్ఫూర్తి ఒక్క మిజోరాంకు లేదా ఈశాన్య భారతానికి మాత్రమే పరిమితం కాదు. భారతీయులందరికీ ఆమె ప్రాతః స్మరణీయురాలు. ఒక్క రోపుయిలియాని మాత్రమే కాదు, బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా లుషాయ్ పర్వతానికి చెందిన ఎంతోమంది వీరవనితలు పోరాడారు. దురదృష్టవశాత్తు వారి గాథలు జానపద కథల్లో మినహాయించి చరిత్రపుటల్లో ఎక్కడా నమోదు కాలేదు.

ఆమె ప్రతిఘటనతో ఆగ్రహించిన బ్రిటిష్ పాలకులు ఆమెపై కత్తి కట్టారు. అదే సమయంలో ప్రజల్ని బానిసలుగా మార్చేందుకు బ్రిటిష్ పాలకులు చేస్తున్న కుట్రలను గ్రహించిన ఇతర స్థానిక ప్రముఖులు సైతం రోపుయిలియాని బాటలో తిరుగుబాటు జెండాను ఎగరేశారు. దీంతో ఆగ్రహించిన బ్రిటిషర్లు దీనంతటికీ రోపుయిలియాని, ఆమె కుమారుడు లాల్తువామాలే కారణమని 1893లో రోపుయిలియాని గ్రామం మీద దాడి చేశారు. తెల్లవారు జామున జరిపిన దాడిలో ఆమెను, ఆమె కుమారుణ్ణి అరెస్టు చేశారు. వయోధికురాలైన ఆమెను చిట్టగాంగ్ కొండ ప్రాంతాలలో ఉన్న రంగమతికి పంపారు. చిట్టగాంగ్ జైలులో దాదాపు రెండు సంవత్సరాలు బందీగా ఉంచారు. 1895లో జైలులోనే ఆమె కన్ను మూశారు.

నిజానికి రోపుయిలియాని సాహస చరిత్ర, ఆమె అందించిన స్ఫూర్తి ఒక్క మిజోరాంకు లేదా ఈశాన్య భారతానికి మాత్రమే పరిమితం కాదు. భారతీయులందరికీ ఆమె ప్రాతః స్మరణీయురాలు. ఒక్క రోపుయిలియాని మాత్రమే కాదు, బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా లుషాయ్ పర్వతానికి చెందిన ఎంతోమంది వీరవనితలు పోరాడారు. దురదృష్టవశాత్తు వారి గాథలు జానపద కథల్లో మినహాయించి చరిత్రపుటల్లో ఎక్కడా నమోదు కాలేదు. ఇలాంటి వీరుల గాథలను మన చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా 75 వసంతాల స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' జరుపుకుంటున్న వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్లుగా స్వాతంత్ర్యం కోసం ప్రాణార్పణ చేసిన వీరులు, వారు చేసిన పోరాటాలను గుర్తుచేసుకునే సమయమిది.

'మై ఇండియా, మై గ్లోరి' నుంచి

అను : రాజనాల బాలకృష్ణ






# ఊపిరి కన్నా ఉద్య

**‘మనం బతకడానికి కాదు గదా ఈ ఉద్యమంలో దూకింది? ఇంటికి వెళ్లే ఆశలేనప్పుడు మరణమే శరణ్యం. పదిమందితో చావు పెళ్లిలాంటిది. ఒకవేళ నిరంకుశ నిజాం చేతిలో చావు రాసిపెడితే అది భరతమాత పాదాలకు మన రక్త పద్మాలతో పూజ’ అన్నారు దాశరథి కృష్ణమాచారి. మరణం కళ్లెదుటే ఉందని తెలిసినా, తోటి ఖైదీ మిత్రులకు సరస పద్యాలు చెప్పి ఉల్లాసాన్ని పంచిన భావుకుడు. ఊపిరి కన్నా ఉద్యమం మిన్న అని రక్తం ధారబోసిన కలంయోధుడు.**

దాశరథి కృష్ణమాచారి వరంగల్లు జిల్లా (ఇప్పుడు ఖమ్మం జిల్లా) మహబూబాబాదు (మానుకోట) తాలూకా, గూడూరు గ్రామంలో 1925 జూలై 25న పుట్టారు. ఈయనకో తమ్ముడు దాశరథి రంగాచారి. (జీవనయానం పేరుతో జీవితచరిత్ర రాశారు) (కృష్ణమాచారి యాత్రాస్మృతి పేరుతో జీవిత చరిత్రను రాశారు). నిజాం నిరంకుశ రాజ్యంలో ఆ నిజాంకు ఆశ్రితుడుగా వున్న ఒక జమీందార్ గ్రామం, గూడూరులో శ్రీవైష్ణవ కుటుంబం వారిది. తండ్రి సంస్కృతాభిమాని. కృష్ణమాచారికి సంస్కృతం అంటే ఇష్టమే కాని, ఆ భాషలోనే మాట్లాడాలన్న తండ్రి ఛాందసం నచ్చేది కాదట. ఇక మదర్సాలో ఉర్దూ ప్రార్థనతో దినచర్య ప్రారంభమయ్యేది. అది కూడా ఈయనకు నచ్చేది కాదు. కాని గొంతు కలపక



**కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

పోతే హెడ్ మాస్టర్ కొట్టేవారు. ఇలా తిరుగుబాటు బీజాలు నాటుకున్నాయి అంటారు కృష్ణమాచారి. ఈయనకు చూడామణి అనే ఓ అందమైన ఊహా సుందరి ఉండేది.

నిజాం వ్యతిరేక పోరాటంలో ప్రముఖ పాత్ర వహించి కొన్నిసార్లు తప్పించుకున్నా, చివరకు నిజాం పోలీసులకు చిక్కారు. వరంగల్లు, నిజామాబాద్, హైదరాబాదు (చంచల్‌గూడ) జైళ్లలో పోలీసులు రజాకార్ల చేతుల్లో చాలా కష్టాలు పడ్డారు, వాటిలో కొన్ని వింత సంఘటనలు జరిగాయి.

కృష్ణమాచారిని బంధించి మొదట వరంగల్ జైలుకు తీసుకువెళ్లారు. అక్కడ అప్పటికే వట్టికోట ఆళ్వార్ స్వామి జైల్లో ఉన్నాడు. వారికి పళ్లు తోముకోవడానికి మసిబొగ్గు ఇచ్చేవారు. జైలు గోడ మీద ఆ బొగ్గుతో

*“ఓ నిజాము పిశాచమా! కానరాదు*
*నిన్ను బోలిన రాజు మా కెన్నడేని*
*తీగెలను తెంపి అగ్నిలో దింపినావు*
*నా తెలంగాణ, కోటి రతనాల వీణ”*

అని గోడమీద రాస్తే ఆ పద్యాన్ని కంఠస్థం చేసిన వట్టికోట ఆళ్వారుస్వామి, ఒక గోడపై అధికారులు చెరిపేస్తే మరో చోట రాసేవాడని ‘అగ్నిధార’ ముందు మాటలో దాశరథి పేర్కొన్నారు.

రాజకీయ ఖైదీలను 30 మందిని తమతమ వస్తువులను సర్దుకుని అర్ధ గంటలో సిద్ధం కావలసిందిగా జైలు అధికారులు ఆజ్ఞాపించారు. తాము విడుదవులవుతున్నామని కొందరు మురిసిపోయారు. కాని ఈ నాజీ నైజాం వీరి ప్రాణాలు తీయకుండా వదలదని అందరికి తెల్సు. అంతకు ముందే కాళోజీ నారాయణరావు, వట్టికోట ఆళ్వారుస్వామి సహా మరికొంత మందిని వరంగల్ సెంట్రల్ జైలు నుండి అజ్ఞాత ప్రదేశాలకు మార్చారని జైలు డాక్టర్ ద్వారా తెలిసింది. చంపేయడానికి తీసుకు వెళ్లారనే వార్త కూడా వ్యాపించింది. కాని ఎవరూ నమ్మలేదు కారణం వాళ్లను చంపితే కొంచెం ఆలస్యంగా రావలసిన తిరుగుబాటు ఇంకా త్వరగా వస్తుంది. వాళ్లు కేవలం కవులు, రచయితలే కాదు, స్వాతంత్ర్య సమరయోధులు కావడతో వారంటే ప్రజలకు గొప్ప ఆదరాభిమానాలున్నాయి. రాత్రి పది గంటలకి జైలు బయట వున్న రెండు పోలీసు వ్యానుల్లోకి వారిని ఎక్కించారు. అది డిసెంబర్ 1947 హేమంతరుతువు. జైలు లోపలి గాలి కంటే బయట స్వేచ్ఛావాయువులు వారికి చైతన్యాన్నిచ్చాయి.

కృష్ణమాచారి ‘చలిగాలి’ అనే పదంతో ప్రారంభమయ్యే కంద పద్యం చెప్పడం ప్రారంభించాడు. నిజానికి అది విడుదల కాదు మరో జైలుకు మార్చడం. జైలు మిత్రుడు గెల్లా కేశవరావునుద్దేశించి 27 పద్యాలు చెప్పారు దాశరథి.

*“చలిగాలి పలుకు వార్తలు*
*చెలిగాలిని బోలి వలపు చిరు వెచ్చదన*
*మ్ములు గుండెలలో నింపెను*
*చెలికాడా! జైలు బయట చిత్రమ్ములరెన్”*

పద్యాలు అయితే చెప్పాడు కాని కలంలేదు, కాగితం లేదు, దీపం లేదు, కాని గళం వుంది, కాబట్టి మనిషికో పద్యం గుర్తు పెట్టుకోవాలన్నారు. అలాగే చేశారు వారి వెంట 60 మంది సశస్త్ర రక్షకభటులు ఉక్కుటోపీలతో వ్యానులో ఎక్కారు. వీళ్లు మనని ఈ రాత్రి ఏ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్ళి, నాజీలు యూదులను కాల్చినట్లు కాల్చి పారేస్తారు, సందేహం లేదు” అన్నాడు జంగారెడ్డి, “జంగారెడ్డి! మనం బతకడానికి కాదు గదా ఈ ఉద్యమంలో దూకింది? నీకు ఇంటికి వెళ్లే ఆశలేదు కదా? అయినప్పుడు చద్దాం! భరతమాత పాదాలకు మన రక్త పద్మాలతో ఈ రాత్రి పూజ. భయపడకు, పదిమందితో చావు పెళ్లిలాంటిది” అన్నారు కృష్ణమాచారి. “మనల్ని చంపుతారని నేను అనుకోవడం లేదు” అన్నాడు గెల్లా కేశవరావు “చలిగాలి గిలిగింతలు పెడుతుంటే చావు కబుర్లెందుకులే నాయనా” అన్నారు దాశరథి. కవిగారికి నవ్వులాటలా వుంది. “బైనెట్లు తుపాకులకు ఎక్కిస్తున్నారు పోలీసులు” అన్నాడు రెడ్డి.

ఈ 30 మందిని కాజీపేట రైల్వే జంక్షన్‌కు తీసుకువెళ్లి దిగమన్నారు, విజయవాడ నుండి సికింద్రాబాద్ వెళ్లే రైలు వచ్చి ఆగింది “ఛడో, ఛడో” (ఎక్కండి, ఎక్కండి) అన్నాడు పోలీసు సార్జెంటు. అందరూ రైలు ఎక్కారు. “వందేమాతరం” అని అరిచారు ఒకరు. అందరూ ఏక కంఠంతో వందేమాతరం అన్నారు. ప్లాట్‌ఫారం పైన వున్న వాళ్లకు అర్థమైంది “పోలీసులు వీళ్లను చంపడానికి తీసుకువెళుతున్నారు అనీ” కొందరు యువకులు రైలు పెట్టె ముందరకు వచ్చి “ఉన్కో ఛోడో” (వాళ్లను వదిలివేయండి) అన్నారు. వాళ్లను తుపాకీ బట్స్‌తో గుద్దాడు సారెంజెంటు “అమ్మా” అని కేకవేసి ఒకరు పడిపోగా రైలు కదిలిపోయింది.

(అవాజ్ కరేంగే తో – అభీ గోలీమార్ దియే జాయేంగే) “గొంతెత్తితే ఇప్పుడే చంపుతాం” అన్నాడు పోలీసు అధికారి, ఎవ్వరూ కిక్కురమనలేదు. రైలు

# మం మిన్న

కిటికీల్లోనించి చలిగాలి వీస్తున్నది. కృష్ణమాచారి ఓ పద్యం చెప్పారు.

*చలిగాలి పీల్చి చెలి కౌ*
*గిలిలో శయనించినట్లు కేవలభావో*
*జ్వాల వీధుల పయనింపగ*
*విలపించగనేల? భీతి విడువుము మిత్రా*

"చావబోతుంటే పద్యాలేమిటయ్యా" అన్నాడు యాదగిరి.

"ఖామూష్" (నిశ్శబ్దం) అన్నాడు పోలీసు అధికారి. ఈ లోగా కృష్ణమాచారి చూడామణి పెళ్లి చేసుకుంటానని ప్రమాణం చేసినట్లు కలవచ్చి చూడామణి అని కలవరించాడు కృష్ణమాచారి. సికింద్రాబాద్, చూడామణి కాదు అన్నాడు కేశవరావు.

సికింద్రాబాద్ నుండి నిజామాబాద్ సెంట్రల్ జైలుకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ముప్పయి మంది ప్లాట్‌ఫారంపై వరసగా నిలబడి వందేమాతరం గీతాన్ని పూర్తిగా పాడారు. మెహతె మీమ్ (సూపరింటెండెంట్) మొదట మొరాయించినా తరువాత మెత్తబడ్డాడు. వందేమాతరం గీతం పాడుతూవుంటే రైల్వే బ్రిడ్జిపై నుండి ప్రజలు పువ్వులు చల్లారు. పకోడి పొట్లాలు విసిరారు, అయితే వాటిని పోలీసువారే తిని ఆకలి తీర్చుకున్నారు. కాసేపటికి కేశవరావు పోలీసువారితో బయటకు వెళ్లి అందరికీ కావలసిన ఆహార పదార్థాలు తెచ్చారు. ఒక మహాతల్లి వీరికి వీరకుంకుమ దిద్ది "వందేమాతరం" అంటూ అరిచింది, నిజామాబాద్ రైలు ఎక్కారు, వీరందరికీ "ఛాయ్" తెచ్చి ఇచ్చింది, ఆమె భారతమాత ఆ వేషంలో వచ్చింది అని అందరూ అనుకున్నారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగ్గానే పోలీసులు, రజాకార్లు ఈ 30 మందికి బాగా దేహ శుద్ధి చేశారు. దారి పొడువునా రజాకార్లు పరుగు పరుగున వచ్చి కొట్టేవారు. కృష్ణమాచారి పెదవి పగిలి రక్తం కారింది కాని తుడుచుకోవడానికి కూడా వీలు లేకుండా వున్నదని తన స్వీయచరిత్రలో రాసుకున్నారు. వీరిలో ఒకరు నిషేధించబడిన "ఆంధ్రప్రభ" పేపరు చేతితో పుచ్చుకున్న యువకుడిని ఒక రజాకారు ఎడమ చెయ్యిపై కత్తితో వేయగా మూడు వేళ్ళు తెగి పడ్డాయి, ఆ యువకుని పేరు "నారాయణరెడ్డి" సెక్యూరిటీ అడ్డుకోకపోయి వుంటే చనిపోయేవాడే.

నిజామాబాద్ జైలు గురించి కృష్ణమాచారి చెపుతూ, 'ఒక కాలమున ఇద్ది దేవళము, వేరొక్కప్పుడు దుర్గంబు, నేడకటా జైలయి కాను పించెను, భవిష్కాలమందెట్టి రూపకమున్ దాల్చునో? కాలచక్ర గమన స్వాభావికావర్త వివర్తార్త కల్పనమై విద్యలకు ఆలయమ్మగును, ఈ బందీలే పాలింపగా" కవి వాక్కు ఊరికే పోతుందా! ఈ బందీలే పాలించారు తరువాత ఆంధ్రప్రదేశ్‌ను, భారత్‌ను!

నిజామాబాద్ సెంట్రల్ జైల్లో 800 మంది ఖైదీలు వుంటారు. జనవరి 11, 1948న జరిగిన సంఘటన ఖైదీల జీవితంలో (నిజామాబాద్) మరిచిపోలేని రోజు. సాధారణంగా అందరూ జైలు నుండి ఏదో రోజున విడుదల అవుతామని తలిచేవారు కానీ నిజాం, భారత ప్రభుత్వంతో యథాతథ ఒడంబడిక (నవంబర్ 29, 1947)



జరగడంతో ఆ ఉన్న ఆశపోయింది. ఆ రాత్రి ఖైదీలందరూ భోజనాలు ముగించుకొని ప్లేట్లు కడుక్కోవడానికి కుళాయి దగ్గరకు వచ్చారు. అందరూ పళ్లాలు కడుక్కుంటుంటే కవి గారు, హేమంతం మీద మంచి కంద పద్యం చెప్పారు. డాక్టర్ భోగరాజు వెంకటేశ్వరరావు చక్కగా ఆస్వాదించారు (కామారెడ్డిలో వైద్యం చేసుకుంటుండగా ప్రభుత్వ వ్యతిరేకి అని జైలులో వేసేసారు).

*"హేమంత నిశల, కౌగిలి*
*లేమికి దుర పిల్లువాడు లేడీ కారా*
*ధామమ్మున, మృతి కౌగిలి*
*కామించెడి వీరవరుల కల రిచ్చోటన్"*

వట్టికోట ఆళ్వారుస్వామి, గెల్లా కేశవరావు, బోరేకర్, కులకర్ణి, శ్రీనివాస్ లాహోటిలు గుడ్డి దీపాల వెలుగులో బేరక్స్ వైపు వెళుతున్నారు. ఇంతలో బూట్ల చప్పుడు, కేకలు వినిపించాయి. "పీటో! లుచ్చేంకో" (కొట్టండి, వెధవల్ని) అనే అరుపులు వినపడ్డాయి. ఓ ఇరవైమంది కర్రలు, చువ్వలు, కత్తులు తీసుకొని కొడ్తున్నారు. "చస్తిని నాయనో" అని అరిచాడు లావోటీ, కృష్ణమాచారి లావోటీ వైపు పరుగెత్తారు లావోటీని లేపి పట్టుకోగా చేతులనిండా రక్తం, వెంకటేశ్వర్రావు అరిచాడు అటు పరుగెత్తి చూస్తే అతని కాలూ, చేయి విరిగాయి. కృష్ణమాచారి ఎడమ భుజం బొమిక విరిగింది, నేరేడు చెట్టు క్రింద కుప్పకూలిపోయి స్పృహ తప్పారు. కాని కాసేపటికి తేరుకున్నారు. ఆళ్వారుస్వామి అరుస్తున్నాడు దాశరథిని కొట్టార్రా, రండి బేరక్స్ లోపలికి మోసుకు పోదాం. ఇంతలో బోర్కర్ వచ్చి "కవిజీ ఇన్ బద్మాషోనే తుమ్హే భీ మారా"? (ఈ దుర్మార్గులు నిన్ను కూడా కొట్టారా కవీ) అన్నాడు. కులకర్ణి పరుగున వెళ్లి నీళ్లు తెచ్చి తాగించాడు. ''క్యాహో రహాహై''? (ఏమౌతున్నది) అని కవిగారు అడిగారు. "రజాకార్లు జైల్లో ప్రవేశించి బీభత్సం చేస్తున్నారు మన వారు చావుకు తెగించి ఎదిరిస్తున్నారు" అన్నాడు కులకర్ణి. (మారో, మారో) అనే మాటలు దూరంగా వినబడుతున్నాయి అని అంటూ కృష్ణమాచారి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు.

వందలాది తలలు పగిలాయి, కాళ్లు చేతులు విరిగాయి. ఎందరి ప్రాణాలు పోయాయి, ప్రభుత్వం రికార్డు చేయలేదు, స్వామి రామానందతీర్థ తన "మెమొయిర్స్"లో వ్రాస్తూ "Satyagrahis in nizamabad jail have been be labored and untold sufferings have been inflicted on them. Lathi charges inside the prison were not a rare occurrence. In Gulbarga jail itself in my immediate vicinity a Satyagrahi was beaten to death" .

స్వామీ రామానంద తీర్థ హైదరాబాద్ నవాబుకు ఒక లేఖ వ్రాస్తూ 21 వేల మంది సత్యాగ్రహులు జైలులో మగ్గుతున్నారనీ, బీబీనగర్ గ్రామంలో రజాకార్లు, పోలీసులు ప్రజల మానప్రాణాలను హరించారనీ, దౌర్జన్యకాండ జరుగుతున్నా ప్రయోజనం శూన్యం అని ముగించారు.

హైదరాబాదు నిజాం నుండి విముక్తమైంది. సర్దార్ పటేల్ చొరవతో సైనిక చర్య అనంతరం భారత్‌లో విలీనమైంది. ఆంధ్రరాష్ట్రంలో తెలంగాణా కలిసిపోయి విశాలాంధ్ర ఏర్పడింది. కృష్ణమాచారి ఆకాశవాణిలో అధికారికంగా ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా, సినిమా కవిగా బాధ్యతలు నిర్వర్తించి (యాత్రా స్మృతి) జీవిత చరిత్ర, అగ్నిధార వంటి అనేక గ్రంథాలు వ్రాశారు. 1987 నవంబర్ 5న మరణించారు.

కృష్ణమాచారి సాహిత్యం ప్రజల్లోకి చొచ్చుకుపోయింది, దానికి కారణం కవులు అనుభూతి పొంది వ్రాస్తారు కానీ కృష్ణమాచారి అనుభవించి రాశారు. ★

పదో పన్నెండో కాదు...మొత్తం ఇరవై నాలుగు విభాగాల ఇంద్రచాపం సినిమా. ప్రతీ మదిలోనూ స్పందన కలిగించి పెంచే వికాస సాధనం. వేడుక, విషాదాలతో పాటు అన్ని రసభంగిమలనీ ప్రదర్శించే వెండి తెర రూపం. ఆ అభినయ రసమయాల వైపే కోట్లాది వీక్షకుల చూపులన్నీ! అందరినీ సేద తీర్చి, మురిపించి, మైమరపించేది చలనచిత్రం మాత్రమే. నర్తన, గీత, సంగీత, సాహిత్యాదుల ఏకైక సమాహారం. మూడే మూడు మాటల్లో అది- మంత్రపురి మహా విహారం. సమస్త ప్రకృతికీ ప్రతికృతి. సృజన అంచుల మీద మన మానసాలను నడిపించాలన్నా, నక్షత్రకాంతి-జలపాత హోరును తలపించాలన్నా సినీజగత్తులోనే. కళ్లకు చలువ, చెవులకు విందు, హృదికి ఉపశాంతినందించే పరమాద్భుత కళా ప్రపంచం.

మరి ఆస్కార్? శ్రవణ సహిత దృశ్య చిత్రణకు బహుకృతి. మొదట్లో అకాడమీ అవార్డు, అటు తర్వాత వ్యక్తి రూపాన్ని స్ఫురింపచేసే అపురూప దివ్య కానుక కూడా. ఆక్యుపేషనల్ స్కిల్స్ కాంపిటీషన్ అండ్ రివ్యూ. వృత్తి నైపుణ్య పోటీకి నిలిచి, సమగ్ర వీక్షణ సమీక్షనందనుకునే చిత్రరాజం. అపూర్వ ప్రతిభా పాటవాలు కనబరిచిన నటీనటులతో పాటు రచయితలు, దర్శకులు, సాంకేతిక కోవిదులు, సంబంధిత ప్రసిద్ధులకు వైభవోపేత రీతిన బహూకరించే ప్రతిష్ఠాత్మక పురస్కృతి. సినీ విభాగాల సంఖ్యకు దాదాపు సరిసమాన స్థాయిన అలరారుతున్నయీ పురస్కారాలన్నీ.

విశ్వమానవ సృజనీకరణకు పట్టాభిషేకం చేసే ఆస్కార్‌కు ఈసారి మరో విలక్షణ జత చేరింది. ప్రపంచ ప్రఖ్యాతమైన ఇదే ఆస్కార్ 95వ (ఏర్పాటు చేసింది 1928లో) వేడుకల్లో మన దేశానికి రెండు ప్రతిమలు లభించాయి. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటునాటు..' పాటకు ఒకటి, బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ కేటగిరీలో 'దిఎలిఫెంట్ విస్పరర్స్'కు మరొకటి. దర్శకులు కార్తికి కాగా, నిర్మాత గునీత్. ఇండియన్ ప్రొడక్షన్ సంస్థకు ప్రథమంగా ఆస్కార్ లభించిందంటే, ఆ ఘనత అంతా వీరిదే.

దక్షిణ భారతంలోని ఒక జంట (బొమ్మన్, బెలీ) ఎంతో ప్రేమగా ఓ అనాథ ఏనుగు(రఘు)ను చూసుకోవడమనే 'ఎలిఫెంట్ విస్పరర్స్' కథాంశం. మనుషులు,అడవి జంతువుల మధ్య విస్తరించిన కుటుంబ సంబంధ బంధమే ఇతివృత్తం. తమిళనాడులోని మదుమలై అరణ్యప్రాంతం నుంచి తప్పించుకున్న రెండు ఏనుగు పిల్లలను సమీప గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు దత్తత తీసుకుని పెంచుకుంటారు. ఆ జంటకు, ఒంటరి ఏనుగుకు మధ్య ప్రబల బాంధవ్యం ఏర్పడుతుంది. ప్రకృతి, వన్యప్రాణి, మనిషి నడుమ అవగాహన శక్తిగా పరిణమిస్తుంది. ఇందులోనే భారతీయ సంప్రదాయం, పర్యావరణ పరిరక్షణం, మూగప్రాణుల పరంగా బాధ్యతాయుత ధోరణి సైతం ఇమిడి ఉన్నాయి. దాదాపు నలభై నిమిషాలున్న ఇదే డాక్యుమెంటరీలో జీవి భావోద్వేగాలు, వాటిని తెలుసుకుని మసలిన ఆ పరిరక్షకుల ఆదరాభిమానాలు తేటతెల్లమవుతాయి. ఏ ప్రాణితోనైనా అర్థం చేసుకుని వ్యవహరిస్తే, అదే స్పందన అటునుంచి వ్యక్తమవుతుంది. ఈ సహజసిద్ధ సందేశం చిత్రంలోని ప్రతీ ఫ్రేమ్‌లోనూ కనిపిస్తుంది. పిల్ల ఏనుగుకు స్నానం చేయించడం ఇందులో చూస్తాం. దాని ఆటాపాటా గమనిస్తాం. పచ్చికలో ఆ గున్నకు ఆహారం తినిపించడాన్ని తిలకిస్తాం. ఇలా ఎన్నో కనువిందైన సన్నివేశాలను మన ముందు ఉంచి, చిత్రాన్ని ఆసాంతం రక్తికట్టించారు కార్తికి, గునీత్. ఇద్దరూఇద్దరే. గట్టి పట్టుదలకు పెట్టింది పేరు.



జంధ్యాల శరత్‌బాబు

సీనియర్ జర్నలిస్ట్

### సాటిలేని పోరాట పటిమ

దర్శకురాలు కార్తికి తొలినుంచీ పరిశీలనాసక్తి ఎక్కువ. ఏదిచూసినా, ఏ మాట విన్నా, ఎన్ని పుస్తకాలు చదివినా, ఆ అన్నింటినీ మనసుతో అనుసంధా నిస్తారు. యాంత్రికంగా కాక, వైవిధ్యంగా ఆలోచిస్తారు. దాన్ని తు.చ. తప్పక ఆచరణలో పెడతారు. ఒకరోజు ఆమె ఊటీకి ప్రయాణిస్తుంటే, తారసపడిన సందర్భమే ఆమెను మేటి దర్శకురాలిగా నిలబెట్టింది. అటవీ ప్రదేశం రోడ్డు పక్కన జంతు సంరక్షకుడు బొమ్మన్ కనిపించాడు. ఇది ఇప్పటి మాట కాదు. ఐదేళ్ల కిందటిది. అతడి వెంట 'రఘు' (బుల్లి ఏనుగు) కనిపించింది. దానికి స్నానం చేయించాలని తీసుకెళ్తున్నాడు. 'సంరక్షణ అంటే ఇదే కదా?' అనిపించింది ఆమెకు. చూస్తూ చూస్తూ ఉంటే, ప్రగాఢ అనుబంధమే కంటిముందు నిలిచింది. ఆ చిన్న గున్నకు అమ్మ, నాన్న, మిత్రుడు, సోదరుడు, గురువు, పరిక్షకుడు, శిక్షకుడు... సమస్తం అతనే కదా అనిపించింది ఆ దర్శకురాలికి. వివరాలు ఆరా తీస్తే, ఒక్కో వాస్తవం తెలిసేకొద్దీ హృదయం ద్రవించింది. పిల్ల ఏనుగుకు నెలల వయసు ఉండగానే తల్లి చనిపోయింది కరెంట్ షాక్‌తో. మనుషులు చేసిన 'ఏర్పాటు' దాని ప్రాణం తీసిందన్న



కార్తికి

మాట. ఏనుగు పిల్లను ఇంకో కష్టమూ వెంటాడింది. వేటకుక్కలు తెగబడి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. సరిగ్గా అప్పుడే అటవీశాఖ అధికారులు చూశారు. ఇకనుంచీ అలనాపాలనా చూసుకోవాలంటూ బొమ్మన్‌కు అప్పగించారు. అప్పటి నుంచీ అతడి సంరక్షణ మొదలైంది. అదే రిజర్వు ఫారెస్టు ప్రాంతంలోనే చిన్నపాటి నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. అన్నీ తానే అయ్యాడు. చిన్నారి 'రఘు'ను కంటి వెలుగులా, ఇంటి దీపంలా చూసుకున్నాడు. ఇందంతా కార్తీ మదిని కదిలించింది.

# ఏనుగమ్మ ఏనుగు! ఆస్కార్ తెచ్చిందేనుగు...





గునీత్

తన ఆలోచనను ఆచరణలోకి తెచ్చారు కార్తీకి. తెలిసిన, చూసిన, విన్న అన్నింటినీ తెరకెక్కించాలని నిర్ణయించుకున్నారు. వాణిజ్యంగా కాదు.. సేవా భావంగా. అగ్రగామి కావాలనుకున్నారు. అనుకున్నట్లే అయ్యారు. ముందుగా ఇంటి నుంచి అడవిబాట పట్టారు. బొమ్మన్ కుటుంబంలో ఒకరిగా మెలగారు. ఇప్పుడు మీకు మరింత బాగా అర్థమైంది కదూ! సినిమా మొత్తంలో నాలుగే కీలక పాత్రలు. బొమ్మన్, అతడి భార్య బెలీ, రెండు ఏనుగు పిల్లలు. 'రఘు' కాకుండా మరోదాని పేరు 'అమ్ము'. పేర్లు సైతం ముచ్చటగా లేవూ? సన్నివేశాల చిత్రీకరణ మొదలైంది. నిర్మాతగా జత చేరిన గునీత్ కూడా నిశిత పరిశీలకురాలు. మాటల మధ్య అంతరార్థం, చేతల వెనక మనస్తత్వం బాగా తెలినున్న వారు. ప్రత్యేకత ఉంటేనే మంచి గుర్తింపు లభిస్తుందని అనుభవ పూర్వకంగా తెలిసి ఉన్న వనిత. సినీ నిర్మాణ, దర్శకత్వం కాలంలో ఇద్దరు మహిళలూ సమన్వ సహకారాలను విస్తరించారు. ఆ సినిమా తీసేందుకు నెలలె కాదు... ఏళ్లు పట్టింది. గున్న ఏనుగులే కానీ,వాటి బరువు చెరో నూట యభయ్ కిలోలు. అటువంటి వాటితో చిత్రీకరణ కొనసాగించేందుకు ఇద్దరు వనితలూ అహరహరం పరిశ్రమించారు. నిర్మాణ, దర్శకత్వ పరంగా ఎన్ని కష్టనష్టాలు చవి చూశారో లెక్కకందుదు. అసలు ఆ మావటి కుంటుంబంతో పరిచయ బంధం పెంచుకునేందకే నెలల సమయం పట్టింది. షూటింగ్‌ను గంటల లెక్కల్లో ఎంచాలంటే, ఫీడ్ వివరాలు వెల్లడించాలంటే అంత సులువుగా అయ్యే పనికాదు. అదంతా వందలాది గంటలు. అటవీ ప్రాంతం కాబట్టి మన్య మృగ సంచారం మరీ ఎక్కువ. జింకలు మొదలు పులుల వరకు కనిపించనివంటూ ఏవీలేవు. ఒకనాడు చిత్రీకరణ తరుణంలో, ఒళ్లు గగుర్పొడిచే దృశ్యం చూశారు దర్శక నిర్మాతలు. ఎక్కడి నుంచి వచ్చిందో పులి ఒకటి విరుచుకుపడింది. మరో జంతువును నోట కరచుకుపోయింది. మౌనంగా చూడాలే తప్ప నోరు తెరిచి అరవలేని పరిస్థితి. సినిమా నిర్మాణం పూర్తయ్యే లోపు అటువంటి ఎన్నో దృశ్యాలు చూడాల్సి వచ్చింది ఆ అతివలు. మొదట్లో గుండెదడ, భయాం దోళన. తర్వాత అవి పక్క పోయాయి. అలాంటి దృశ్యాలు చూడడం అలవాటైంది.

**ఘనచరిత... అద్భుత భవిత**

ఇంత సాహసికురాలు కార్తికి కుటుంబ నేపథ్యం ఎంతో ఉంది. జంతు సంరక్షణ ప్రాధాన్యం తెలుసు తల్లికి. ఎటువంటి దృశ్యాలనైనా కెమెరాలో బంధించగలరు తండ్రి. వారి పెద్దలూ ప్రకృతి ప్రేమికులే. ఇంటిని ప్రకృతిలో భాగంగా తీర్చిదిద్దిన వారు. కార్తికిని బాల్యం ఉంచి అడవులలో తిప్పు తుండే వారు. జంతు జీవనాన్ని పరిశీలించడం అనేది వారు నేర్పారు. వాటి మీద తపాకులు కాదు.. కెమెరాలుగురి పెట్టిన నిజజీవన ఆరాధకులు. ఇంతటి బలవత్తర చరిత్ర, రసవవత్తర వర్తమానం ఉంది కాబట్టే భవిష్యత్తు అద్భుతగా మారింది, మారుతోంది. ఆస్కార్ పురస్కారం వరించి వచ్చింది. కార్తీ, గునీత్‌ల ఉమ్మడి శ్రమ ఫలించి పరిమళిం చింది. ఇద్దరూ భారీగా ఖర్చు చేయలేదు. తమ సమయం, శక్తి, తెలివిని భారీగా ఖర్చు చేశారు. విపరీత ప్రచారాలేవీ చేసుకోలేదు. ఇంతచేశాం, అంత చేశామని ఏనాడూ గొప్పలు చెప్పలేదు. తమపని తాము నిశ్శబ్దంగా చేసుకుంటూ వెళ్లారు. అంతా ఫలించిన కారణంగానే ఆస్కారం చేతికందింది. 'ఘనాతిఘన విజయా నందాన్ని సొంతం చేసుకున్న మీరు ఇక ముందు ఏం చేయాలని అనుకుంటున్నారు' అని అడిగితే 'మరో జంతువు మీద చూపు సారిస్తాం' అంటున్నారు. హాలీవుడ్‌తో పాటు వివిధ ప్రపంచ దేశాల చలనచిత్ర ప్రముఖుల సమక్షంలో ఆస్కార్ స్వీకరణం మహిళా మణులిద్దరికీ ఎంతైనా గర్వ కారణం. వారి బాటే ఆదర్శ ప్రాయం, అసాధారణ ప్రతిభా సంపన్నతకు ఇదే దర్పణం. ★

కొద్ది రోజుల క్రితం, మార్చి 17న సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్' కోల్‌కతా వెళ్లారు. రెండు రోజుల పాటు జరిగిన ఎస్పీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పాల్గొన్నారు. అదే సమయంలో పనిలో పనిగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి,తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు మమతా బెనర్జీతో సమావేశమయ్యారు. ఇంచుమించుగా రెండు గంటలకు పైగానే, ఆ ఇద్దరు నేతలు సమాలోచనలు జరిపారు.



# ప్రతిపక్షాల ఐక్యత అ

అయితే, అఖిలేష్, మమతా బెనర్జీతో ఎందుకు సమావేశమయ్యారు? అంతసేపు ఆ ఇద్దరు ఏమి చర్చించారు? అనేది ఇప్పుడు ప్రశ్న కాదు. నిజానికి, ఆ ఇద్దరే కాదు, ఏ ఇద్దరు ప్రతిపక్ష నాయకులు ఎప్పుడు, ఎక్కడ కలిసినా ఒకటే విషయం చర్చకు వస్తుంది. అది, 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించడం ఎలా? మోదీని గద్దె దించడం ఎలా? ఈ రెండు అంశాలే ప్రతిపక్షాల ప్రధాన ఎజెండాగా మారి పో. ఈ నేపథ్యంలోనే డబుల్ డిజిట్ గడప దాటని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ మొదలు ఒకటి రెండు ఎంపీ సీట్లకు పరిమితమైన సీపీఐ, సీపీఎం వంటి 'జాతీయ' పార్టీల వరకు, జాతీయ రాజకీయాల్లో జెండా ఎగరేసేందుకు ఆకాశానికి నిచ్చెనలు వేస్తున్న తృణమూల్, బీఆర్ఎస్ వంటి ప్రాంతీయ, ఉప ప్రాంతీయ పార్టీల వరకు ఏ రెండు పార్టీల ఇద్దరు నాయకులు కలిసినా బీజేపీని ఓడించడం, మోదీని గద్దె దించడం అనే ఏక సూత్ర ప్రణాళిక పైనే చర్చిస్తున్నారు. కాదంటే, మరో అడుగు ముందుకేసి, 'మోదీని ఓడించేందుకు మనమందరం ఏకమవుదాం.. అనే 'ఐక్యత' గీతాన్ని ఆలపిస్తున్నారు.

నిజానికి, 2019 ఎన్నికలలో బీజేపీ వరసగా రెండవసారి, ముందుకు మించిన సొంత బలం



రాజనాల బాలకృష్ణ
సీనియర్ జర్నలిస్ట్

(303)తో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి, ప్రతిపక్షాలలో గుబులు మొదలైంది. 2024 పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్న వెంటాడుతోంది. ముచ్చటగా మూడవసారి బీజేపీ గెలిస్తే, మోదీ మళ్లీ ప్రధాని అయితే, తమ పరిస్థితి ఏమిటనే భయం మొదలైంది. అందుకే, అప్పటి నుంచే బీజేపీని ఓడించడం ఎలా? మోదీని గద్దె దించడం ఎలా? అనే రెండు అంశాల చుట్టూనే, ప్రతిపక్షాల ఆలోచనలు చక్కర్లు కొడుతున్నాయి.

ఇక అక్కడి నుంచి కాంగ్రెస్ ప్లీనరీ అయినా, ఎస్పీ జాతీయ కార్యవర్గ సమావేశాలు అయినా, మరో ప్రతిపక్ష అంతర్గత సమావేశమే అయినా, ఉమ్మడి వేదికలపై జరిగే చర్చలు,సమాలోచనలు ఏవైనా, వేదిక, సందర్భం ఏదైనా ఎజెండా మాత్రం ఒక్కటిగానే ఉంటోంది. 2024 ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీని ఓడించడం ఎలా? ప్రతిపక్ష పార్టీల ఐక్యతకు ఏది మార్గం? అనే అంశాల చుట్టూనే ప్రతిపక్షాల చర్చలు, సమాలోచనలు సాగుతున్నాయి. ప్రతిపక్షాల ఐక్యత విపక్షాల సింగిల్ పాయింట్ అజెండాగా మారి పోయింది. అందరూ అదే మాట్లాడుతున్నారు. అయితే ఒకరి ఆలోచనకు, ఇంకొకరి ఆలోచనకు, ఒకరి మాటకు ఇంకొకరి మాటకు పొంతన ఉండడం లేదు, పోలిక కుదరడం లేదు. అందుకే 'ప్రతిపక్షాల ఐక్యత' అనేది ఎంతకీ అంతు చిక్కని బ్రహ్మ పదార్థంగా మారిపోయింది. ఎండమావిలా మిగిలి పోయింది.

కోల్‌కతాలో మమతా బెనర్జీ, అఖిలేష యాదవ్ కూడా అదే విషయం చర్చించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన అఖిలేష్ యాదవ్, అదే విషయం స్పష్టం చేశారు. "మీరు ఫ్రంట్ అంటారా, పొత్తంటారా, ఘటబంధన్' అంటారా అది మీ ఇష్టం.. కానీ, కాంగ్రెసేతర' ప్రతిపక్షాల కొత్త కూటమి త్వరలో ఏర్ప డబోతోంది" అని ప్రకటించారు. అదే విషయం మమతా దీదీతో చర్చించానని చెప్పుకొచ్చారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ, ప్రాంతీయ పార్టీల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా ఎక్కడుండాలో అక్కడుంటే మంచిదని, హస్తం పార్టీకి ఓ చురక అంటించారు.

అలాగే, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సుదీప్ భట్టాచార్య, మరో అడుగు ముందుకేసి, కాంగ్రెస్ ప్రతిపక్షాలకు 'పెద్దన్న' పాత్ర పోషించాలనుకుంటే కుదరదని, కురువృద్ధ కాంగ్రెస్ పార్టీ ఆ భావన నుంచి బయటకు రావాలని, 'మా తాతలు నేతులు తాగారు' అంటే కుదరదని కుండబద్దలు కొట్టారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఒక పెద్ద ప్రాంతీయ పార్టీగా మిగిలిందనే నిజాన్ని మరిచి పోరాదని గుర్తు చేశారు.

అంతవరకు ఓకే అయినా, తృణమూల్ ఎంపీ, అఖిలేష్ మూడో ఫ్రంట్ ఆలోచనను మొగ్గలోనే తుంచేశారు. ప్రస్తుతానికి థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేసే ఆలోచన తమ పార్టీకి లేదనీ అన్నారు. తృణమూల్ ఇటు కాంగ్రెస్ అటు బీజేపీకి సమదూరం పాటిస్తుందనీ అన్నారు. అయితే తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ త్వరలో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీల



# య్యే పనేనా?

నాయకులను కలుస్తారని ఆయన అంటున్నారు. ఎందుకు? ఏమిటీ? అనే వివరణ లేదు. ఓ వంక కాంగ్రెస్ పార్టీతో చేయి కలిపేది లేదని, మరోవంక థర్డ్ ఫ్రంట్ ఆలోచన లేదంటారు, మళ్లీ బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలను ఏకం చేసేందుకు మమతా బెనర్జీ, ప్రాంతీయ పార్టీల నాయకులను కలుస్తారని అంటారు. అందుకే, మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్ కోల్‌కతా వేదికగా జరిపిన తాజా చర్చలు, ప్రతిపక్షాల అయోమయ స్థితికి, అధ్వాన్న పరిస్థితికి అద్దం పడుతోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ప్రతిపక్షాల ఐక్యత గురించి విపక్షాల మధ్య ఇప్పుడే కాదు... ఎప్పటి నుంచో చర్చలు జరుగుతూనే ఉన్నాయి. నిజానికి, 2019 ఎన్నికలలో బీజేపీ రెండవసారి అధికారానికి వచ్చింది మొదలు ప్రతిపక్షాలు ఐక్యతా రాగాలు ఆలపిస్తూనే ఉన్నాయి. అయితే, 1964లో భారత కమ్యూనిస్ట్ పార్టీ రెండు ముక్కలు అయినప్పటి నుంచి ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల పునరేకీకరణ చర్చలు జరుగుతున్న విధంగా, 2019 నుంచీ బీజేపీయేతర పార్టీల ఐక్యత కోసం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రయత్నాలు సాగుతున్నాయి. అయితే, ఈ ప్రయత్నాలు ఒకడుగు ముందుకు నాలుగడుగులు వెనక్కి అన్నట్లు సాగుతున్నాయి.

ఒక్కసారి ప్రస్తుతం నుంచి కొద్దిగా వెనక్కి వెళితే, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత, ఎన్నికల్ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్' తమ వంతు కర్తవ్యంగా రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిని బరిలో దించి, బీజేపీ, చెక్' పెట్టేందుకు చేసిన ప్రయత్నం ఏ విధంగా బెడిసి కొట్టిందో వేరే చెప్పనక్కర లేదు.

అదలా ఉంటే అఖిలేష్, మమతా బెనర్జీ భేటీ నుంచి కొద్దిగా వెనక్కి వెళితే, ఫిబ్రవరిలో బిహార్ సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షంగా ఉన్న సీపీఐ (ఎంఎల్) పార్టీ, 'అపోజిషన్ యూనిటీ' అవసరాన్ని నొక్కి చెందుకు, 'సేవ్ కాన్స్టిట్యూషన్, సేవ్ డెమోక్రసీ, సేవ్ ఇండియా' పేరిట పాట్నా'లో సదస్సో, సమావేశమో నిర్వహించింది. ఈ సదస్సులో బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యు) అధ్యక్షుడు నితీష్ కుమార్' చాల గంభీర ఉపన్యాసం చేశారు. కాంగ్రెస్ లేని ప్రతిపక్ష కూటమిని ఊహించాలేమని అన్నారు. ఒకవేళ అలాంటి కూటమి ఏర్పడినా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల మధ్య ఎన్నెనా విభేదాలు ఉండవచ్చును. కానీ, బీజేపీని ఓడించాలంటే కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలన్నీ కలసి నడవక తప్పదని కుండబద్దలు కొట్టారు. అందుకే, తనను తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆహ్వానించినా, బీఆరెస్ ఆవిర్భావ సభకు వెళ్లలేదని అన్నారు. అయితే అదే సమయంలో నితీష్ కుమార్' కాంగ్రెస్ పార్టీ కూడా మెట్టు దిగిరావాలని, ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నచోట్ల, ప్రాంతీయ పార్టీల పెద్దన్న పాత్రను అంగీకరించి, సర్దుకు పోవాలని అన్నారు.

అయితే, ఆ వెంటనే కాంగ్రెస్ నేత జై రామ్ రమేష్' ఘాటుగా స్పందించారు, "కాంగ్రెస్ పాత్ర ఏమిటో, కాంగ్రెస్‌కు తెలుసు. కాంగ్రెస్‌కు ఎవరి సర్టిఫికేట్ అవసరం లేదు. కాంగ్రెస్‌కు సుద్దులు చెపుతున్నవారు, ఈ దేశంలో బీజేపీతో ఎప్పుడూ చేతుల కలపని, బీజేపీతో సైద్ధాంతికంగా విభేదించే పార్టీ కాంగ్రెస్ ఒక్కటే అనే విషయం గుర్తిస్తే మంచిది" అని నితీష్ కుమార్'కు ఎదురు వాతలు పెట్టారు. ఈ పరిణామాలను, పవిత్ర వచనాలను గమనిస్తే, అందరి లక్ష్యం ఒకటే అయినా, మిగిలిన ప్రతి పక్షాలకు అటూఇటుగా చీలిపోవడంతో వాటి ఐక్యత ఒక ప్రహసనంగా మారిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

నిజమే, ప్రతిపక్షాల ఐక్యతకు కాంగ్రెస్ పార్టీ పెద్దన్న పాత్ర ఒక ప్రధాన అవరోధంగా నిలుస్తోంది అనేది అందరూ ఏకీభవిస్తున్న విషయమే, అయితే, అదొక్కటే కాదు, కాంగ్రెస్ పార్టీలో, ప్రతిపక్ష కూటమిలో రాహుల్ గాంధీ పాత్ర ఏమిటి? అనేది, అంతకంటే పెద్ద సమస్యగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎంతవరకు కాలేదు అనే ప్రశ్నను పక్కన పెడితే, కాంగ్రెస్ పార్టీ మాత్రం రాహుల్ గాంధీని, 'దేశ్ కీ నేత' బొమ్మగా మలిచేందుకు, నిలిపేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ప్రతిపక్షాల ప్రధాని అభ్యర్థిగా 'నిలిపేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. అయితే, ఇతర ప్రతిపక్షాలు ఏవీ రాహుల్ గాంధీని, ప్రతిపక్షాల ప్రతిరూపం (ఫేస్, చెహరా)గా చూసేందుకు, చూపేందుకు సిద్ధంగా లేవు. రాహుల్ గాంధీ నాయకత్వంలో పని చేసేందుకు అంగీకరించడం లేదు. రాహుల్ గాంధీ, ఇంగ్లాండ్'లో భారత ప్రజాస్వామ్యాన్ని, భారత పార్లమెంట్'ను అవమాన పరుస్తూ చేసిన వివాదస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ప్రతిపక్షాల రాహుల్‌ని ప్రతి బంధకంగా భావిస్తున్నాయి. అంతేకాదు మమతా బెనర్జీ, నితీష్ కుమార్, కేసీఆర్, అరవింద్ కేజ్రీవాల్ ఇలా ఓ అరడజను మందికి పైగానే ప్రతిపక్ష నేతలు, ప్రధాని పదవిని ఆశిస్తున్నారు. సో... ప్రతిపక్షాలు కంటున్న, 'ఉమ్మడి కల' ఉట్టి కొట్టినట్లే అంటున్నారు. ★



కథ

# ప్రభువు

సింహప్రసాద్

రావణ రాజ్యం యావత్తూ ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది. తల విదిలించి ఇంతింత కళ్లతో దిగ్భ్రమగా చూసింది.

సముద్రం మీద సేతువు నిర్మిస్తున్నారన్న వార్తను అటు పాలకులే కాదు ఇటు పాలితులూ విశ్వసించ లేకుండా ఉన్నారు. ఎంతగా బుర్ర బద్దలు కొట్టుకున్నా అదెలా సాధ్యమో వారి ఊహకి సైతం అందటం లేదు. ఇన్నేళ్లూ చుట్టూ వున్న సముద్రమే పెట్టని కోటగా రాజ్యానికి పొలిమేర రక్షగా ఉందని ధీమాగా వున్నారు. అలాంటిది అమాంతం బయటి ప్రపంచం నుంచి లంకకు గట్టి మార్గం ఏర్పడబోతోంది! శత్రువులింక యథేచ్ఛగా రాజ్యంలోకి రావొచ్చు, పోవచ్చు!

'ఇది నిజంగా నిజమేనా' అని నలుగురు చేరిన ప్రతి చోటా పదే పదే ఒకరినొకరు ప్రశ్నించు కుంటున్నారు! చర్చిస్తున్నారు!

"అసలు సముద్రం మీద ఎవరైనా వారధి నిర్మించగలరా?" అడిగారు ఒకరు.

"అది అసంభవమే కానీ దాన్ని సంభవం చేశాడు శ్రీరాముడు!"

"అతనికి మాయలూ మంత్రాలూ వచ్చేమో!"

"ఉహూ... అతడు మన రావణ మహారాజులాగా కైలాస పర్వతాన్ని కదిలించగల మహాబల శక్తి సంపన్నుడేమీ కాదు. ఒంటితల మానవుడు!" వ్యంగ్యంగా నవ్వాడు మరొకడు.

"ఔరా! మన అసురులు హుంకరిస్తే చాలు అల్లంత దూరం ఎగిరెళ్లి పడే పిపీలికం లాంటి మనిషికి ఇది ఎలా సాధ్యమైందబ్బా!" తల పట్టుకున్నాడు మరొకడు.

"ఊరికే ఏదేదో వాగకండి. దండకారణ్యంలో 14 వేల మంది మనవాళ్లను ఒంటిచేత్తో సంహరించిన మహావీరుడు శ్రీరాముడు, తెలుసా?" వారిలోకెల్ల పెద్దవాడన్నాడు.

"విన్నాను విన్నాను. అస్త్రశస్త్రాలు దండిగా ఉండి ఉంటాయి కనుక చంపి ఉండొచ్చు. అదీగాక మనవాళ్లు అజాగ్రత్తగా వుండీవుంటారు. కానీ ఇదెలా సాధ్యం? ఇదేమీ ఆషామాషీ వ్యవహారం కాదే? ఇప్పటికీ నాకు నమ్మకం చిక్కడం లేదు!"

"వారధిని శరవేగంతో నిర్మించేస్తున్నారు. ఇంకొద్ది రోజుల్లో మన లంక దాకా వచ్చేయడం ఖాయం. ఇంకో గమ్మత్తయిన సంగతి చెబితే మీరంతా మూర్ఛ బోతారు!"

"అదేంటో త్వరగా చెప్పరా!"

"పెద్దపెద్ద బండల మీద 'శ్రీరామ' అని రాసి సముద్రంలో వేస్తుంటే చిత్రంగా అవి నీటి మీద తేలుతున్నాయిట!"

"సందేహం లేదు, ఇది ఖచ్చితంగా కట్టుకథే!" చప్పరించేశాడు.

"భ్రమల్లో నుంచి బయటికి రా. బండలతో చెట్లతో సేతువు నిర్మిస్తున్నారు. దాని మీంచే నడిచి వానరసేనంతా మన తీరానికి వేగిరం వచ్చేస్తుంది చూడు!"

"అంత మంది దానిమీద నడిచి వచ్చినా సరే మునిగిపోదా? అయితే ఇదేదో వింతల్లో కెల్ల పెద్ద వింతే !" మరొకడన్నాడు.

"మీవన్నీ చచ్చుపుచ్చు కథలని రుజువు చేస్తాను. మీలో దమ్మున్న వాళ్లుంటే నాతో రండి. ఇప్పుడే మీ కళ్లెదుటే ప్రయోగం చేసి చూపిస్తాను. మీ కళ్లు తెరిపిస్తాను !"

అతడు సవాలు విసిరే సరికి ఐదారుగురు లేచారు.

వారంతా సముద్రపుటొడ్డుకు వెళ్లారు. రెండు పెద్ద బండ మీద వారి భాషలో 'శ్రీరామ' అని రాసి అతికష్టం మీద తోసుకెళ్లి సముద్రంలో పడేశారు . ఆశ్చర్యంగా అవి తేలాయి! అతడు దానిమీదికెక్కి ముంచాలని ప్రయత్నించాడు. అయినా అవి నీటి మీద తేలుతూనే ఉన్నాయి!

''చూశావా చూశావా! ఇప్పుడైనా నమ్ముతావా!"

అంతా ఒక్కుమ్మడిగా అడిగేసరికి అతడికి రోషం పొడుచుకు వచ్చింది. "ఇదంతా రాయి గొప్పగాని రాముడిది కానే కాదు. ఇప్పుడే చూపిస్తా"

వారి సాయంతో ఆ బండల్ని ఒడ్డుకి లాగాడు. వాటి మీది 'శ్రీరామ' అక్షరాలని పూర్తిగా కడిగేశాడు. ఆ పైన పీచుతో ఆనవాళ్లు లేకుండా తోమి, 'రావణ' అని రాసి సముద్రంలోకి దొర్లించారు.

బుడుంగున మునిగాయి. అతడి ముఖంలో కత్తివేటుకి నెత్తుటి చుక్క లేదు!

"శ్రీరామ అన్న పేరుకే ఎంత మహత్తు ఉందో చూడు!" అన్నాడు పెద్దవాడు భక్తితో చేతులు జోడిస్తూ.

సందేహిస్తూనే తలాడిస్తూ, "పేరే అంత గొప్పదైతే ఇంక ఈ భూ ప్రపంచం మీద రామ బాణానికి తిరుగు ఉండదేమో!" అన్నాడు .

"ఉండనే ఉండదు. అదేకదా ఇందాకట్నుంచి నేను మొత్తుకుంటున్నదీ!"

"మరి అయితే రేపటి యుద్ధంలో మన రాజు గతి ఏమౌతుందో!'' ఆందోళన పడ్డారింకొకరు.

అంతా భయకంపితులై చూశారు తప్ప నోరు తెరవలేదు. మౌనంగా వెనుదిరిగారు.

దారిలో అన్నాడొకడు ''మన మహారాజుకి నిజంగా మతి పోయింది. అంతఃపురంలో మండోదరి గాక ఎందరో భార్యలున్నారు. ఏకంగా రంభనే అనుభవించిన వాడు. అలాంటి వాడు సామాన్య మానవ కాంత సీత మీద మోజు పడి ఎత్తుకు రావడం ఏమిటి గాచ్చారం గాకపోతే! పాపం పుణ్యం ఎరుగని మన నెత్తి మీదికి భయంకర యుద్ధాన్ని తీసుకు రావడం ఏమిటి చెప్పు!"

"ఆ సీతని మా అమ్మా వాళ్లూ అశోకవనానికెళ్లి చూసొచ్చారు. అచ్చం మునికన్యలా ఉందిట. చూడగానే దండం పెట్టాలనిపించిందట!"

"మరి రావణరాజు కళ్లకు మాయారంభలానో, ఊర్వశిలానో కనిపించిందేమో ఖర్మ !"

"ఆ రంభ శాపమే ఇచ్చి ఊరుకుంది. ఈమె ఏకంగా మృత్యువుని మెడకు చుట్టేస్తుంది. మొత్తం లంకా రాజ్యాన్ని బూడిద కుప్పగా మార్చేస్తుంది!"

"నీకులాగా మన మహారాజు ఆలోచించక పోవడం మన దురదృష్టం. ఒకటి కాదు రెండు కాదు పది తలలున్నాయి. ఒక్కటీ సవ్యంగా ఆలోచించ



లేకపోయిం దంటే, ఇక ఆ బోడి తలలు ఉంటే ఎంత, పోతే ఎంత!"

"అసలిదంతా శూర్పణఖ వల్ల వచ్చి పడిన అనర్థం. తనో కురూపి అయినా దాని ముఖానికి రాముడు కావలసి వచ్చాడు! అతడు గనుక దయదలిచి ముక్కు చెవులు కోసి ప్రాణాలతో వదిలిపెట్టాడు . మరొకరు మరొకరూ అయితే ఆమె 14,001వది అయ్యేది!"

"మీరెన్నైనా చెప్పండి. మన దశకంఠ రావణుడు చాలా శక్తిమంతుడు. కొడుకు ఇంద్రజిత్తు సాటిలేని వీరుడు. ఇహ కుంభకర్ణుడు సరే సరి. లేస్తే చాలు కుమ్మేస్తాడు. పెద్ద సైన్య బలగమూ, రకరకాల ఆయుధాలూ వున్నాయి. అలాంటి అతన్ని రాముడు ఓడించగలడా! అదికూడా కోతిమూక సాయంతో!"

పెదవి విరిచాడు.

"ఓడించడం కాదు, మట్టి కరిపించి చుక్కలు చూపిస్తాడనిపిస్తోంది నాకు . ఎంత గుండె ధైర్యం లేకపోతే ఆ కోతులతోనే వారధి కట్టిస్తూ తిన్నగా మన రాజ్యంలోకే వస్తాడు? మన బరిలోకి వచ్చి తొడగొట్ట బోతున్నాడంటే అతన్ని సామాన్యుడిగా చూడకు" మరొకరు హెచ్చరికగా అన్నారు.

''రావణుడు ఎర్రని వస్త్రాలు ధరించి, ఒళ్ళంతాఎరుపు రంగు పులుముకుని ఉండగా నల్లని దుస్తులు ధరించిన ఒకామె అతణ్ణి యమదిక్కుకి ఈడ్చుకు పోతున్నట్టూ, మన లంక సముద్రంలో మునిగి పోతున్నట్టూ సీత దగ్గరుండే త్రిజట కలగన్నదిట! అశోకవనంలో కాపలాకాసే మా అమ్మ చెప్పింది!"

కొందరి గుండెలు గుభిల్లుమన్నాయి. భయం భయంగా చూసారు.

"కలలు ఎప్పుడూ నిజం కావు గాని, రాముడు కేవలం తన భార్య కోసమే మన మహారాజుతో కయ్యానికి దిగుతున్నాడంటావా? కాదేమోరా. మనది స్వర్ణమయ లంక. ఇక్కడ బంగారు భవంతులున్నాయి. పుష్పక విమానం ఉంది. భారీ కట్టడాలూ, వనరులూ ఉన్నాయి. పంట పొలాలున్నాయి. కనువిందు చేసే ప్రకృతి ఉంది. మన రాజ్యం మీద కన్నేసి కబళించాలని వస్తున్నాడేమోనని నా సందేహం. రాజులు ఇతర రాజ్యాల మీద దండెత్తేది అక్కడి సంపద కొల్లగొట్టడానికేగా!"

"ఛా ఛా. రాముడి కథ నువ్వు విన్నట్టు లేవు. రాజ్య పట్టాభిషేకం చేయబోతుంటే సవతి తల్లి 14 ఏళ్లు అడవికి వెళ్లమని కోరిందిట. అదికూడా తండ్రి మాటగా చెప్పిందట. అయినాసరే దాన్నే పిత్రాజ్ఞగా భావించి ముని వేషం ధరించి భార్యా తమ్ముడితో వెంటనే బయలుదేరి వెళ్లిపోయాడట తెలుసా! అతడికి రాజ్యకాంక్ష ఉంటే అలా ఎలా చేయగలుగుతాడు? 'సింహాసనం మీది హక్కు నాది' అని తగువుకి దిగేవాడు గాని అన్నీ వదిలేసి కట్టుబట్టలతో అడవికెందు కెళ్తాడు చెప్పు ?"

"అవునవును. కిష్కింధ రాజు వాలిని నేల కూల్చి ఆ రాజ్యాన్ని మిత్రుడికి ఇచ్చేశాడట. కనీసం ఆ రాజ్యంలో కాలు కూడా పెట్టలేదుట. అతన్ని అనుమానిస్తే మన కళ్లు ఫెటీల్మని పేలి పోతాయి!"

అందరిలో ఏదో తెలీని జంకు ప్రవేశించింది. ఆపైన ఒక్కరూ ఒక్క మాటా మాట్లాడలేదు. అసలు నోరే విప్పలేదు!

రామేశ్వరం నుంచి మన్నారు తలైకి రామసేతు నిర్మాణం పూర్తయింది. రామలక్ష్మణులు, హనుమ సుగ్రీవాదులు సేనతో సహా లంక గడ్డ మీద విడిది చేసారు.

ఆ చేదునిజం జనం కళ్ల మీద కునుకు లేకుండా చేసింది. సముద్రం వైపు తొంగి చూడటానికి కూడా ఎవరికీ ధైర్యం చాలటం లేదు. ఉత్సుకత కొద్దీ ఎత్తైన శిఖరం ఎక్కి చూసిన వారు గుండెలు బాదుకుంటూ ఆ దృశ్యాన్ని వర్ణించారు . వారి ద్వారా మరికొంత సమాచారంతో బాటు ఆందోళన నలుదిశలకూ వ్యాపించింది. వేగుల వారి ద్వారా అందిన విశేషాలు



భయాగ్నికి ఆజ్యం పోశాయి!

ప్రజలంతా భీతావహులయ్యారన్న సంగతి రావణుడి చెవులకు చేరింది.

జన భయం మొదట తననీ, ఆ తర్వాత సైన్యాన్నీ నిర్వీర్య పరుస్తుందని కలవరపడ్డాడు. సైన్యం బలహీనపడితే తన విజయం సందేహంలో పడుతుంది. సురలోక కంటకుడైన తను ఒక సాధారణ మానవుడికి తలొగ్గడం తన అహంకారానికీ అస్తిత్వానికీ చావు దెబ్బే అవుతుంది!

వెంటనే, "రాముడు మన శత్రువు. అతడి పేరు ఎవరూ ఎక్కడా ఎప్పుడూ ఉచ్చరించరాదు. అతడినో తుచ్ఛ మానవుడిగానే చూడాలి, భావించాలి! ఈ ఆజ్ఞ అతిక్రమిస్తే తీవ్రంగా శిక్షింప బడతారు!" అంటూ ప్రకటన జారీ చేశాడు. అనుచరులు రాజ్యంలో వీధి వీధిలో చాటింపు వేశారు.

ప్రజలు మరింతగా భీతిల్లారు. అందులో నుంచి తెప్పరిల్లడానికి 'శ్రీరామ శ్రీరామ' అనుకోవడం తప్ప మరో శరణ్యమేదీ కనిపించలేదు. అందరి నోళ్లు నిశ్శబ్దంగా రామ నామ జపం చేయసాగాయి!

ఒక ఇంట్లో ఓ శుభకార్య సందర్భంగా బంధుమిత్రులు సమావేశమయ్యారు. కొన్ని క్షణాల్లోనే చర్చ రాముడి వైపు మళ్లింది.

"మన భయాలే నిజమై మన మహారాజు ఓడిపోతే ఆ తర్వాత ఏం జరుగుతుంది? మన పరిస్థితి ఏంటి?" ఒకరడిగారు జనాంతికంగా.

"గెలిచిన రాజు ఏం చేస్తాడో అదే చేస్తాడు. రాముడు మన రాజు అవుతాడు!"

"అహహ. విభీషణుడిని మన రాజు గారి గద్దె మీద కూర్చోబెడతానని ప్రమాణం చేశాట్ట. ఎవరో చెప్పుకొంటోంటే విన్నాను"

"అతడెలా పరిపాలిస్తాడో ఏమో. ఇప్పటికే పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుంది మన పని. బంగారు గోడలు, సౌధాలు ఉన్నాయన్నమాటే గాని, మనం రేయింబవళ్లూ శ్రమించినా నాలుగు వేళ్లూ నోట్లోకి వెళ్లటం లేదు. ఏది కొందామన్నా అందుబాటులో లేవు. మహారాజుకీ అతడి పరివారానికీ భౌతిక సుఖాలాలస తప్ప జనం బాగు పట్టదు. వారి బంధుమిత్రులు , సైనికులు తప్ప మిగతా వారందరి పనీ తీసికట్టు గానే ఉంది!"

'మన నగర కట్టడాలు, వైభోగం ఇవన్నీ మన మహారాజు వల్ల రాలేదు. అవన్నీ కుబేరుడు కట్టించినవే. మన నగర వెలుగంతా అతడి ఏలుబడిలో వచ్చిందే. ఆఖరికి పుష్పక విమానమూ అతడిదే. అతడు రావణరాజు సవతి సోదరుడు అయినా, అతడిని రాజ్యంలో నుంచి తరిమేసి సింహాసనాన్ని ఆక్రమించుకుని తనే మహారాజుగా ప్రకటించుకున్నాడు!"

''నిజం చెప్పావు. ఈయన హయాంలో అలంకరణలు ఆడంబరాలు తప్ప జనానికేమీ ఒరగ లేదు. అతగాడి కుటుంబ భోగ విలాసాల కోసమే మన దగ్గర ముక్కు పిండి మరీ శుల్కం వసూలు చేస్తున్నారు. చీమల పుట్టలో పాము చేరినట్టు మన సొమ్ము తో వాళ్లు పండగ చేసుకుంటున్నారు!"

"జనానిక్కావలసింది కూడు, గూడు, గుడ్డ. ఆపైన శాంతి, సామరస్యం. వాటికి పూర్తిగా కరువొచ్చేసింది. రోజురోజుకీ దరిద్రులు పెరిగిపోతున్నారు. ఆహార భద్రత కరువైంది!" బాధపడ్డారొకరు.

"రాముణ్ణి త్వరగా తమ మహారాజుగా చేయమని అయోధ్య ప్రజలంతా దశరథుణ్ణి కోరారు. ఇక్కడేమో మన అభిప్రాయంతో సంబంధం లేకుండా రావణుడు బలవంతాన అధికారం చేజిక్కించుకుని మన నెత్తి కెక్కాడు!'

"రాముడి గురించి మీరేదే గొప్పగా వూహించు కుంటున్నారు గాని, శత్రురాజు ఎవరైనా సరే గెలిచాక మన రాజ్యాన్ని సర్వనాశనం చేసి గాని పోడు. సీత ఒక మిష! పాచిక!"




"అయితే మనందరి పనీ అధోగతేనంటావా!"

"రావణరాజు ఒంటరిగా మునగడు, మనల్నీ నిలువునా ముంచేసి పోతాడు!"

"ఛా, దారుణంగా మాట్లాడకు. రాముడు ధర్మానికి ప్రాణం పెడతాడు. లేనిపోని భయాలు దరిచేర నివ్వొద్దు. రాముడు కిష్కింధలో ఏం చేసాడో ఇక్కడా అదే చేస్తాడు. విభీషణుడు రాజవుతాడు!"

"మన పని పెనం మీంచి పొయ్యిలో పడదం టావా !"

"ఊహూ పడదు. రాముడు వూరికే బాధ్యత అప్పగించి చేతులు దులుపుకొని వెళ్లిపోడు. అతనికి సుద్దులు చెబుతాడు. ఎలా ఉండాలో ఎలా పాలించాలో వివరిస్తాడు. జనసంక్షేమమే రాజు ప్రథమ కర్తవ్యం కావాలంటూ ఉద్బోధిస్తాడు. మనకు తప్పకుండా మంచి రోజులు వస్తాయి!" భవిష్యత్తులోకి ఆశావహంగా చూస్తూ అన్నారొకరు.

''అదంతా తర్వాతి సంగతి. ముందు యుద్ధగండాన్ని దాటాలిగా! యుద్ధమంటే వినాశనమే. ఎందర్ని బలి తీసుకుంటుందో, మరెందర్ని వితంతువుల్నీ, అనాథ పిల్లల్నీ చేసేస్తుందో!"

"రాజ్యంలోని యువకులంతా సైన్యంలో చేరాలని అత్యవసర ఆజ్ఞ జారీ చేస్తారని గుసగుసలు వినిపిస్తున్నాయి!"

"ష్ నెమ్మది. గోడలకు చెవులుంటాయి"

ఆ మాటలకు తమ కొడుకుల్ని సందిట్లోకి తీసుకుని బావున్నారుమన్నారు అక్కడున్న తల్లులు.

"యుద్ధాన్ని ఆహ్వానించడమంటే కొరివితో తల గోక్కోవడమే. ప్రాణ నష్టం, వనరుల నష్టం, ఆస్తినష్టం, ఆహార నష్టం-అంతా నష్టమే గాని ఒక్కటంటే ఒక్క లాభం ఉండదు. మంచి రాజు శాంతిని కోరుకోవాలి. జనం సుఖ సౌఖ్యాలు కోరుకోవాలి తప్ప పోరుకు కాలు దువ్వకూడదు!"

"మరి మన మహారాజు ఎందుకు రాముడితో యుద్ధాన్ని కోరుకుంటున్నాడు? సీతను అప్పగించి లెంపలేసుకుని తను బతికి మనల్ని బ్రతికించొచ్చుగా!"

"కామాంధుడికి సిగ్గు లజ్జ పరువు మర్యాదే కాదు బుద్ధి, విచక్షణ ఉండవు. తన సౌఖ్యం తన భోగం తన సంతోషం తప్ప వేరే ఏమీ అక్కర్లేదు. ఎవరూ అక్కర్లేదు. ఎంత మంది ఆడవాళ్ళతో తిరిగినా తృప్తి పడక పరస్త్రీ వ్యామోహంలో పీకల దాకా కూరుకు పోయాడు. అదే ఆ రాముణ్ని చూడు. భార్య అపహరించబడిందని మరో పెళ్లి చేసుకున్నాడా? మరో ఆడదాని వంక కన్నెత్తి చూసాడా? లేదే! ఆఖరికి శూర్పణఖ తన మాయాజాలంతో మోహపెట్టినా చీదరించేసాడు. అతడూ మొగుడంటే. ప్రతి మొగుడూ అలా ఉంటే ఎంత బావుణ్ణో !" అందో ఇల్లాలు.

"గొప్ప మాట చెప్పేవు. ఒకే మాట, ఒకే భార్య, ఒకే బాణం! రాముడి మార్గం తిరుగులేనిది. మన రావణరాజు సహా ప్రతి మగాడూ అతన్ని ఆదర్శంగా తీసుకోవాలి!" ఒక పెద్దాయన వ్యాఖ్యానించాడు.

"విభీషణుడి బోధ వినలేదు. తల్లిదండ్రులు, తాత చెప్పిన మంచి మాటలు చెవికెక్కలేదు. పోగాలం దాపురించిన వారు మిత్ర వాక్యం వినరని పెద్దలనేది ఇందుకేనేమో!"

"రావణుడు మన మహారాజు మనల్ని కన్న తండ్రిలా చూసుకోవాల్సిన పాలకుడు. అతడి మీద, అతడి ప్రవర్తన మీద, అతడి దక్షత సామర్థ్యాల మీద మన రాజ్యం, రాజ్య ప్రజల బాగోగులు ఆధారపడి వున్నాయి. మన శాంతి సౌభాగ్యాలే కాదు మన పిల్లల భవిష్యత్తూ ముడిపడి ఉంది. ఆ మధ్య హనుమంతుడి తోకకు నిప్పంటిస్తే ఏం జరిగింది? సగం నగరం కాలి బూడిద య్యింది! ఇప్పుడు వానరాలన్నీ కలిస్తే, మన ఇళ్లకు ఆస్తులకు పంటలకు అగ్గి ముట్టిస్తే, మొత్తం లంకా రాజ్యం నిలువునా దగ్ధమైపోతుంది. రాజ్యం కాస్తా రాబందులు తిరిగే శ్మశానం అయిపోతుంది!" ముక్కు చీదారొకరు.

"ఆ మండోదరి అయినా అతడికి ఇంత గడ్డి పెట్టి బుద్ధి చెబితే బాగుణ్ను! దేవుడా! మా మహారాజుకు మా గోడు ఎలాగూ పట్టదు . కనీసం మహారాణికైనా వినిపించు!"

చేతులు శిరస్సు మీద పెట్టుకుని శివున్ని ప్రార్థించారు .

అంతఃపురంలోని రావణస్త్రీలు, ఇతర దాసదాసీ జనం అలంకరించుకోవడం మానేశారు. ఆకలి దప్పులూ మర్చిపోయారు. నవ్వటం అంటే ఏమిటో తెలీని వాళ్ల అయిపోయారు!

"రేపు అటు ఇటు అయితే మన గతి ఏమిటి ? యుద్ధ ఖైదీలు అవుతారా లేక దానికి ముందే అగ్నిగుండంలోకి దూకి ఆత్మాహుతి చేసుకోవాలా!" అని విలపిస్తుంటే, కొత్త సంగతి దావానలంలా చుట్టేసింది.

"మీరు అజేయులే. మిమ్మల్ని దేవదానవ కిన్నెర కింపురుషులు ఎవరూ హతమార్చలేరు. కానిప్పుడు నర వానరులతో తలపడ బోతున్నారు. వారి నుంచి ప్రాణరక్షణ వరం మీకు లభించలేదని గుర్తు తెచ్చుకోండి. ఇప్పటికైనా నా మాట వినండి. రాముడు మానవమాత్రుడు కాదు. నూరు యోజనాల మహా సముద్రం మీద వారధి కట్టాడు. అతడు దైవాంశ సంభూతుడని తెలియటం లేదూ ! మీరు రోజు రోజుకీ మితి మీరి పోతున్నారు. మీ ఆగడాలు అరాచకాలు రాక్షసకృత్యాలు గతి తప్పుతున్నాయి. కామమోహాలకు బానిసై బరి తెగిస్తున్నారు. విర్ర వీగుతున్నారు. మీ దుష్కార్యాలు అరికట్టడానికి, మీ అధర్మవర్తనకు శిక్షించడానికి సాక్షాత్తు శ్రీమహావిష్ణువే శ్రీరాముడిగా అవతరించి ఉంటాడు. సందేహం

> "రావణుడు మన మహారాజు మనల్ని కన్న తండ్రిలా చూసుకోవాల్సిన పాలకుడు. అతడి మీద, అతడి ప్రవర్తన మీద, అతడి దక్షత సామర్థ్యాల మీద మన రాజ్యం, రాజ్య ప్రజల బాగోగులు ఆధారపడి వున్నాయి. మన శాంతి సౌభాగ్యాలే కాదు మన పిల్లల భవిష్యత్తూ ముడిపడి ఉంది. ఆ మధ్య హను మంతుడి తోకకు నిప్పంటిస్తే ఏం జరిగింది? సగం నగరం కాలి బూడిద య్యింది! ఇప్పుడు వానరాలన్నీ కలిస్తే, మన ఇళ్లకు ఆస్తులకు పంటలకు అగ్గి ముట్టిస్తే, మొత్తం లంకా రాజ్యం నిలువునా దగ్ధమై పోతుంది.

లేదు. ఆ మానవుడు మాధవుడే! దేవుడితో వైరం పుట్టగతుల్లేకుండా చేస్తుంది. సీతను సగౌరవంగా తీసుకెళ్లి రాముడికి అప్పగించి శరణు కోరండి. అతడు శరణాగత రక్షకుడు. సుగ్రీవుడికి, విభీషణుడికి ఇచ్చినట్టే మీకూ అభయ హస్తం ఇస్తాడు. మిమ్మల్ని ముప్పుతిప్పలు పెట్టి మూడు సముద్రాల నీళ్లు తాగించిన మహాబలుడు వాలిని ఒకే ఒక్క బాణంతో నేలకూల్చిన సంగతి ఒక్కసారి మననం చేసుకోండి. ధర్మవర్తనే రాముడి బలం, బలగం, అజేయశక్తి!" అని మండోదరి రావణుడికి హితబోధ చేసిన సంగతి బయటికి వచ్చేసింది!

'శ్రీరాముడు శ్రీ మహావిష్ణువు అవతారమా!" అని భయభీతిల్లారు. "మమ్మల్ని కరుణించు. ఇందులో మా అపరాధం ఏమీ లేదు శ్రీరామప్రభూ!' మౌనంగా మనస్సులోనే నివేదించుకోసాగారంతా .

రాజ్యమంతా విచిత్ర వాతావరణం అలుముకుంది.

అందరిలోనూ భయం తాండవిస్తోంది. రావణుడి చిత్రపటం కనిపిస్తే చాలు ఆగ్రహంతో ఊగి పోతున్నారు. ఉమ్మేస్తున్నారు. శపిస్తున్నారు!

ఇలాంటి మహారాజు పగవారికి కూడా వద్దే వద్దని భగవంతుడికి విన్నవించు కుంటున్నారు. ఈ రాజుపీడ నుంచి విముక్తి కలిగించమని మొక్కు కుంటున్నారు!

అశోకవనంలోని సీతను దర్శించే వారు అధికమయ్యారు. 'మా పని మేం చేస్తున్నాం తప్ప మా తప్పేమీ లేదు సీతమ్మ తల్లీ!' అని మొరబెట్టుకునే వారూ ఎక్కువయ్యారు.

సైనిక కుటుంబాలు ప్రాణభీతితో తల్లడిల్లి పోతున్నాయి. 'రామసేనకు ఎదురెళ్లకు. ఎక్కడికైనా పారిపోయి ప్రాణాలు దక్కించుకో' అని ఆడవాళ్లు వేడుకుంటున్నారు.

"పారిపోతే ముందే పట్టి చంపేస్తాడు ఆ క్రూరుడు. అతనికి జాలి, దయ ఉండవు. ఈయన చేతిలో కుక్క చావు చచ్చేకన్నా ఆ దేవదేవుడి చేతిలో ప్రాణాలు విడిచి జన్మధన్యం చేసుకోవడం మంచిది" బదులిస్తున్నారు.

రాజ్యంలో రామ శబ్దం నిషేధించినా దాన్ని వల్లించని నోరు లేదు. స్పందిం చని మనసు లేదు. దూరాన్నుంచైనా శ్రీరాముణ్ణి దర్శించాలని ఆరాటపడని జీవీ లేదు !

ఇంతలో అంగదుడు నగర ప్రవేశం చేశాడు. అది ప్రభంజనాన్నే సృష్టించింది!

పెను ఉపద్రవమేదో వచ్చేసినట్లు హడలి పోయారు. ఊపిరి ఆగిపోయిన అనుభూతి కలుగుతోంటే జనం ఇళ్లల్లోనే దాక్కుని తొంగి చూడసాగారు.

గతంలో హనుమంతుడు వచ్చిననాటి సంగతులు నెమరువేసుకుంటూ కంపించ సాగింది నగరప్రజ.

ఏదో 'ముసలం' లాంటిది విసిరి రాజ్యాన్ని బూడిద చేయడానికే వచ్చి ఉంటాడని గజగజ వణుకుతోంటే, అతడి రాకకు కారణం తెలిసింది.

యుద్ధ నివారణ కోసం సంధి ప్రతిపాదనతో శ్రీరాముడు అతన్ని పంపేడని తెలియడం ఆలస్యం అందరి ముఖాలూ వికసించాయి. వెర్రి సంబరం తోసు కొచ్చింది. 'బతుకు జీవుడా' అనుకుంటూ బలంగా ఊపిరి పీల్చుకున్నారు. ఆశల లతలు గబగబా చివుళ్లు తొడిగాయి. ఇళ్లల్లోంచి బయటికొచ్చి ఆ వార్త సంతోషంగా పంచుకోసాగారు.

అందరి కళ్లల్లో పండుగ సంబరం చిందేయ సాగింది! తేనెల వానలో తడిసి ముద్దయినట్టు అనుభూతిస్తున్నారు! పట్టరాని ఆనందమేదో వారి సొంత మయ్యినట్లుగా ఊగిపోతున్నారు!

'ఈ సరికే రాముడి సత్తా మన మహారాజుకి తెలిసిపోయి ఉంటుంది. ఈ అవకాశాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకుంటాడు. సీతా మహాసాధ్విని శ్రీరాముడికి అప్పగించేసి సంధి కుదుర్చుకుంటాడు. తన సుఖసంతోషాలకన్నా, తన రాజ్య ప్రజల క్షేమం ముఖ్యం అని గుర్తిస్తాడు. తప్పకుండా పశ్చాత్తాప పడతాడు. అతడిలో పరివర్తన వచ్చి తీరుతుంది!'

'అవున్నిజమే. రాముడు గొప్ప అవకాశం ఇచ్చాడు. ఇది అవకాశం కాదు గొప్ప వరం. రాజు కన్నా, రాజ పరివారం కన్నా రాజ్య ప్రజల క్షేమం, శ్రేయస్సు ముఖ్యమని తెలుసుకుంటాడు. శాంతి సౌఖ్యాలు కాంక్షించి స్నేహహస్తం చాపుతాడు. శ్రీరాముడు జనహితాన్ని, లోక కళ్యాణాన్ని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఈ గొప్ప ప్రతిపాదన పంపాడు. ఇది అతడికి మాత్రమే సాధ్యమైన కల్యాణ గుణం! ప్రభువు అంటే అతడే, కాదు...అతడొక్కడే! అతన్ని మహారాజుగా పొందే అయోధ్య ప్రజలు నిజంగా ధన్యులు!'

రావణరాజ్య ప్రజానీకం గుండెలు శ్రీరాముడికి అక్షరాలా గుడి కట్టేశాయి! ★

అరుణ

ప్రముఖ దర్శకుడు కృష్ణవంశీ ఇంతవరకూ ఇరవై చిత్రాలను తెరకెక్కిస్తే అందులో రీమేక్ ఒక్కటంటే ఒక్కటే! కెరీర్ ప్రారంభంలో మలయాళ చిత్రం 'చంద్రలేఖ'ను తెలుగులో అదే పేరుతో రీమేక్ చేశారు. మళ్లీ ఇంతకాలానికి మరాఠీ చిత్రం 'నటసమ్రాట్'ను 'రంగమార్తాండ'గా పునర్ నిర్మించారు. అక్కడ ప్రముఖ నటుడు నానా పటేకర్ పోషించిన పాత్రను ఇక్కడ ప్రకాశ్ రాజ్ చేయగా, ఇటీవల కన్నుమూసిన ప్రముఖ రంగస్థల నటుడు విక్రమ్ గోఖలే చేసిన పాత్రను బ్రహ్మానందం పోషించారు. రకరకాల కారణాల వల్ల దాదాపు మూడు నాలుగేళ్లు సెట్స్‌పైనే ఉండిపోయిన 'రంగమార్తాండ' ఎట్టకేలకు ఉగాది కానుకగా జనం ముందుకు వచ్చింది.



# మదిని కుదిపే రంగమార్తాండ

కథగా చెప్పుకోవాలంటే.. చాలా పాతది! కానీ ఇప్పటికీ వర్తించేది!! మనుషులు, వారి మనస్తత్వాలు మారనంత కాలం ఈ కథ నిత్యనూతనం. కెరీర్‌లో మునిగి తేలి, ఆపైన కుటుంబానికి తాను ఇవ్వాల్సినంత ప్రాధాన్యం ఇవ్వలేదని గ్రహించిన ప్రముఖ రంగస్థల నటుడు రాఘవరావు (ప్రకాశ్ రాజ్) కథ ఇది. ముఖానికి ఇక రంగు వేసుకోకూడదని నిర్ణయం తీసుకున్న తర్వాత ఉన్న ఆస్తిపాస్తులను కొడుకు రంగారావు (ఆదర్శ్ బాలకృష్ణ), కూతురు శ్రీదేవి (శివాత్మిక రాజశేఖర్)కి ఇచ్చేస్తాడు. అక్కడి నుండే అతనికి, అతను ముద్దుగా రాజుగారూ (రమ్యకృష్ణ) అని పిలుచుకునే భార్యకు కష్టాలు మొదలవుతాయి. కోడలు గీత (అనసూయ)తో అభిప్రాయభేదాలు రావడంతో ఇంటి నుండి బయటకు వచ్చేస్తారు. సొంతూరుకు వెళ్లి పోదామనుకున్న వాళ్లను కూతురు తన ఇంటికి తీసుకెళుతుంది. అక్కడ అల్లుడు రాహుల్ (రాహుల్ సిప్లిగంజ్)తో సఖ్యత ఏర్పడినా.. అతని కెరీర్‌కు తండ్రి అతి చేష్టలు ఎక్కడ ఆటంకంగా మారతాయో అని కూతురు భయపడుతూ ఉంటుంది. అక్కడ కూడా పొసగక పోవడంతో అర్ధరాత్రి కూతురు ఇంటి నుండి రాఘవరావు భార్యతో కలిసి బయటకు వచ్చేస్తాడు. ఆ తర్వాత అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందన్నదే ఈ చిత్ర కథ.

నటుడిగా వేదికపై రంగమార్తాండుడిగా చెలరేగిపోయిన ఓ వ్యక్తి నిజజీవితంలో ఎలా ఓడిపోయాడన్నదే ఈ చిత్ర కథ. తనవి కాని పాత్రను ఆవాహన చేసుకుని అద్భుతంగా వాటికి జీవం పోసిన ఓ నటుడు, నిజ జీవితంలో తన పాత్రను సజావుగా పోషించలేక ఎలా సతమతమయ్యాడన్నదే ఇందులోని ప్రధానాంశం. రంగస్థల కళాకారులకు ఉండే బలహీనతలను కూడా రాఘవరావు, అతని స్నేహితుడు చక్రపాణి (బ్రహ్మానందం) పాత్రల ద్వారా చూపించారు. రంగస్థలం మీద వైవిధ్యమైన పాత్రలను అలవోకగా పోషించే ఈ నటులు నిజ జీవితంలో ఎలా రాజీ పడిపోతుంటారు, ఎంత బేలగా మారిపోతుంటారనే దానిని ఈ రెండు పాత్రల ద్వారా తెలిపారు. విశేషం ఏమంటే... ఈ మొత్తం కథలో మనకు నెగెటివ్ పాత్రలు ఏవీ కనిపించవు. మారుతున్న కాలం, మారిన సమాజం, వ్యక్తుల ఆలోచనా ధోరణిలో వచ్చిన మార్పులు... తద్వారా ఎదుటి వారి వ్యక్తిత్వాన్ని వారు అంచనా వేయడంలో జరిగే పొరపాట్లే ఉన్నాయి. ఇందులో తప్పు చేసిన ప్రతి పాత్ర ఆ తర్వాత ఆత్మ విమర్శ చేసుకుంటుంది. తన ప్రవర్తనకు కారణం ఇదని వివరించే ప్రయత్నం చేస్తుంది. ఈ సినిమాకు అది ఎంతో వన్నె తెచ్చింది. అదే సమయంలో ప్రతినాయక పాత్ర లేకపోవడంతో దర్శకుడి పని కత్తిమీద సాముగా మారిపోయింది. ఏ మనిషి పూర్తిగా మంచివాడు కాదు.. అలా అని పూర్తిగా చెడ్డవాడూ కాదు. చుట్టూ ఉండే పరిస్థితులే అతన్ని మంచి, చెడుల వైపు ప్రయాణం చేసేలా చేస్తాయి. ఇందులో పాత్రలన్నీ అలాంటివే. అయితే ప్రధాన పాత్రధారి రాఘవరావు పాత్ర ద్వారా దర్శకుడు చెప్పించిన కొన్ని మాటలు అద్భుతం. ఆంగ్ల భాష మోజులో పడి, అమ్మ భాషను నిర్లక్ష్యం చేయడం సరికాదని చెప్పడం, చిన్న పిల్లలతో అశ్లీల నృత్యాలు చేయించడంపై ఆగ్రహం వ్యక్తం చేయడం వంటి సన్నివేశాలు థియేటర్లలో చప్పట్లు కొట్టిస్తాయి.

నటీనటుల విషయానికి వస్తే జాతీయ ఉత్తమ నటుడు ప్రకాశ్ రాజ్ నటన గురించి చెప్పడానికి కొత్తగా ఏమీ లేదు. అద్భుతంగా నటించాడు. అతని భార్యగా రమ్యకృష్ణ హావభావాలతోనే సన్నివేశాలను రక్తి కట్టించింది. ఆదర్శ్ బాలకృష్ణ, అనసూయ, శివాత్మిక, రాహుల్ సిప్లిగంజ్ చక్కగా తమ పాత్రలను పోషించారు. ఈటీవీ ప్రభాకర్, కాశీవిశ్వనాథ్, సన, అలీ రజా, వైజాగ్ సత్యానంద్, జయలలిత, భద్రం తదితరులు తమ పాత్రల పరిధి మేరకు నటించారు. వీళ్లందరి నటన ఒక ఎత్తు కాగా బ్రహ్మానందం ఒక్కరిది ఒక ఎత్తు. ఇంతవరకూ ఉన్న ఇమేజ్‌కు పూర్తి భిన్నమైన పాత్రను ఆయన పోషించారు. ప్రేక్షకులు దీన్ని పాజిటివ్‌గా తీసుకుంటే... సినిమా కమర్షియల్‌గా మరో స్థాయికి చేరుకుంటుంది, లేదంటే ఓ మంచి చిత్రంగా మిగిలిపోతుంది. ఎందుకంటే.. బ్రహ్మానందం హాస్పిటల్ బెడ్ మీద ఉన్నప్పుడు అతనికి, ప్రకాశ్‌రాజ్‌కు మధ్య జరిగే సుయోధన, కర్ణ సంభాషణలు ఈ మూవీకి హైలైట్. అవి ప్రేక్షకులకు కనెక్ట్ అయితే గ్రేట్!

సాంకేతిక నిపుణులలో అగ్రతాంబూలం స్వర్గీయ 'సిరివెన్నెల' సీతారామశాస్త్రికి ఇవ్వాలి. రాఘవరావు జీవితాన్ని కాచివడబోసి ఆత్మ గీతంగా అద్భుతంగా రాశారు. దానికి ఇళయరాజా స్వరాలు సమకూర్చడంతో పాటు తానే పాడారు. ఈ పాట సినిమాలో నేపథ్యగీతంగా ఐదారు కీలక సన్నివేశాలలో వస్తుంది. గుండెల్ని పిండి చేసేస్తుంది. అలానే లక్ష్మీ భూపాల 'నేనొక నటుడ్ని' అంటూ రాసిన షాయరీని చిరంజీవితో పాడించడం, అది టైటిల్స్ కార్డ్స్ మీద ప్లే చేయడంతో కథలోకి ఆడియన్స్‌ను అలవోకగా తీసుకెళ్లినట్టు అయ్యింది. మరో రెండు పాటలను కాసర్ల శ్యామ్, విజయ్‌కుమార్ రాశారు. ఇలాంటి సినిమాలకు సంభాషణలే ప్రధాన బలం. ఆకెళ్ల శివప్రసాద్ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించారు. కొన్ని సన్నివేశాలను మరింత బలంగా, కాస్తంత భారీగా చిత్రీకరించి ఉండాల్సింది. కానీ బడ్జెట్ పరమైన పరిమితులు అడ్డువచ్చినట్టుగా అనిపిస్తోంది. దాంతో ప్రొడక్షన్ పరంగా సినిమా ఓ మెట్టు తక్కువగా ఉందనే చెప్పాలి. ఏదేమైనా.. కృష్ణవంశీ మరోసారి తనలోని ప్రతిభను వెలికి తీసి, 'రంగమార్తాండ'ను ఓ అర్థవంతమైన, నేటి తరానికి అవసరమైన సినిమాగా మలిచారు. అందుకు ఆయనను, నిర్మాతలు మధు కాలిపు, ఎన్. వెంకటరెడ్డిని అభినందించాలి.

వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్


శ్రీరామనవమి శుభాకాంక్షలతో..
SREE MADHAVA HANDLOOMS
# 6-3-19, Vednagar, Gadwal - 509125, Telangana.
MANUFACTRERS OF GADWAL SAREES
Branch @ 3rd floor padma plaza, Opp. Deepak Theatre lane, Narayanaguda, Hyderabad.
గద్వాల్ చీరలు మొత్తం పత్తితోనే తయారు చేస్తారు. చీర అంచులకు పట్టును నేస్తారు.
ఈ చీరలు తక్కువ ధరతో, తక్కువ బరువుతో మీకు అందుబాటులో దొరుకుతున్నాయి.
ఈ చీరలను దేవాలయాలకు, పెళ్లిళ్లకు, విహార యాత్రలకు ఎక్కడికైనా, ఎవరైనా ధరించవచ్చు.
ఈ చీరలను ధరించడం వల్ల మీరు మరింత ఆకర్షణీయంగా కన్పిస్తారు.
కాబట్టి ఇప్పుడే త్వరపడి.. మా షాపులను సందర్శించండి.
GopalRao Akbote - 9440703366 | Suresh Akbote - 9440395966
Naveen Akbote - 9866074440 | Shiva akbote - 9701008666 (Hyd)


శ్రీ శోభకృత్ నామ సంవత్సర
ఉగాది మరియు
శ్రీరామనవమి
శుభాకాంక్షలు
శ్రీమతి & శ్రీ చింతల అరుణ - సురేందర్ యాదవ్
నాగోల్ డివిజన్ కార్పొరేటర్
బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి




## తెలుసుకుందాం

# మర్కూక్ వరదరాజస్వామి ఆలయం



తెలంగాణలోని సిద్ధిపేట జిల్లా, మర్కూక్ మండలం, వరదరాజాపూర్ గ్రామంలో ఈ దేవాలయం కొలువుదీరింది. ఇక్కడున్న వాగుకు తరచూ వరదలు వచ్చి స్థానికులకు తీవ్ర ఆస్తి నష్టం కలిగేది. గ్రామస్తులు విష్ణుమూర్తిని శరణువేడగా వరదరాజస్వామిగా ఈ ప్రాంతంలో వెలిశాడని పురాణ కథ. ప్రతి శనివారం ఈ ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తారు. ఏటా జ్యేష్ఠ శుద్ధ అష్టమి నుండి బహుళ విదియ వరకు బ్రహ్మోత్సవం, రథోత్సవం జరుగుతుంది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటారు.

## కథ | ఏది శిక్ష?

నందనగిరి రాజ్యాన్ని ప్రవీణుడు అనే రాజు పరిపాలిస్తున్నాడు.

రాజు మంచివాడే. కానీ కోపం ఎక్కువ. కోపం వస్తే ముందూ వెనకా ఆలోచించేవాడు కాదు. దానికి తోడు అతను రాజు కావడంతో కోపంతో అతను చేసే ఆజ్ఞలు, విధించే శిక్షలు వెంటనే అమలైపోయేవి.

ఒకనాడు మహారాజు భోజనం చేయడానికి కూర్చున్నాడు.

రాజుకు ఎంతో నమ్మకస్తుడు, మంచివాడు, పాకశాస్త్రంలో ఆరితేరినవాడు అయిన ధర్మయ్య అతని వద్ద వంటవానిగా ఉండేవాడు.

ఆరోజు ధర్మయ్య వంట మొత్తం చేసిపెట్టి కుమారునికి అనారోగ్యంగా ఉండటంతో వైద్యుని వద్దకు తీసుకువెళుతూ మహారాజుకి వడ్డించే బాధ్యతను మరొక వ్యక్తికి అప్పగించాడు.

ఆ వ్యక్తి వడ్డించాడు. రాజు కూర కలిసిన అన్నం తినడానికి నోట్లో పెట్టుకోగానే కారం ఎక్కువై నాలుక చుర్రున మండింది.

దాంతో ఆగ్రహించిన రాజు "వంట



## పద్యము

**లావుగలవాని కంటెను**
**భావింపఁగ నీతిపరుఁడు బలవంతుండౌ**
**గ్రావంబంత గజంబును**
**మావటివాఁడెక్కినట్లు మహిలో సుమతీ!**

**భావం :** లోకమునందు శరీరబలమున్న వాని కంటే న్యాయంగా ఉండువాడు బలవంతుడని లెక్కించుకోవాలి. ఎట్లనగా పర్వతమంతటి ఏనుగు కంటెనూ, చిన్నవాడైన మావటివాడు అట్టిదానిని లొంగదీసుకొని ఎక్కుచున్నాడు కదా! శరీర బలం కలవాని కంటే బుద్ధి బలం కలవాడే అసలైన బలవంతుడని అర్థం.

## శ్లోకము

**'న చ విద్యాసమో బంధుః**
**న చ వ్యాధి సమోరిపుః**
**నచాపత్యసమస్నేహో**
**నచ దైవాత్పరం బలమ్'**

**భావం :** విద్యతో సమానమైన బంధువు లేదు. వ్యాధితో సమానమైన శత్రువు లేదు. సంతాన ప్రేమను మించిన ప్రేమ లేదు. దైవం (అదృష్టం)ను మించిన బలం లేదు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| పులికాట్ | ఒడిశా |
| దాల్ | కేరళ |
| సస్తానం కొట్ట | మహారాష్ట్ర |
| లోనార్ | జమ్ముకశ్మీర్ |
| చిల్కా | ఆంధ్రప్రదేశ్ |

**సమాధానాలు :** పులికాట్-ఆంధ్రప్రదేశ్; దాల్-జమ్ముకశ్మీర్; సస్తానం కొట్ట-కేరళ; లోనార్-మహారాష్ట్ర; చిల్కా-ఒడిశా.

## భారత స్వాతంత్య్ర సమరయోధులు

### సత్యవతి దేవి



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, రచయిత్రి. ఈమె **1904**లో ఢిల్లీలో జన్మించారు. అరుణా అసఫ్ అలీ జాతీయవాద ఉద్యమంలో చేరడానికి ప్రేరణనిచ్చింది ఈమెనే. సత్యవతి శాసనోల్లంఘన ఉద్యమంలో చురుగ్గా పాల్గొనడంతో పాటు ఆ ఉద్యమ సమయంలో ఢిల్లీలో కాంగ్రెస్ మహిళా విభాగానికి నాయకత్వం కూడా వహించారు. ఉప్పుసత్యాగ్రహంలోనూ పాల్గొన్నారు. **1945**లో తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. తెలుగు సినీ చరిత్రలో మొట్టమొదటిసారి ఆస్కార్ వరించిన 'నాటు నాటు' పాట రచయిత, స్వరకర్త ఎవరు?
2. బొకారో బొగ్గు క్షేత్రం ఏ రాష్ట్రంలో ఉంది?
3. మినీ నయాగరా ఆఫ్ ఇండియా అని ఏ జలపాతాన్ని పిలుస్తారు?

**సమాధానాలు :** 1. చంద్రబోస్, ఎం.ఎం. కీరవాణి; 2. జార్ఖండ్; 3. చిత్రకూట్ (ఛత్తీస్‌ఘడ్)

## మెదడుకు మేత

ఐదుగురిలో బుడ్డోడు, పెళ్లికి మాత్రం పెద్దోడు?

**జవాబు :** చిటికెన వేలు

చేసింది ఎవరు?' అని ప్రశ్నించాడు.

'ధర్మయ్య' అని అతను చెప్పాడు.

రాజు వెంటనే నేరస్థులకు శిక్ష అమలు చేసే అధికారిని పిలిచి 'ధర్మయ్యను బంధించండి. ఎల్లుండి తెల్లవారే అతనికి ఉరిశిక్ష విధించండి' అని ఆజ్ఞ జారీ చేశాడు.

ధర్మయ్యను బంధించి కారాగారంలో వేశారు.

మరుసటి రోజు ప్రవీణుడు కొలువుతీరి ఉండగా తను ఒకసారి రాజును కలుసుకోవాలని ధర్మయ్య భటులను కోరాడు.

రాజు అంగీకరించడంతో భటులు అతనిని కొలువుకు తీసుకొచ్చారు.

'చనిపోయే వ్యక్తి ఆఖరి కోర్కె తీరుస్తారు కదా! నాకు ఒక విల్లు, బాణం కావాలి' అని ధర్మయ్య అడిగాడు.

భటులు అవి తెచ్చి ఇవ్వగానే ధర్మయ్య 'ఇప్పుడు నేను ఈ బాణాన్ని రాజు మీదికి వదలాలనుకుంటున్నాను' అన్నాడు.

వెంటనే భటులు అతనిని బంధించారు.

అప్పుడు ధర్మయ్య 'మహారాజా! వంటలో కారం ఎక్కువైనందునే నన్ను ఉరి తీయించారనే కళంకం మీకు రాకూడదు. అందుకే ఇలా చేశాను. ఇక నన్ను ఉరి తీయండి' అన్నాడు.

అతని మంచితనానికి సంతోషించిన రాజు శిక్ష రద్దు చేసి, అతని ఆంతరంగికునిగా నియమించుకున్నాడు. ★

## మంచిమాట

**నీ సంకల్పం సిద్ధించుటకు ఆత్మనిగ్రహం, మౌనం అలవర్చుకోవాలి!**

## రంగులు వేయండి



## చుక్కలు కలపండి





మీకు, మీ కుటుంబ సభ్యులకు
శ్రీ శుభకృత్ నామ సంవత్సర
ఉగాది మరియు శ్రీరామనవమి
శుభాకాంక్షలు
AMRUTHA
Children's hospital
24 HOURS EMERGENCY SERVICES AVAILABLE
* Note : 2Free Visits in 7days
R.T.C. Bus Stand Back Side, R.B. Nagar, Shamshabad, Ranga Reddy Dist. T.S. - 501218.
Contact : 08413-222967 | 78939 00706 | Email: amruthachildrenshospital7@gmail.com




శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది, శ్రీరామనమి శుభాకాంక్షలతో..
SUREKHA CATERERS
Vegetarian Dishes For All Occasions
K. Rajasekhar Sarma
98494 86193, 9502112616
42B, Income Tax Colony, Mehdipatnam, Hyderabad - 28




Wish you HAPPY UGADI & SRIRAMA NAVAMI
ISHWAR KUMAR NAREDI B.E.(Mech)
Proprietor
Off : 64540692, 23720171
Cell : 9849536579
SHIV ENTERPRISES
Manufacturers of :
Press Components, Deep Dwawing Components,
Metal Froming (Spinning) In Ferrous & Ferrous Metals
Plot no.113, CIEEP Gandhinagar, Balanagar Township, Hyderabad- 500037
They only live who live for others - Vivekananda


హిందూ బంధువులందరికి
శ్రీ శోభకృత్ నామ సంవత్సర
ఉగాది &
శ్రీరామనవమి
శుభాకాంక్షలు
ఆకుల శ్రీవాణి అంజన్
సరూర్‌నగర్ డివిజన్
నాయకులు, కార్యకర్తల బృందం

# వారఫలాలు

27 మార్చి - 02 ఏప్రిల్ 2023



సింహంభట్ల సుబ్బారావు
6300674054

### మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ముఖ్య పనులు నత్తనడకన సాగుతాయి. ఆదాయం పెరిగినా ఖర్చులూ తప్పక పోవచ్చు. శారీరక రుగ్మతలు కొంత ఇబ్బంది పెట్ట వచ్చు. నిర్ణయాలు కొన్ని మార్చుకుంటారు. ఆస్తి వివాదాల పరిష్కారం కోసం మరింత శ్రమిస్తారు. భూములు, ఆభరణాలు సమకూర్చుకుంటారు. వ్యాపారులకు లాభాలు. 29, 30 తేదీల్లో శుభ వార్తలు. వాహనయోగం. దత్తస్తోత్రాలు పఠించండి.

### వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

అదనపు ఆదాయంతో ఉత్సాహం. కొన్ని సమస్యలు స్వయంగా పరిష్కరించుకుంటారు. వాహనాలు, భూములు కొంటారు. నిరుద్యోగులకు ఒక ప్రకటన వరంగా మారనుంది. వ్యాపారులకు మెరుగైన లాభాలు. కళాకారులకు పురస్కారాలు. పారిశ్రామికవేత్తలు, రచయితలు ఆహ్వానాలు అందుకుంటారు. 1,2 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిడులు. శివపంచాక్షరి పఠనం ఉత్తమం.

### మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు. వాయిదాపడిన పనులు పూర్తి చేస్తారు. కొన్ని కీలక నిర్ణయాలలో కుటుంబ సభ్యులను సంప్రదిస్తారు. దైవ కార్యక్రమాలు చేపడతారు. గృహనిర్మాణ యత్నాలు అనుకూలం. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు అనుకూలస్థితి. కళాకారులు, వైద్యుల సుదీర్ఘ నిరీక్షణ ఫలిస్తుంది. 27, 28 తేదీలలో దుబారా ఖర్చులు. స్వల్ప అస్వస్థత. గణేశాష్టకం పఠించండి.

### కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

అనుకూల సమయం. ఇష్టమైన వ్యక్తులు దగ్గరవుతారు. ఆస్తి వివాదాలు తీరతాయి. ఇంట్లో శుభకార్యాలు నిర్వహిస్తారు. గృహ నిర్మాణాలు లేదా కొనుగోలులో స్వల్ప అవాంతరాలు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు. రాజకీయ వేత్తలకు ప్రజాదరణ. క్రీడాకారులు, పరిశోధకులకు పట్టింది బంగారమే. 30, 31 తేదీల్లో కుటుంబంలో ఒత్తిడులు. మానసిక అశాంతి. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

### సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆదాయ వనరులు సంతృప్తినిస్తాయి. నిరుద్యోగులకు అనుకోని అవకాశాలు. ఉద్యోగ వర్గాలకు విధి నిర్వహణలో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయవేత్తలకు అనుకూల పరిస్థితులు నెలకొంటాయి. రచయితలు, వైద్యులకు మరింత సానుకూలమైన సమయం. 31, 1 తేదీల్లో వృథా ఖర్చులు. బంధువులతో తగాదాలు. ఆంజనేయస్వామి అర్చనలు మంచిది.

### కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. దేవాలయాలు సందర్శిస్తారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ప్రశంసలు. వ్యాపారులు తమ అనుభవాలతో విస్తరణ యత్నాలు పూర్తి చేస్తారు. పారిశ్రామికవేత్తలు విజయాలు సాధిస్తారు. కళాకారులు, రచయితలకు శుభవార్తలు. 1, 2 తేదీల్లో స్వల్ప రుగ్మతలు. ఆకస్మిక ప్రయాణాలు. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.

### తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ముఖ్య నిర్ణయాలు సకాలంలో తీసుకుంటారు. నూతన విద్యావకాశాలు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులకు స్వల్ప లాభాలు. ఉద్యోగులకు ఎట్టకేలకు సమస్యలు తీరతాయి. పారిశ్రామికవేత్తలకు విదేశీ పర్యటనలు. కళాకారులు, క్రీడాకారులకు అవకాశాలు ఊహించని రీతిలో లభిస్తాయి. 27, 28 తేదీలలో లేనిపోని ఖర్చులు. మనశ్శాంతి లోపిస్తుంది. సూర్యారాధన మంచిది.

### వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్యాల్లో చురుగ్గా పాల్గొంటారు. రావలసిన బాకీలు కొంతమేర అందే సూచనలు. ఆస్తి వివాదాల నుంచి ఊరట. నిరుద్యోగులకు ఉద్యోగ లాభాలు. ఆరోగ్యం కుదుటపడుతుంది. వ్యాపారులకు లాభాలు. రాజకీయవేత్తలకు సంతోషకరమైన సమాచారం. క్రీడాకారులు, వ్యవసాయదారులు కొన్ని ప్రయోజనాలు పొందుతారు. 30,31 తేదీల్లో బంధువిరోధాలు. దూరప్రయాణాలు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

### ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

కొన్ని కార్యక్రమాలు శ్రమానంతరం పూర్తి చేస్తారు. ఆదాయం ఆశించినమేర ఉండి అవసరాలు తీరతాయి. శారీరక రుగ్మతలు కొంత తగ్గుతాయి. దూరప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి. స్థిరాస్తి వివాదాల పరిష్కారంలో కొంత సఫలం. ఉద్యోగులకు ఆకస్మిక మార్పులు సంభవం. 30, 31 తేదీల్లో చర్చల్లో ప్రతిష్టంభన, ఆప్తులతో విభేదాలు. విష్ణు సహస్రనామ పారాయణ చేయండి.

### మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

మీ ఆశయాలు కొన్ని నెరవేరతాయి. గతంలో నిలిచిపోయిన పనులు పూర్తిచేస్తారు. వాహనాలు, స్థలాలు కొంటారు. ఉద్యోగ యత్నాల్లో పురోగతి. దేవాలయాలు సందర్శిస్తారు. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు. రాజకీయ వేత్తలు పదవుల అన్వేషణలో సఫలం చెందుతారు. రచయితలు, క్రీడాకారులకు ఆహ్వానాలు. 28, 29 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. బంధువిరోధాలు. శ్రీరామరక్షా స్తోత్రాలు పఠించండి.

### కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఆర్థికంగా పురోగతి ఉంటుంది. జీవితాశయం నెరవేరు తుంది. వాహనాలు, స్థలాలు కొంటారు. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు కీలక మార్పులు పొందుతారు. రాజకీయ, పారిశ్రామికవేత్తలు ఇబ్బందుల నుండి బయటపడతారు. వైద్యులు, క్రీడాకారులకు శుభవార్తా శ్రవణం. 30,31 తేదీల్లో దూరప్రయాణాలు. కుటుంబంలో సమస్యలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

### మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఆదాయ, వ్యయాలు సమానం. ముఖ్య పనులు సవ్యంగా పూర్తవుతాయి. ఇంటా బయటా ఎదురులేని పరిస్థితి. ఆరోగ్య సమస్యలు కొంత చికాకు పరుస్తాయి. ఇంటి నిర్మాణాల్లో ప్రగతి. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు హోదాలు అనుకోని విధంగా దక్కవచ్చు. కళాకారులు, వైద్యులకు ఒత్తిడులు తొలగుతాయి. 31, 1 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. శ్రమ తప్పదు. శివాష్టకం పఠించండి. ★

# పదరసం-408

### ఆధారాలు

**అడ్డం**

1. శుభకృతు తర్వాతి ఉగాది (4)
3. యేడు (4)
6. ధాన్యాదులపై పొట్టు లేక పొల్లు (2)
8. సంతోషపడు (3)
9. అటుగా వృక్షము (3)
11. గౌరవవాచకం (1)
12. గ్రామదేవతా ఘటములు (4)
13. '...కాక మోక్షగామి కాదు' (2)
14. పట్టణము (3)
16. పైజమాపైన ధరించేది (2)
19. జంబూకము (2)
21. పుట్టుక, హేతువు (3)
22. వాసనగల పొగ (2)
24. వాయసము (2)
25. నాలుక, లక్ష్మి (2)
26. రాట్నము (3)
27. అటుగా కనము (3)
29. అనేక విధములైన, పలు (2)
31. అటుగా మన్మథుడు (3)
32. ఆమ్రఫలము(5)

**నిలువు**

1. ఇదే వాల్మీకికి శ్లోకము రూపంలో మొదట వచ్చిందంటారు (3)
2. యుగాలలో ఇది ఒకటి (5)
4. అడవి, కోట (3)
5. నాట్యవేదిక, యుద్ధక్షేత్రం (4)
7. తిథివార నక్షత్ర కరణయోగా సమన్విత (4)
10. ఇండోనేషియా రాజధాని (3)
15. రమ్యమైన చూపు అనే, ఒక వ్యాఖ్యాన గ్రంథం పేరు (6)
16. జాగిలము, కాలభైరవము (2)
17. ఆమని (4)
18. ఇది ఒక నది. ఓ ముఖ్య నాగరికత (2)
20. పరభృతము (3)
23. అనుమానాస్పద మరణానికి నిర్వహించేది (4)
28. ఆభరణము (2)
30. వేదిమి, బాధ

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | | 2 | | ✠ | 3 | 4 | | 5 |
| 6 | | ✠ | | ✠ | 7 | ✠ | | ✠ | |
| ✠ | 8 | | | ✠ | | ✠ | 9 | 10 | |
| 11 | ✠ | ✠ | 12 | | | | ✠ | 13 | |
| ✠ | 14 | 15 | | ✠ | | ✠ | 16 | | ✠ |
| 17 | ✠ | | ✠ | 18 | ✠ | 19 | | ✠ | 20 |
| 21 | | | ✠ | 22 | 23 | ✠ | ✠ | 24 | |
| | ✠ | 25 | | ✠ | 26 | | | ✠ | |
| 27 | 28 | | ✠ | 29 | | ✠ | ✠ | 30 | ✠ |
| ✠ | 31 | | | ✠ | 32 | | | | |

**పదరసం – 408**

పేరు : ..........................................................................................

చిరునామా:..........................................................................................

..........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..........................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 ఏప్రిల్ 3 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 404 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 రా | మ | 2 కృ | ష్ణ | ✠ | 3 శా | 4 ర | దాం | 5 బ |
| 6 ఉ | హా | ✠ | క్షీ | ✠ | 7 ప | ✠ | భ | ✠ | హా |
| ✠ | 8 కా | లు | ప | ✠ | లా | ✠ | 9 వ | 10 ర | మ |
| 8 నె | ల | ✠ | 12 లు | లా | యు | ము | ✠ | 13 మ | తి |
| ✠ | 14 ము | 15 గు | డు | ✠ | నం | ✠ | 16 వా | ణి | ✠ |
| 17 అ | ✠ | రూ | ✠ | 18 ఒ | ✠ | 19 పై | డి | ✠ | 20 భా |
| 21 ను | దు | వ | ✠ | 22 సే | 23 వ | ✠ | ✠ | 24 కే | వ |
| కం | ✠ | 25 దే | హం | ✠ | 26 యా | చ | న | ✠ | క |
| 27 వ | 28 లా | శ | ✠ | 29 న | గ | ✠ | ✠ | 30 కే | ✠ |
| ✠ | 31 గు | ము | కు | ✠ | 32 రా | ఘ | వ | రా | వు |

**విజేతలు:** అంకం పావని, బుగ్గ రాజశేఖర్, ఎం.హరగోపాల్, సోమావరుణ్, ఉడాలి భాస్కరయ్య, గిరీష్ ప్రభు, శిరీష, సుభాష్‌చంద్రబోస్, కాటబత్తిని శంకర్, యం.అనిత, శివరామయ్య, సిహెచ్.జ్యోతి, కె.సత్యనారాయణ, కె.ఎస్.వి.ఎన్. గణేష్‌కుమార్, వి.రామలింగాచారి, వి.లక్ష్మీదేవి, జి. వెంకటేశ్వరమ్మ, ఉమామహేశ్వర శర్మ, డా.ధన్వంతరి, కె.సత్యప్రసాద్, డా. గున్నోజు శ్రీనివాసచారి, జి.పూర్ణకుమారి, ఎస్.వి.సుబ్బారావు, యం.పాండురంగాచారి, జి.వి.మురళీ మోహన్, ఎస్.ఇంద్రజిత్, ఎస్.రాజ్యలక్ష్మి, ఆర్.అంజనీదేవి.

**బహుమతి పొందిన విజేత: డా.కడలి ప్రకాశరావు, విజయనగరం జిల్లా.**



శ్రీ శోభకృత్ నామ సంవత్సర
ఉగాది మరియు శ్రీరామనవమి
శుభాకాంక్షలు
డా॥ కొత్తపల్లి శ్రీనివాస్
(భాజపా అధ్యక్షులు)
కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా
డా॥ కొత్తపల్లి అనిత
శ్రీ సరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షురాలు
కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా

# Portland Ugadi Utsav









Hindu Swayam Sangh USA,Oregon Vibhag, Portland Chapter wishes Shubh Ugadi and Sri Rama Navami!!

Hindu SwayamSevak Sangh USA, Oregon Vibhag, Portland Chapter's

**Shobhakrita Nama Ugadi Utsav**

(Varsha Pratipada) was celebrated on sunday march 19th 2023 in Hillsboro, oregon. Hindu bandu have come together in a great sankhya of over 340 For this event. Event was well organized with performances by the Sevikas and Swayamsevaks, Bala, Yuva, Kishore and Tarun. Program concluded with Prarthana and Dinner potluck.

Event Performances:
Songs, Dances, Skits
Shibhashitam and Amruthavachan

Oregon Vibhag Ugadi was attended by
Sri Ajay Vangapati - Vibhag Karyavah
Sri Venkat Gogireddy - Vibhag Sah Karyavah
Sri Krishna Murthy Wonnimarri - National Sewa Pramukh and
Sri Pranav Joshi was Vaktha for the event.

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 23


# G. PULLA REDDY
## DEGREE & P.G. COLLEGE

(Affiliated to Osmania University)

**MEHDIPATNAM,** HYDERABAD - 28

**Ph : 23513154**

**English Medium** **Estd 1994** **Co-Education**

**(A College Striving for Excellence in Quality Education)**

## COURSES OFFERED

**B.Sc** (M.S.Cs) (M.P.Cs) (M.E.Cs)

**B.B.A**

**B.Com** (Computers Applications) (General)

**M.Sc** (Mathematics) (Physics)

**WE HAVE :** ✦ Well Equipped Labs & Library ✦ Qualified & Experienced Faculty ✦ Well Furnished Classrooms ✦ Campus Placements

**For Details contact office between *10.00 A.M. & 5.00 P.M***

**PRINCIPAL**